భక్తియుక్తి భూషణ రాంబు

13480

శ్రీ

భక్తమణిభూషణము.

గ్రంథకర్త

ఆదిపూడి సోమనాథరావు,

ముద్దుకృష్ణ మొదలివీధి, మైలాపూరు, మదరాసు.

మొదటికూర్పు 1000 ప్రతులు

వెల రు 2-0-0.

కాకినాడ,

స్కేప్ అండుకో ముద్రాక్షరశాలయందు ముద్రితము

1922

All Rights Reserved

ఓమ్

అంకితము

సీసపద్యము

పరమేశునాజ్ఞల ♦ భక్తినా దలఁదాల్చి
పాలించుచుండెడు ♦ భక్తులార!
ప్రాణిమాత్రమునకు ♦ భద్రమ్ముఁ గొల్పెడు
పనిఁబూనియుండు కృ ♦ పాళులార!
న్యాయసత్యములతో ♦ నలరారుచుండెడు
పూతభావంబొప్పు ♦ పూజ్యులార!
ప్రేమసూత్రముచేతఁ ♦ బృథ్విని బంధించి
యానందపడెడు మ ♦ హాత్ములార!

గీ: భక్తమణిభూషణంబను ♦ భవ్యకృతిని
దీనినాకాన్కగామీకుఁ ♦ దెచ్చినాఁడ
స్వీకరింపుఁడు పరమ ప ♦ విత్రులార!
మిత్రవరులార! ఈశ్వర ♦ పుత్రులార!

ఆదిపూడి సోమనాథరావు

ధర్మము

గీతమాలిక.

నన్నునమ్మెడువారలు ♦ న్నారుగాన
ననృతమ్మునువీడి సత్యమ్మె ♦ యాడుచుందు;
నన్ననుసరించువారలు ♦ న్నారుగాన
విమలతరవర్తనంబున ♦ వెలయుచుందు;
పడవలసియుండు నెన్నియో ♦ పాట్లుగానఁ
దగినయుత్కృష్ట బలమును ♦ దాల్చియుందు;
కడఁగిపోరాడు తరుణముల్ ♦ గలవుగాన
ధైర్యశౌర్యమ్ములనుగల్గి ♦ తనరుచుందు;
వైరులకు దిక్కులేనట్టి ♦ వారలకును
నందఱకుమిత్రుఁడై భువి ♦ నలరుచుందు;
ఇత్తునేకాని యిచ్చిన ♦ దెంచకుందు;
ఎల్ల నాలోపములునాకు ♦ నెఱుకగాన
వినయగుణమును నెప్పుడు ♦ విడువకుందు;
ప్రభునిపైజ్ఞానదృష్టిని ♦ బఱపుచుందు;
నెవ్వగలవాని చిఱునవ్వు ♦ నవ్వుచుందు;
ఇలఁబతితులైనవారల ♦ నెత్తుచుందు;
ఎల్లప్రాణులనరసి ప్రే ♦ మించుచుందు;
ఇదియె నాధర్మమని మది ♦ నెంచుచుందు.

శ్రీ

సర్వమాన్యశతకము.

సీ. శ్రీకరుణాసుధా ♦ సింధువై లోకైక
బంధువై పొల్చునీ ♦ బాంధవమును
నిఖిలభూతగణైక ♦ నేతవై విబుధ సం
త్రాతవై యలరు నీ ♦ ప్రాభవమును
రమణీయభువన ని ♦ ర్మాయివై సంతోష
దాయివై తనరు నీ ♦ సోయగమును
ధార్మికోత్సాహ సం ♦ ధాతవై ఋషులకు
నూఁతవై యొప్పు నీ ♦ యొప్పిదమును

గీ. దలఁచిదర్శించువేడ్క చి ♦ త్త మునఁబొదల
శతకమును గాన్క గాఁగొని ♦ సంభ్రమమునఁ
గొల్వవచ్చితిఁజూపు నీ ♦ చెల్వుతండ్రి!
సకలకల్యాణగుణధన్య! ♦ సర్వమాన్య!

సీ. వీనులవిందుగా ♦ వింపుగానమునందు
దృష్టిపర్వమొనర్చు ♦ సృష్టియందు
రసనోత్సవముసేయు ♦ నసమానరుచియందు
హితమగు మందమా ♦ రుతమునందు
నాసికానందము ♦ వాసనావళియందు
మహిమచేనొప్పు స ♦ న్మానమునందు
వివిధసాంసారిక ♦ విషయసౌఖ్యములందు
విద్యావినోదాది ♦ విధులయందు

గీ. నిన్నునవ్యయు నిఖిలాత్ము ♦ నిర్వికారుఁ
బ్రేమసాగరు యోగీంద్ర ♦ హృద్విహారుఁ
జూచి సంతోషభరమున ♦ జొక్కుచెపుడు
సకలకల్యాణ గుణధన్య! ♦ సర్వమాన్య!

సీ. సిగనిగమనిమించు ♦ నీరజారినిగాని
ధగధగవెలిఁగెడు ♦ తరణిఁగాని
మ్రాకులఁగదలించు ♦ మారుతమ్మునుగాని
యడవులఁగాల్చెడు ♦ నగ్నిఁగాని
ధారగాఁగురిసెడు ♦ ధారాధరముఁగాని
యలలచేనుప్పొంగు ♦ జలధిఁగాని
జలజలఁబ్రవహించు ♦ సెలయేఱులనుగాని
తిరముగాఁబొల్చెడు ♦ గిరులఁగాని

గీ. చూచినపుడెల్లవానిలోఁ ♦ జూచునిన్ను
మనములోఁజూచి యానంద ♦ మగ్నుఁడగుచు
వెలయుభాగ్యంబునాకు ల ♦ భించుటెపుడు?
సకలకల్యాణ గుణధన్య! ♦ సర్వమాన్య! 3

సీ. లోకజాలము నెల్ల ♦ వీఁక మైఁ దాల్చుచుఁ
బ్రబలమై మించు నీ ♦ బలమె బలము
అఖిలాండముల నెల్ల ♦ నద్భుతంబుగఁ జేయు
నేర్పరి వైన నీ ♦ నేర్పె నేర్పు
పరమాణువాదిగా ♦ బ్రహ్మాండములయందు
నిండియుండెడు నీదు ♦ నింపె నింపు
కోటిసూర్యుల నైన ♦ సాటిసేయఁగ లేని
దేదీప్యమానీదు ♦ తేజె తేజు

గీ. పారమే లేని నీదయా ♦ వార్ధివార్ధి
పాపదావాగ్నిలోఁబడి ♦ భస్మమైన
మమ్ముఁ బునరుద్ధరించు నీ ♦ మహిమ మహిమ
సకలకల్యాణ గుణధన్య! ♦ సర్వమాన్య!

సీ. భీష్మపరితాపుఁడౌ ♦ గ్రీష్మభానుండైన
మిడుఁగురుఁబుసీపేర్మి ♦ కడఁకముందుఁ
బదియాఱుకళలచేఁ ♦ బొదలుచందురుఁడైన
నద్దంపుముక్కసీ ♦ యశముముందుఁ
బ్రావృడాగమమందుఁ ♦ బ్రవహించునదులెల్లఁ
దుంపరల్ సీదయా ♦ ధునికిముందు
నేము వాసముచేయు ♦ నీలోకమంతయు
నలుసుగా! నీలోక ♦ ములకుముందు

గీ. నహహా! నీమహిమాదుల ♦ నభినుతింప
నధములకు మాకుఁదరమౌనె ♦ యఖిలయోగి
మండలికిఁగూడ నలవిగా ♦ కుండునపుడు
సకలకల్యాణగుణధన్య! ♦ సర్వమాన్య!

సీ. నీమహామహిమచే ♦ నిఖిలబ్రహ్మాండముల్
దివివిమానములట ♦ దేలుచుండు
నీమహాశక్తిచే ♦ నెఱిబొంగరమ్ముల
తీరున గిర గిరఁ ♦ దిరుగుచుండు
నీమహాశాసన ♦ నియతిచే నొండొంటిఁ
దాఁకకతమదారిఁ ♦ దరలుచుండు
నీమహాదీప్తిచే ♦ నిండురసంపు గుం
డులమాడ్కి నిగనిగ ♦ వెలుఁగుచుండు

గీ. నహాహా! నీమహిమాదుల ♦ యద్భుతంబు
దలఁచినంతన దేహంబు ♦ పులకరించి
కనులనానందబాష్పముల్ ♦ గ్రమ్మికురియుఁ
సకలకల్యాణగుణధన్య! ♦ సర్వమాన్య!

సీ. ఏకడఁజూచిన ♦ నాకడనుండి నీ
కరుణాప్రవర్షంబె ♦ కురియుచుండు
నేవంకఁజూచిన ♦ నావంకనుండి నీ
వేదనినాదంబె ♦ వెడలుచుండు
నేజాడఁజూచిన ♦ నాజాడనుండి నీ
తేజోవిలాసంబె ♦ తెరలుచుండు
నేచాయఁజూచిన ♦ నాచాయనుండి నీ
ఖ్యాతిసుగంధమ్మె ♦ క్రమ్ముచుండు.

గీ. నెచటఁజూచిన నచ్చట ♦ నిండునిండు
నీప్రభావంపు నిగనిగల్ ♦ నిర్వికార!
దీనమందార! భక్తసు ♦ ధీవిహార!
సకలకల్యాణగుణధన్య! ♦ సర్వమాన్య!

సీ. త్రిభువనసౌందర్య ♦ విభవంబులోనెల్ల
శృంగారరసమె యు ♦ ప్పొంగుచుండు
ఋతుపరంపరల యా ♦ యుతమందు వీక్షింప
వీరమచ్చటవెల్లి ♦ విరియుచుండు
సకలజీవావన ♦ సత్కార్య సరణిలో
పలఁ గరుణారసం ♦ బొలుకుచుండు
స్థూలమహాస్థూల ♦ సూక్ష్మాతిసూక్ష్మంబు
లందుఁదద్భుతమె తో ♦ ల్కాడుచుండు

గీ. సర్వరసములునంతటఁ ♦ బర్వియుండుఁ
జూచుటకుబుద్ధిలోపల ♦ సూక్ష్మదృష్టి
కలుగవలెఁగాని నీకటా ♦ క్షంబుచేత
సకలకల్యాణగుణధన్య! ♦ సర్వమాన్య!

సీ. భువిధ్రువమండలం ♦ బునదృష్టిసారింప
వింతలెంతయుఁగను ♦ విందుసేయు
నాఱునెలల్వగ ♦ లాఱునెలల్ రాత్రి
యగుచుండుఁదలచుగా ♦ నంబరమున
బంగారువింటికి ♦ రంగురంగులపట్టు
తెరలువ్రేలాడెను ♦ తెలుఁగుదోఁప
విద్యుత్తరంగాళి ♦ వివిధప్రభలచేతఁ
జిత్రాకృతులఁదాల్చి ♦ చెలఁగుచుండు

గీ. సర్వవస్తు ప్రదర్శన ♦ శాలమైన
సృష్టిలోపలనేమేమి ♦ చిత్రములను
గూర్చినాఁడవో తెలియంగ ♦ నేర్చునెవఁడు?
సకలకల్యాణగుణధన్య! ♦ సర్వమాన్య! 9

సీ. నిరుపమసౌందర్య ♦ నిలయమీభువనంబు
భవదీయవరసభా ♦ భవనమయ్య
ఇందువెలుంగు సూ ♦ ర్యేందులు మహనీయ
భాసమానములు దీ ♦ పంబులయ్య
పవమానుఁ డెప్పుడు ♦ పట్టినపీవనల్
విడువక వీచెడు ♦ భృత్యుఁడయ్య
కోకిలాముఖపక్షి ♦ కూజితమ్ములు సుధా
మాధురీగాన వి ♦ నోదమయ్య

గీ. వందిమాగధపాఠక ♦ వాంశికాదు
లరయ నీభక్తులనుట స ♦ త్యార్థమయ్య
పరిభువునీవయ్య మేము ని ♦ పరిజలమయ్య
సకలకల్యాణగుణధన్య! ♦ సర్వమాన్య!

సీ. లోకజాలములెల్ల ♦ నీకుక్షిలోపల
నొకమూలనవలీల ♦ నొదిగియుండు
నణువణువందున ♦ నత్యద్భుతంబుగా
నీకనుల్ నీచెవుల్ ♦ నిండియుండు
నిఖిలాండములయందు ♦ నిండిన నీరూపు
నెలమిభక్తునిమది ♦ నిమిడియుండు
నంతటనీవ్యాప్తి ♦ యలరుచునుండియు
నజ్ఞానికనులకు ♦ నందకుండుఁ

గీ. జిత్రచారిత్రుఁడవునీవు ♦ చిత్ప్రభూత!
రూపరసగంధనిర్ముక్త! ♦ రూపరహిత!
మాతలకునెల్లనీవె పవి ♦ ఖ్యాతమాత!
సకలకల్యాణ గుణధన్య! ♦ సర్వమాన్య! 11

సీ. దివివెల్గునక్షత్ర ♦ దీపమాలికలచే
నీజయోత్సవమును ♦ నిశలుసల్పఁ
బూర్వాద్రిపైనుండి ♦ బోరునఁ జాటునీ
చండశాసనము సూ ♦ ర్యుఁడు దినము
నీయశోమృతమును ♦ నించిచందురులోన
నిలువక కాలమ్ము ♦ కొలుచుచుండు
నిర్నిద్రవైభూత ♦ నిచయఁబు నిరతంబుఁ
బ్రకటించుచుండు నీ ♦ ప్రాభవంబు

గీ. విశ్వమంతయు నీసేవ ♦ విరతిలేక
యిట్లుసలుపుచునుండియు ♦ నెఱుఁగకుండుఁ
దెలిసినినుభక్తుఁడొక్కఁడే ♦ కొలుచుచుండు
సకలకల్యాణగుణధన్య ! సర్వమాన్య! 12

సీ. గర్భమ్మునను దాల్చి ♦ కనిపెంచి కాపాడు
తల్లి నిచ్చెదు నట్టి ♦ తల్లి వీవు
తల్లిని బిల్లలఁ ♦ దద్దయుఁ బోషించు
తండ్రి నొసంగెదు ♦ తండ్రి వీవు
తల్లులఁ బిల్లలఁ ♦ దండ్రులరక్షించు
ప్రభువుఁ బ్రసాదించు ♦ ప్రభుఁడ వీవు
వీరలందఱిలోన ♦ వీడని యన్యోన్య
మును గూర్చునట్టి యా ♦ పుణ్యఁడ వీవు

గీ. అజ్ఞులను దద్జ్ఞులుగఁ జేయు ♦ ప్రాజ్ఞుఁ డీవు
భక్తిచే మమ్ము బంధించు ♦ బంధు వీవు
వావి వరుసలఁ జిక్కని ♦ వాఁడ వీవు
సకలకల్యాణగుణధన్య! ♦ సర్వమాన్య! 13

సీ. హృదయాంబు జాతంబు ♦ పొదలింపఁ గాన్పించి
పరిభలసీనెడుచిత్ర ♦ భానుఁడీవు
మానస మానస ♦ మండనంబుగఁ దేలి
యాడుచుండెడు రాజ ♦ హంసమీవు
చిత్తసింహాసనం ♦ బుత్తమోత్తమముగా
వింపనారోహించు ♦ విభుఁడవీవు
స్వాంతతాపమ్ములు ♦ సాంతమ్ముశాంతింపఁ
గరుణనేవర్షించు ♦ ఘనుఁడవీవు
గీ. నామనోరథరథమును ♦ నడుపునట్టి
సారథివిసీవు సర్వసం ♦ సారమునకు
సారమేగాక భక్తాను ♦ సారివీవు
సకలకల్యాణగుణధన్య! ♦ సర్వమాన్య! 14

సీ. కరుణాత్ములకు నీవు ♦ కరుణాస్వరూపివై
క్రూరులకును మహా ♦ క్రూరుఁడగుచు
న్యాయవాదులకీవు ♦ న్యాయస్వరూపివై
యన్యాయపరులకు ♦ యముఁడవగుచు
నీతిమంతులకీవు ♦ నిర్మలమూర్తివై
దుర్నీతిపరులకు ♦ దూరుఁడగుచు
ధర్మాత్ములకు నెల్ల ♦ ధర్మస్వరూపివై
ధర్మహీనులకు ని ♦ ర్దయుఁడవగుచు

గీ. దుఃఖములచేతఁ దూలించి ♦ దోషములను
దుష్టులను శిష్టులుగమార్చి ♦ శిష్టవరుల
రక్షణముసేయుచున్నావు ♦ రక్తిమీఱ
సకలకల్యాణగుణధన్య! ♦ సర్వమాన్య! 16

సీ. వింతగా స్వాంతముల్ ♦ వీక్షించునీవెపో
వేయికన్నులవాఁడు ♦ విశ్వవేద్య!
పాపాటవులనెల్ల ♦ భస్మంబుచేసెడు
నీవెపో కాలాగ్ని ♦ నిష్కళంక!
సంతాపములనెల్లఁ ♦ జల్లార్చు నీవెపో
పర్జన్యమూర్తివి ♦ పరమపురుష!
భక్తిఁజిత్తంబులఁ ♦ బ్రజ్వరిల్లఁగఁజేయు
నీవెపోయనిలంబు ♦ దేవదేవ!

గీ. నీస్వరూపంబులోపల ♦ నిఖిలమైన
భూతగణముల గుణములు ♦ పొలుచుచుండు
నన్నిటికి నీవెయాధార ♦ మగుటఁదండ్రి!
సకలకల్యాణగుణధన్య! ♦ సర్వమాన్య! 16

సీ. మతిగ్రహింపఁగలేని ♦ యతివేగమునఁదమ
గతులుదప్పక పాఱు ♦ గ్రహములట్లు
పొర్లకవడిఁ బాఱు ♦ పొగబండ్ల నిర్మించు
శక్తినిచ్చినది నీ ♦ శక్తి కాదె?
కుందకడిందక ♦ కొల్లగాభూమిపైఁ
గాంతులఁజిమ్ము భా ♦ స్కరునికరణి
వెలుఁగువిద్యుద్దీప ♦ ములవెలిఁగించెడు
మహిమఁగొల్పినది నీ ♦ మహిమగాదె?

గీ. సకలమునునీవు సృజియించు ♦ సరణిదోఁప
యంత్రములనెల్ల నొసరించు ♦ నట్టిబుద్ధిఁ
బుడమిఁబొడమించినది భవ ♦ ద్బుద్ధి కాదె?
సకలకల్యాణగుణధన్య! ♦ సర్వమాన్య! 17

సీ. అఖిలభూతములపై ♦ నాజ్ఞచెల్లించెడు
శక్తికల్గుట దేని ♦ శక్తివలన
నడవిమెకంబుల ♦ నతిసాధువులఁ జేయు
శక్తికల్గుటదేని ♦ యుక్తివలనఁ
బినజాతివారలు ♦ పెనుజాతివారిపై
బలముఁజూపుట దేని ♦ బలమువలనఁ
జిక్కనినినుఁబట్టి ♦ చిత్తంబులోఁగట్టు
మహిమ గల్గుటదేని ♦ మహిమవలన

గీ. నట్టిపరమాద్భుతంబైన ♦ యమలబుద్ధిఁ
గరుణనీవు ప్రసాదించు ♦ కతనఁగాదె
యల్పులయ్యును నరులిల ♦ నధికులౌట?
సకలకల్యాణగుణధన్య! ♦ సర్వమాన్య! 18

సీ. అత్యద్భుతంబులౌ ♦ నఖిలబ్రహ్మాండముల్
జీవాణుకోట్లని ♦ చెప్పువారు
విశ్వమంతయు మహా ♦ విద్యుత్తరంగాళి
విలసనంబని నొక్కి ♦ తెలుపువారు
లోకజాలములెల్ల ♦ నేకరసంబైన
ప్రకృతిజాలంబని ♦ పలుకువారు
పరమాణువతిసూక్ష్మ ♦ తరమైన యొకవింత
గ్రహమండలంబని ♦ కఱపువారు

గీ. అపరిమేయుండవగు నిన్ను ♦ నరయనెంచి
పరిబలమౌబుద్ధి బలమునఁ ♦ బరుగులెత్తి
యలసినిలిచిన వారలో ♦ యనుఁగుఁదండ్రి!
సకలకల్యాణ గుణధన్య! ♦ సర్వమాన్య! 19

సర్వమాన్యశతకము.

సీ. భవదీయమహిమంబు ♦ ప్రకృతిసౌందర్యంబు

నందుఁగొందఱుగాంచి ♦ యలరుచుండ్రు

కొందఱుహృదయార ♦ విందమ్ములోనినుఁ

గనివార్ష మగ్నులై ♦ క్రాలుచుండ్రు

తమజీవితములోన ♦ దర్శించినినుఁగొంద

ఱానందపరవశు ♦ లగుచునుండ్రు

వివిధమానుషజాతి ♦ వృత్తమ్ములనునినుఁ

బొడఁగాంచి కొందఱు ♦ పొంగుచుండ్రు

గీ. సర్వమున నిన్నుఁగనుఁగొని ♦ సంభ్రమమున

నద్భుతంబుగనీయాజ్ఞ ♦ లనవరతము

సలుపుచుందురుకొందఱు ♦ జగతిలోన

సకలకల్యాణగుణధన్య ! ♦ సర్వమాన్య. 20

సీ. ఇచ్చిన దెంచక ♦ యియ్యనిదానికై
నిందించువారలు ♦ కొందఱుంద్రు
ఇచ్చిన దెంచుచు ♦ నియ్యనిదానికై
కోపించువారలు ♦ కొందఱుంద్రు
ఇచ్చినదానికే ♦ యెంతయు నుప్పొంగి
కొనియాడువారలు ♦ కొందఱుంద్రు
ఇచ్చిననేమి నీ ♦ వియ్యకుండిననేమి
కూర్మినిన్ గొల్చుచుఁ ♦ గొందఱుంద్రు

గీ. అందఱకు నెల్లవిధముల ♦ నాప్తుఁడగుచు
నిచ్చుచుందువు మితమును ♦ హితము నెఱిఁగి
నీవె మాకెన్న నిజమైన ♦ స్నేహితుఁడవు
సకలకల్యాణగుణధన్య ! ♦ సర్వమాన్య! 21

సీ. ఎవరెఱుంగఁగరాని ♦ యేకాంతముననుండి
యొంతయుసెలమి వీ ♦ క్షింతువనుచు
వీక్షించి దుష్టుని ♦ విపరీతచర్యల
కెంతయుఁ గనలి శి ♦ క్షింతువనుచు
శిక్షించి పరిశుద్ధ ♦ చిత్తునిగాఁజేసి
వింతగామఱి పరీ ♦ క్షింతువనుచు
నాపరీక్షను దేఱి ♦ నచల భక్తికి మెచ్చి
చింతలఁదీర్చి ర ♦ క్షింతువనుచు

గీ. రక్షణము సేసిమోక్షసా ♦ మ్రాజ్యమునకుఁ
బట్టభద్రు నొనర్చిచే ♦ పట్టుదనుచుఁ
బలుకుచుందురు నినుఁగన్న ♦ భక్తవరులు
సకలకల్యాణ గుణధన్య! ♦ సర్వమాన్య! 22

సీ. భూరిసారమ్ములఁ ♦ బొల్చుపౌ్రవులుగాని
కొండలు గుండుల ♦ పిండుగాదు
జీవనాధారమై ♦ చెల్లుధారలుగాని
వృష్టి శీకరముల ♦ వితతిగాదు
ప్రాణి సంతానైక ♦ ప్రబలతేజముగాని
రవికిరణమ్ముల ♦ రాజిగాదు
భవదీయశక్తి ప్ర ♦ భాపుంజములుగాని
బ్రహ్మాండములు భూత ♦ పాళిగాదు

గీ. హృదయమిది నిన్నవీక్షింప ♦ నిచ్ఛయించు
జ్ఞానులకు సూక్ష్మదర్శినీ ♦ నామయంత్రి
రాజమేకాని మాంసంపు ♦ రాశికాదు
సకలకల్యాణ గుణధన్య ! ♦ సర్వమాన్య! 23

సీ. రాళ్లలోపల గొప్ప ♦ రత్నమ్ములను బెట్టి
ముళ్లలోన గులాబి ♦ పువ్వుఁ బెట్టి
యుగ్రాటవులలోన ♦ నోషధులను బెట్టి
యంబుధిలోన ము ♦ త్యములఁ బెట్టి
బలుచిక్కుఁగప్పులో ♦ పలుఁగొబ్బెరను బెట్టి
కష్టమ్ములోన సు ♦ ఖమ్ముఁ బెట్టి
యురుమరుభూమిలో ♦ నుదకస్థలిని బెట్టి
విషములో నమృతమ్ము ♦ వింతఁ బెట్టి

గీ. కొనకు పరమాణువులవట్టి ♦ కుప్పయైన
యీశరీరంబులోపల ♦ నెలమినిన్ను
వీక్షణముసేయు సచ్ఛక్తిఁ ♦ బెట్టినావు
సకలకల్యాణగుణధన్య ! ♦ సర్వమాన్య! 24

సీ. దృష్టిసారించినీ ♦ సృష్టిచిత్రమ్ములఁ
గాంచిమెచ్చని యట్టి ♦ కనులవేల ?
విశ్వమంతటనుండి ♦ నీ తెంచువేదముల్
వినిసంతసింపని ♦ వీనులేల ?
నిర్మలమైనట్టి ♦ నీగుణరాజిని
వర్ణించిపాడని ♦ వక్త్రమేల ?
దీనులయాపదల్ ♦ దీర్పవెచ్చింపని
విరివిగాఁగూర్చిన ♦ సిరులవేల?

గీ. పరమసౌజన్యనిధివైన ♦ వరమపురుష !
నీవొసంగిన వన్నియు ♦ నీదునాజ్ఞ
జరపఁగానీనియానీచు ♦ జన్మమేల ?
సకలకల్యాణ గుణధన్య ! ♦ సర్వమాన్య 25

సీ. అఖిలాండములనిండి ♦ యలరుచుండెడునీకు
నాలయంబునుగట్టఁ ♦ జాలునెవడు ?
గణనకుమీఱిన ♦ గుణములుగలనీకు
సరియైనపేర్పెట్టఁ ♦ జాలునెవఁడు ?
ఆద్యంతములు లేని ♦ యపరిమేయునినిన్ను
సాంతంబుగాఁజూడఁ ♦ జాలునెవఁడు ?
ఆత్మకునాత్మవై ♦ యతిసూక్ష్మవస్తువై
కాంతిలుసిరిఁ బట్టంగఁ ♦ జాలునెవఁడు ?

గీ. పరమయోగీంద్ర మానస ♦ పద్మములను
వేవెలుంగుల వెలిఁగించు ♦ విభునినిన్ను
సర్వశక్తుని వర్ణింపఁ ♦ జాలునెవఁడు?
సకలకల్యాణ గుణధన్య ! ♦ సర్వమాన్య !

సీ. విశ్వేశ్వరుండవై ♦ వెలయునీవువసించు
నఖిలాండములు వార ♦ ణాసిమాకుఁ
బతితపావనకార్య ♦ బద్ధమౌనీదయా
వాహినిగంగాభ ♦ వానిమాకుఁ
జాంచల్యరహితమై ♦ సద్భక్తిఁబొల్చునీ
గూర్చుచిత్తమెపంచ ♦ క్రోశిమాకుఁ
బ్రాణిమాత్రమునకు ♦ భద్రమేకోరుచుఁ
గావించుపనులు నీ ♦ సేవమాకు

గీ. మూఢవిశ్వాసములఁ గట్టి ♦ మూలఁబెట్టి
నిన్ను నిరతంబు హృదయసా ♦ న్నిధ్యమందు
మోదమునఁజూచి పొంగుటే ♦ ముక్తిమాకు
సకలకల్యాణగుణధన్య! ♦ సర్వమాన్య! 27

సీ. బీదయౌ వడ్రింగి ♦ బిడ్డనినామంబు
చక్రవర్తులకుసం ♦ స్తవ్యమయ్యె
నొకమూల నొదిగిన ♦ యొకకొన్ని దీవులు
రవియ స్తమింపని ♦ రాజ్యమయ్యె[2]
మొనమొన్నవఱకుఁ దూ ♦ ర్పునఁ బేరులేనిది
హెచ్చి పేర్చినదాని ♦ మచ్చుమాపె[3]
నెన్నికయే లేని ♦ సన్ననియొకయేఱు
పెనుబట్టణముమిగ్రింగి ♦ పేరుఁగాంచె[4]

గీ. నీదయాపూరమెద్దాని ♦ మీఁదఁబాఱుఁ
జిన్నదయ్యును నదిచాలఁ ♦ జెన్నుమీఱు
నెన్న నాకీర్తియంతయు ♦ నిన్నె చేరు
సకలకల్యాణ గుణధన్య! ♦ సర్వమాన్య! 28

1 క్రీస్తు 2 ఇంగ్లిరాజ్యము 3 రోము 4 యూరోసలేము.

సీ. నీకటాక్షము జాలి ♦ నిముసంబులోపల
బ్రహ్మాండములు భస్మ ♦ రాసులౌను
నీకటాక్షముఁ జేర ♦ నిమిషార్థమున భస్మ
రాసులు బ్రహ్మాండ ♦ రాసులౌను
నీవు చేవీడిన ♦ నిర్జరేంద్రుండైన
క్షణములోపలఁ గ్రింద ♦ జాఱిపడును
నీవుచేపట్టిన ♦ నీచుఁడైనను దక్ష
ణంబున సామ్రాజ్య ♦ నాథుఁడౌను

గీ. నిగ్రహానుగ్రహాంబుల ♦ నిరుపమాన
శక్తియుక్తుండవగుటను ♦ సర్వశక్తి
మంతుఁడందురు నిన్ను స ♦ మస్తజనులు
సకలకల్యాణ గుణధన్య! ♦ సర్వమాన్య! 29

సీ. కన్నులారా! మీరు ♦ కరుణాస్వరూపునిఁ
గనుఁగొన సాయంబు ♦ గండు! రండు!
వీనులారా! మీరు ♦ విభునిశాసనముల
నెలమినాలింపంగ ♦ నిండు! లెండు!
చేతులారా! మీరు ♦ చిత్తాబ్జమిత్రునిఁ
దవిలిసేవింప సి ♦ ద్ధంబుగండు!
హృదయమా! నాథుఁడు ♦ ముదముతో నీలోనఁ
గనఁబడనున్నాఁడు ♦ గదలకుండు

గీ. మఱచుఁ బరివారములకెల్ల ♦ నాజ్ఞయొసఁగి
వేడ్కతో నిన్ను వీక్షింప ♦ వేచియుండు
భక్తునకుఁ దక్షణముతోఁచు ♦ ప్రభుఁడవీవు
సకలకల్యాణ గుణధన్య! ♦ సర్వమాన్య! 30

సీ. దోషసైన్యంబులఁ ♦ దూలిపోసేయ 'ఫి
రంగి' యాభక్తి తే ♦ టాంగుసుమ్ము
పాపనౌకావళిఁ ♦ బ్రద్దలుగొట్టంగ
బలమైన 'టార్పిడో' భక్తిసుమ్ము
అఘరణపోతమ్ము ♦ నద్భుతంబుగముంపఁ
బ్రబలమౌ 'సబ్ మెరైన్' ♦ భక్తిసుమ్ము
భవప్రపంచమ్ముల ♦ భస్మమ్ముగావింపఁ
బాశుపతాస్త్రమ్ము ♦ భక్తిసుమ్ము

గీ. సకలసంసార సాగర ♦ సన్నిబద్ధ
జాలములనెల్లఁ దెగఁద్రుంపఁ ♦ జాలి మోక్ష
వప్రమునుగూర్చు సేనాని ♦ భక్తిసుమ్ము
సకలకల్యాణ గుణధన్య! ♦ సర్వమాన్య! 31

సీ. ధారాళమాదయా ♦ సారమ్ములేనట్టి
హృదయమ్ము మకరంద ♦ హీనసుమము
విద్యావిహీనుని ♦ విఫలమాజన్మమ్ము
వెలుతురు లేనట్టి ♦ విడిదిసుమ్ము
సుగుణసంపద లేని ♦ సుదతిచక్కదనమ్ము
తంతులు లేనిసి ♦ తారువినుము
నీతిలేనట్టి దు ♦ ర్జాతి కవిత్వమ్ము
మానమ్ములేని యా ♦ సానిసొమ్ము

గీ. పరమపావనమైనట్టి ♦ భక్తిలేని
వాఁడు తలలేనిమొండెమ్ము ♦ వానికంటె
నధముఁడెవ్వాఁడు కరుణాసు ♦ ధాబ్ధి! చెపుమ
సకలకల్యాణ గుణధన్య! ♦ సర్వమాన్య! 32

సీ. పట్టెడన్నము పెట్టు ♦ పతికిఁ బ్రాణం బైన
నెమ్మి నొసంగు శ్వా ♦ నమ్ము మేలు
పచ్చిక మెసవి యా ♦ ప్యాయమానంబుగా
నమృతంబు పిదికెడు ♦ నావు మేలు
ఇంతనీరముఁ గొని ♦ యెంతయు మధురజ
లమ్మిచ్చు నారి కే ♦ ళమ్ము మేలు
జలమిడువారికి ♦ ఫలములే కాకుండ
కాయమే యొప్పించు ♦ కదళి మేలు

గీ. నీదయావృష్టిచేతను ♦ నెగడుచుండి
హృదయకుసుమంబు నీకు న ♦ ర్పింపకుండు
కూళనరపశువునకంటెఁ ♦ గోటిరెట్లు
సకలకల్యాణ గుణధన్య! ♦ సర్వమాన్య! 33

సీ. తరణితాపమున సం ♦ తప్తంబులైనను
దమనీడలోరులకు ♦ దయనొసంగు
చిన్నవారాళ్ళచే ♦ యువ్విన సహియించి
పక్వఫలంబులఁ ♦ బ్రీతిగఁ బెట్టుఁ
దలమీఁదికెక్కి న్న ♦ త్యములుసల్పెడునట్టి
ప్రాణికోటులకుసం ♦ వాసమిచ్చు
నటికివై చెడువారి ♦ కొఱకును సౌఖ్యముల్
దారకొనఁ జేయును ♦ మఱచికీడు

గీ. నార! తమజీవితములోన ♦ నమలమైన
ధర్మమేబోధ సేయుసీ ♦ తరులుగూడఁ
బరతనినుఁగొల్చునాభక్త ♦ వరునిఁబోలి
సకలకల్యాణ గుణధన్య! ♦ సర్వమాన్య! 34

సీ. పురుషరత్నముఁగాంచి ♦ పొంగునువంశమ్ము
పరిజనసేమముఁగని ♦ ప్రభువుపొంగుఁ
దణిఁదగువర్షంబు ♦ గురియఁగాఁ బుడమిపొంగుఁ
బెన్నిధిఁగాంచినఁ ♦ బేదపొంగుఁ
బతియాదరించిన ♦ సతికడుఁబొంగు
దానపాత్రునకిచ్చి ♦ దాతపొంగుఁ
దనయుఁడుఘనుఁడైనఁ ♦ దండ్రితాఁబొంగు
జయమందశూరుఁడు ♦ చాలఁబొంగు

గీ. నిఖిలభూతగణంబుల ♦ నిండియుండు
నిన్నుఁజూచినయపుడెల్ల ♦ నీదుభక్తుఁ
డెంతయునుబొంగుఁజెప్పఁగా ♦ నంతపోదవు
సకలకల్యాణగుణధన్య! ♦ సర్వమాన్య! 35

సీ. తులలేనిసిరులచేఁ ♦ దులఁదూఁగువాఁడైన
నంత్యాననిర్ధనుం ♦ డగుచుఁబోవు
రాజులలోనెల్ల ♦ రాజాధిరాజైనఁ
దుదకురాష్ట్రములెల్ల ♦ వదలిపోవు
బలవంతులకునెల్ల ♦ బలవంతుఁడైనను
గడకునాబలముఁగో ♦ ల్పడుచుఁబోవు
రూపవంతులకెల్ల ♦ రూపవంతుండైనఁ
జివరకురూపఱి ♦ చిన్నవోవు

గీ. నిన్నియునుగల్గఁగోనకున ♦ వెల్లఁబోవు
నీదుభక్తియెనిరతంబు ♦ నిలిచిపోవు
దానినార్జింపసుఖములు ♦ దఱుఁగఁబోవు
సకలకల్యాణగుణధన్య! ♦ సర్వమాన్య! 36

సీ. అసహాయశూరున ♦ కవ్యాజకరుణయే
యందమైయొప్పియా ♦ నందమిచ్చుఁ
బండితోత్తమునకు ♦ భవ్యమౌవినయమే
గౌరవంబునుగూర్చి ♦ కలిమిఁబెచ్చు
విజ్ఞానజలధికి ♦ విమలవివేకమే
సద్భూషణంబయి ♦ శాంతిఁగూర్చు
ధనవంతునకుమహా ♦ దానవైదగ్ధ్యమే
క్షీణింపఁబోనిస ♦ త్కీర్తినించు

గీ. నిశ్చలంబైననీభక్తి ♦ నిజముగాను
గలిగెనేనందఱకునలం ♦ కారమగుచుఁ
బొల్చుసంతోషవార్ధిలో ♦ ముంచితేల్చు
సకలకల్యాణగుణధన్య! ♦ సర్వమాన్య! 37

సీ. మనమున సద్గుణ ♦ గణములు మొలకెత్త
నదివసంతంబని ♦ యలరుచుండుఁ
బాపజాలమ్ములు ♦ పరితాపములసింక
నదిగ్రీష్మఋతువని ♦ యభినుతించు
స్వాంతంబుకరుణాప్ర ♦ వాహంబుతోనిండ
వర్షకాలంబని ♦ హర్షమొందు
భావానసీకీర్తి ♦ పర్వివెన్నెలఁగాయు
శరదాగమంబని ♦ సంతసించు

గీ. నఘమువణకును గొల్పహి ♦ మార్తిఁయుంచు
దోషములురాలశిశిరముఁ ♦ దోఁచెనంచు
నుబ్బుచుండునునీభక్తుఁ ♦ డబ్బురముగ
సకలకల్యాణగుణధన్య! ♦ సర్వమాన్య! 38

సీ. పరమేశనీభక్తి ♦ వరవిమానంబెక్కి
చూడ్కికింపొందఁగాఁ ♦ జూచుచునపుడు
జలధులన్నియునొక్క ♦ జలజాకరముగాఁగ
భూమియంతయుఁదమ్మి ♦ పూవుగాఁగ
వివిధదేశమ్ములు ♦ వెలయు రేకులుగాఁగ
వనపంక్తి కేసర ♦ పాళిగాఁగ
బ్రవహించునదులుమ ♦ రందధారలుగాఁగ
శైలజాలముషట్ప ♦ దాళిగాఁగ

గీ. దోఁచ నానందమున నేమి ♦ దోఁచకుండ
మఱచిపోవునుదనుబాను ♦ నురుసమాధి
యుక్తుఁడై భవదీయస ♦ ద్భక్తవరుఁడు
సకలకల్యాణగుణధన్య! ♦ సర్వమాన్య! 39

సీ. జగములవెలిఁగించు ♦ గగనభాస్వన్మణి
యురుప్రకాశ నశించు ♦ నొక్కనాఁడు
వారివాహములకు ♦ నీరమ్ములొసఁగెడు
నుదధులన్నియునింకు ♦ నొక్కనాఁడు
జీవనాధారమై ♦ చెల్లుసమీరమ్ము
లులివుదక్కియుడుఁగు ♦ నొక్కనాఁడు
గ్రహములుదమయుప ♦ గ్రహములతోఁగూడ
నొప్పుఁజెడిశూన్యమౌ ♦ నొక్కనాఁడు

గీ. కానిభవదీయభక్తహృ ♦ త్కమలమందు
నందముగఁబొంగిపొరలునా ♦ నందమెందుఁ
గుందుడిందులఁబొందదా ♦ నందకంద!
సకలకల్యాణగుణధన్య! ♦ సర్వమాన్య! 40

సీ. కలివ్రులలో భయం ♦ కరము పౌతజులలోఁ
జెఱిలోనఁ బురినిగ ♦ చ్చేరినున్న
శాలలోఁ బుస్తక ♦ శాలలో వరకళా
శాలలో ననవాథ ♦ శాలనున్న
సుతులలో బాంధవ ♦ పతతిలోఁ దనదు స్నే
హితులలోఁ దక్కు సం ♦ గతులనున్న
నరులలో సజ్జన ♦ వరులలో గురులలోఁ
బరులలో నిజ కార్య ♦ పరతనున్న

గీ. నెచటనున్న నుసీ భక్తుఁ ♦ డేకమతిని
జాతిమత భేదములమాని ♦ సర్వసమతఁ
బరులకుపకార మొనరించు ♦ పనులెచేయు
సకలకల్యాణగుణధన్య! ♦ సర్వమాన్య! 41

సీ. క్షమయనుకవచంబుఁ ♦ జక్కఁగాధరియించి
శ్రద్ధాకిరీటంబు ♦ సంఘటించి
భక్తియన్ డాలును ♦ బదిలమ్ముగాఁబట్టి
సత్యమన్ శస్త్రంబు ♦ సరగఁదాల్చి
దయయనుదూతను ♦ దగుసంధికైపంచి
వేగువానిగఁదన ♦ విద్యనునిచి
లోకతుచ్ఛలార్వర ♦ లోబలబంధించి
యజ్ఞానమున్ దెగ ♦ టార్పనెంచి

గీ. రాజరాజగునీయాజ్ఞ ♦ రక్తిఁగాంచి
ధర్మరంగంబునందుయు ♦ ద్ధంబుసేయ
సిద్ధమైపొల్చు నీభక్తుఁ ♦ జెనకఁదరమె ?
సకలకల్యాణగుణధన్య ! ♦ సర్వమాన్య ! 42

సీ. దుఃఖముల్ కొండలై ♦ దొర్లివచ్చునుగాక
చింతలు చిఱుతలై ♦ చీల్చుఁగాక
శోకముల్ వార్ధులై ♦ చుట్టిముంచునుగాక
యర్చులై తాపమ్ము ♦ లేర్చుఁగాక
బాధలుః పాములై ♦ పట్టిమీఁకునుగాక
యార్తి పెనురోగమై ♦ యడరుఁగాక
పిడుగులై యాపదల్ ♦ పేర్చిపైఁబడుఁగాక
మృత్యువు సింహమై ♦ మ్రింగుఁగాక

గీ. నిన్ను శరణంబుగా నెంచి ♦ నిష్కళంక
భక్తిచేఁ గొల్చిపొల్చెడు ♦ భక్తవరుని
హృదయ మింతయు ♦ బెదరక చెదరకుండు
సకలకల్యాణ గుణధన్య! ♦ సర్వమాన్య! 43

సీ. భక్తరక్షణకళా ♦ భరణుండవనుటకు
యోగ్యుఁడౌ 'ప్రహ్లాదుఁ' ♦ డొక్కసాక్షి
సత్యసంధులఁగాచు ♦ స్వామినీవనుటకు
నుర్వి 'హరిశ్చంద్రుఁ' ♦ డొక్కసాక్షి
పరిశుద్ధహృదయుల ♦ ప్రాపునీవనుటకుఁ
బెక్కురలో 'ధ్రువుం' ♦ డొక్కసాక్షి
స్వామిభక్తులను సం ♦ భావింతువనుటకు
న'క్కేసరికుమారుఁ' ♦ డొక్కసాక్షి

గీ. సకల హృదయంబులనుజూచు ♦ సర్వసాక్షి
నీవయనుటకు యోగీంద్రు ♦ లెల్లసాక్షి
సాక్షులకు నీవుప్రత్యక్ష ♦ మైనసాక్షి
సకలకల్యాణ గుణధన్య ! ♦ సర్వమాన్య!

సీ. నీదాసు లెందఱో ♦ నీచిత్తమలరింపఁ
గడఁకతో నోర్చిరి ♦ కష్టములను
బండితు లెందఱో ♦ భక్తితో నినుఁగొల్వఁ
గడఁకతో నోర్చిరి ♦ కష్టములను
ఆర్యులెందఱో నీదు ♦ నాజ్ఞలఁ జెల్లింపఁ
గడఁకతో నోర్చిరి ♦ కష్టములను
ఎలమితోడ మహాత్ము ♦ లెందఱో నినుఁగోరి
కడఁకతో నోర్చిరి ♦ కష్టములను

గీ. భక్తవరులెల్ల నిట్టులు ♦ పడెడునట్టి
కష్టమే కద నీకున ♦ భీష్టమైన
వజ్రమణి భూషణంబయి ♦ వఱలు దేవ!
సకలకల్యాణ గుణధన్య! ♦ సర్వమాన్య! 45

సీ. ప్రజకు స్వరాజ్యమే ♦ పరమావధియటంచుఁ
దేటగాఁజాటెడు ♦ ధీరమతులు
కష్టమ్ములెన్నని ♦ గడకతో నోరిచి
న్యాయమ్ముగాపాడు ♦ నమలమతులు
సత్యమే నమ్ముచు ♦ సత్యమే పల్కుచు
సత్యమనుష్ఠించు ♦ సరళమతులు
ఏకార్యమైనని ♦ నీశ్వరుఁడలఁషక
యాచరింపకయుండు ♦ నసఘమతులు

గీ. దేశభక్తులు దమతమ ♦ దేశములను
నుద్ధరించుటనీశరి ♦ శుద్ధమైన
భక్తి గల్గుటచేఁగదా ♦ పరమపురుష!
సకలకల్యాణ గుణధన్య! ♦ సర్వమాన్య! 46

సీ. క్షమలో యుధిష్ఠిర ♦ క్ష్మాపాలవరుఁ బోలి
సత్యంబుననుహరి ♦ శ్చంద్రుఁ బోలి
పూన్కి సాధించు పెం ♦ పున భగీరథుఁ బోలి
ధృతిదానములలోఁ ద ♦ ధీచిఁ బోలి
శౌర్యసాహసముల ♦ సవ్యసాచినిఁ బోలి
నీతి శ్రీరాముని ♦ రీతిఁ బోలి
దయలో నశోకుఁ డ ♦ ధరణీధవునిఁ బోలి
బలవీర్యములమరు ♦ ద్భవులఁ బోలి

గీ. జ్ఞానభక్తి విరక్తులే ♦ మానములుగఁ
గలిగి వర్తిల్లి ధన్యులై ♦ వెలయుమందు
నిన్ను మదిఁ గన్నయట్టి వ ♦ ర్సన్నమతులు
సకలకల్యాణగుణధన్య! ♦ సర్వమాన్య! 47

సీ. పట్టాభిషేకంబు ♦ వనవాసముగ మాఱఁ
జింత 'శ్రీరాముని' ♦ జేరకునికి,
దనసతీమణిఁదాన ♦ తునుమఁగల్గినవేళ
వగ 'హరిశ్చంద్రు'ని ♦ వంచకునికి
దర్పించి తండ్రిబా ♦ధలుపెట్టుసమయాన
వంత ప్రహ్లాదుని ♦ వాల్చకునికిఁ
దనదు సర్వస్వంబు ♦ ధారవోఁపట్టిన
శోకంబు 'బలి'వైపు ♦ చూడకునికిఁ

గీ. గారణము వారిమానస ♦ కమలమందు
సుస్థిరంబుగఁబొల్చెడు ♦ శుద్ధమైన
భక్తియే కాక మఱివేఱు ♦ శక్తియున్నె!
సకలకల్యాణ గుణధన్య! ♦ సర్వమాన్య! 48

సీ. ఏకపత్నీవ్రతం ♦ బెవ్వనివ్రతమన్న

నితనిదంచని చెప్ప ♦ నెసఁగువాఁడు

శరణాగతత్రాణ ♦ బిరుదమెవ్వనిదన్న

నితనిదంచని చెప్ప ♦ నెసఁగువాఁడు

పితృవాక్యపాలన ♦ ప్రీతుఁడెవ్వండన్న

నీతఁడంచని చెప్ప ♦ నెసగువాఁడు

జనులపాలిఁటిపారి ♦ జాతమెవ్వండన్న

నీతఁడంచని చెప్ప ♦ నెసఁగువాఁడు

గీ. ఏలమినినుఁ గొల్చుయోగీంద్రుఁ ♦ డెవ్వఁడన్న

నీతఁడంచని చెప్పంగ ♦ నెసఁగువాఁడు

రామవిభుఁడాతనికిసాటి ♦ రాజుగలఁడె?

సకలకల్యాణ గుణధన్య! ♦ సర్వమాన్య!

సీ. అలచేతనున్నట్టి ♦ యఖిలసామ్రాజ్యమ్ము
వదలి సత్కీర్తిచేఁ ♦ బొదలినాఁడు
అన్యాయమొనరించు ♦ నాచార్యునైనను
శిక్షించినీతిర ♦ క్షించినాఁడు
వృద్ధత్వమున వైరి ♦ వీరాగ్రగణ్యుల
వేటాడి శౌర్యమ్ముఁ ♦ జాటినాఁడు
శరతల్పగతుఁడయి ♦ సకలధర్మంబులఁ
గఱపుచు శాంతంబుఁ ♦ గురిసినాఁడు

గీ. బ్రహ్మచర్యగరిష్ఠుఁడై ♦ ప్రబలినాఁడు
నిన్నునిరతంబుమదిలోన ♦ నిల్పినాఁడు
'భీష్ము' నంతటిభక్తుండు ♦ పృథ్వినెవఁడు
సకలకల్యాణ గుణధన్య! ♦ సర్వమాన్య! 50

సీ. కనిగంగఁ బాలుఁడై ♦ చినతల్లికుంతికిఁ
గోరినకోర్కులఁ ♦ గూర్మినొసఁగెఁ
గపటంబుతోవచ్చి ♦ కవచకుండలముల
నింద్రుండు వేఁడిన ♦ నెలమి నొసఁగెఁ
బెంచినవారలు ♦ బెస్తలేయైనను
మమతతో సకలస ♦ న్మానమొసఁగెఁ
దనయంతవానిగా ♦ మనిచినకౌరవ
పతికిరణంబునఁ ♦ బ్రాణమొసఁగె

గీ. దాతలకు దాతవగుటను ♦ దలఁచినీకు
ముదముతోఁ దనపరిశుద్ధ ♦ హృదయమొసఁగె
దాతయనఁ గర్ణుఁడొక్కఁడే ♦ దాతభువిని
సకలకల్యాణ గుణధన్య! ♦ సర్వమాన్య! 51

సీ. నరకుని చెఱఁబడ్డ ♦ నరనాథకన్యల
మానముఁగాచిన ♦ మహిమతోడఁ
బాడిఁదప్పనియట్టి ♦ పాండుపుత్త్రులఁబ్రోచి
ప్రతినదీర్చినమహా ♦ ప్రతిభతోడ
దీనాతిదీనుల ♦ ధీరులుగామార్చు
శక్తిగల్గినయోగ ♦ శక్తితోడ
భక్తుఁగుచేలుని ♦ బాల్యమిత్త్రునిగృత
కృత్యుఁజేసినశుభ్ర ♦ కీర్తితోడ

గీ. నీదునాజ్ఞలఁదలఁదాల్చి ♦ నెగడుచుండు
నీతిపరులనుసేవించు ♦ నియతితోడ
వెలుఁగు 'శ్రీకృష్ణుఁ' డాకవింత ♦ వెలుఁగుగాదె?
సకలకల్యాణ గుణధన్య! ♦ సర్వమాన్య! 52

సీ. అంతటనినుఁజూచి ♦ యఖిలంబునీవని
సర్వస్వమర్పించె ♦ 'శంకరుండు'
అన్నియునీదని ♦ యభిమానమునుమాని
మానకకొల్చె 'రా ♦ మానుజుండు'
నేనెంతవాఁడను ♦ నీవెనాప్రభువని
యర్చించె 'మధ్వ'నా ♦ మాంకితుండు
వరభక్తులగుటచే ♦ వారలనామంబు
లాచార్యపదవిని ♦ నలరుచుండు

గీ. నిన్ను నిర్మలభక్తిచేఁ ♦ గన్నవారి
కీర్తిసంపూర్ణ చంద్రుని ♦ మూర్తినవ్వి
వెలుఁగుచుండును జగములు ♦ వెలుఁగుదాఁక
సకలకల్యాణ గుణధన్య ! ♦ సర్వమాన్య! 53

సీ. 'పాలిస్థలి'ని బాప ♦ పరుల 'యహూదీ'ల
నుద్ధరింపఁగఁ బ్రాణ ♦ మొసఁగె నొకఁడు[1]
మొరకులౌ నరబియా ♦ తురకల సవరింపఁ
బడరాని కడగండ్లఁ ♦ బడియె నొకఁడు[2]
భరతఖండమునందుఁ ♦ బ్రబలిన క్రౌర్యంబుఁ
బాపసర్వస్వంబుఁ ♦ బాసె నొకఁడు[3]
హిందూమహాజాతి ♦ కందుకుందులడింప
విసము ప్రేముడితోడ ♦ మెసవె నొకఁడు[4]

గీ. సతులసహగమనంబుల ♦ సహ్యమంచు
నుడుపఁ బరదేశమున కేగి ♦ మడిసె నొకఁడు[5]
భక్తులన నిట్టివారలో ♦ పరమపురుష!
సకలకల్యాణగుణధన్య! ♦ సర్వమాన్య! 54

1 క్రీస్తువు 2 మహమ్మదు 3 బుద్ధుఁడు 4 దయానందుఁడు 5 రామమోహనుఁడు

సీ. దయకంటె మించిన ♦ ధర్మంబుమఱిలేదు
దయకుమిన్నసుకృ ♦ తంబులేదు
దయనుజూపెడువాఁడె ♦ ధన్యచరిత్రుండు
దయలేనివానినే ♦ దనుజుఁడండ్రు
దయయదుగంటిన ♦ ధరనరకంబగు
దయచేతనే స్వర్గ ♦ ధామమగును
దయమెకోరుచునుండ్రు ♦ ధరణినందఱుఁగూడ
దయయందె విశ్వంబు ♦ దనరుచుండు

గీ. నని 'మహావీరుఁ' డనుభక్తుఁ ♦ డవనియందుఁ
జాటెనాబుద్ధదేవుని ♦ సాటివాఁడు
దయకు సర్వమొసంగిన ♦ ధర్మవిదుఁడు
సకలకల్యాణగుణధన్య! ♦ సర్వమాన్య! 55

సీ. తేజస్స్వరూప! నీ ♦ తేజంబునొక్కింత
యవనిలో వింతగా ♦ నగ్నిచూపు
సత్యాకృతీ! నీదు ♦ సత్యంబునొక్కింత
యవనిలో వింతగా ♦ నగ్నిచూపుఁ
జైతన్యరూప! నీ ♦ చైతన్యమొక్కింత
యవనిలో వింతగా ♦ నగ్నిచూపుఁ
బరిశుద్ధమూర్తి! నీ ♦ పారిశుద్ధ్యమొకింత
యవనిలో వింతగా ♦ నగ్నిచూపు

గీ. నంచునిను నగ్నినార్యులు ♦ గాంచినట్లు
భక్తమణి 'జడతృష్ణుఁ'డన్ ♦ పారసీకుఁ[1]
డగ్నినినుఁగాంచి పూజించి ♦ యలరినాఁడు
సకలకల్యాణ గుణధన్య! ♦ సర్వమాన్య! 56

---

1 ఆంగ్లమున జోరాస్టర్ అందురు. ఇతఁడు పారసీమతప్రవర్తకుఁడు.

సీ. నీనివాసంబగు ♦ నిర్మలహృదయమే
భాసిల్లుచుండు కై ♦ లాసమంచుఁ
బసులనెంతయుఁ బ్రేమఁ ♦ బాలించుచుండుటే
శ్రీకరంబగునంది ♦ సేవయంచు
నిరుపమానంబగు ♦ నీతత్త్వమెఱుఁగుటే
యుమనుబూజించెడు ♦ క్రమమటంచు
మంగళప్రదుఁడవై ♦ మహిమనొప్పెడునీకె
శివనామ మెంతయుఁ ♦ జెల్లునంచు

గీ. జగతినంతటఁ జక్కఁగాఁ ♦ జాటుటకును
బంపెశిష్యుల భవదీయ ♦ భక్తవరుఁడు
బసవఁడనుపేర నొప్పెడు ♦ భవ్యయశుఁడు
సకలకల్యాణ గుణధన్య! ♦ సర్వమాన్య! 57

సీ. కనకకామినులపై ♦ మనసునుబోనీక
లోభమోహమ్ముల ♦ లోంచినాఁడు
సర్వమతమ్ములఁ ♦ జక్కఁగాఁబరికించి
యెలమితోఁడసమన్వ ♦ యించినాఁడు
అతిశయశ్రద్ధతో ♦ యమనియమాదులఁ
దాల్చిద్వంద్వమ్ములఁ ♦ గెల్చినాఁడు
ఏకాగ్రమతితోఁడ ♦ నీశ్వర! నినుఁగాంచి
యోగీశ్వరుండయి ♦ యొప్పినాఁడు

గీ. జ్ఞానతేజంబుచేత న ♦ జ్ఞానతమముఁ
బాపుకొని లోకబంధువై ♦ పరఁగినాఁడు
భవ్య 'శ్రీరామకృష్ణా'ఖ్య ♦ పరమహంస
సకలకల్యాణ గుణధన్య! ♦ సర్వమాన్య! 58

సీ. సుజ్ఞాని 'నానకు' ♦ శుద్ధజీవనమున
బలమునూఁదినది నీ ♦ భక్తికాదె?
నిరుపమ 'చైతన్య' ♦ చరితామృతమునందు
స్వాదముంచినదినీ ♦ భక్తికాదె?
'రామమోహను'ని స ♦ ద్రమణీయచరితలోఁ
బ్రభను గొల్పినదినీ ♦ భక్తికాదె?
శ్రీదయానందుని ♦ చిత్రచారిత్రకు
రక్తిఁదెచ్చినది నీ ♦ భక్తికాదె?

గీ. క్షితితలేశ్వరు లెల్లను ♦ శిరమువంచి
దండములు వెట్టునంతయు ♦ ద్దండశక్తి
యుక్తమైపొల్చుచున్నది ♦ భక్తికాదె?
సకలకల్యాణ గుణధన్య! ♦ సర్వమాన్య! 59

సీ. 'నానకు' శుద్ధ వి ♦ జ్ఞానప్రతాపముల్
'గోవిందుసింహు' లోఁ ♦ గొమరుమిగిలె
'రామమోహను'ని స ♦ ద్రమణీయ తేజముల్
'దేవేంద్రనాథు' లోఁ ♦ దేజరిల్లె
'శ్రీదయానందు'ని ♦ చిత్రప్రదీప్తులు
'లేఖరాము' నియందు ♦ లీలసలిపె
'శ్రీవివేకానందు' ♦ చిత్తంబులోఁ పలు
'బరమహంసు' నికళల్ ♦ ప్రజ్వరిల్లెఁ

గీ. ధరణి తేజంబు చంద్రులోఁ ♦ దనరుకరణి
హృదయమోదమ్ముమోముసఁ ♦ బొదలునట్లు
నీమహిమ భక్తవరులలో ♦ నెగడురీతి
సకలకల్యాణ గుణధన్య ! ♦ సర్వమాన్య!

సీ. కవిముఖమ్మునమహా ♦ కవితాలహరిగంగ
నెనసిబోరునఁబ్రవ ♦ హించుఁబెల్ల
శూరునిలోనుండి ♦ సూర్యతాపమువలె
నంతకంతకు శౌర్య ♦ మడరుఁబెల్ల
సుజ్ఞానిలోనుండి ♦ శుభ్రాంశుకిరణాళి
పగిదిఁబ్రబోధముల్ ♦ ప్రబలుఁబెల్ల
సదయాత్మహృదయాన ♦ సంద్రించుచందానఁ
గరుణపైఁ బైఁబొంగి ♦ పొరలుఁబెల్ల

గీ. వారిపరిశుద్ధమానసాం ♦ భోరుహములఁ
గ్రాలుభక్తిమరందంబుఁ ♦ గ్రోలుచుండు
బంభరంబైన నీప్రభా ♦ వమునఁగాదె?
సకలకల్యాణగుణధన్య ! ♦ సర్వమాన్య! 61

సీ. సకలరసంబుల ♦ శబ్దంబులనుగూర్చి
చెవిగుండ మనసులోఁ ♦ జేర్చుసుకవి
అఖిలరసంబుల ♦ నాకారములఁగూర్చి
కనుమూలమునబుద్ధిఁ ♦ జొనుపుశిల్పి
కనులేనివానికిఁ ♦ గవియెక్కుడుగఁదోఁచుఁ
జెవిటికినధికుఁడై ♦ శిల్పిదోఁచుఁ
గనులును గర్ణముల్ ♦ గలవారికిరువురు
సమముగాఁదోఁతురు ♦ జగతియందుఁ

గీ. గవులశిల్పుల నిర్మించి ♦ కనులుసెవులు
మాకునీవు ప్రసాదింప ♦ మహిమలెల్లఁ
జూచుభాగ్యంబు సమకూరు ♦ చుండుఁగాదె?
సకలకల్యాణ గుణధన్య! ♦ సర్వమాన్య! 62

సీ. రామకథాసుధా ♦ రసమువర్షించిన
'యాదికవీంద్రు' ని ♦ యమలమతికి
నాటకసంధాన ♦ ధాటీవిహారియౌ
'కాళిదాసు'నికళా ♦ కలితమతికిఁ
బ్రౌఢమహాకావ్య ♦ రచనాధురీణుఁడౌ
'శ్రీహర్ష' కవివర్యు ♦ చిత్రమతికి
శబ్దప్రయోగకౌ ♦ శలవిదగ్ధుండగు
'భట్టబాణు'నిమహా ♦ భవ్యమతికిఁ

గీ. జండతరశబ్దరుచిర బ్ర ♦ హ్మాండమునకు
దండమైపొల్చుదండియు ♦ ద్దండమతికి
నాలవాలమునీదు వి ♦ శాలమహిమ
సకలకల్యాణ గుణధన్య! ♦ సర్వమాన్య! 63.

సీ. 'నన్నయ' నీశర ♦ ణంబుఁ జొరకయున్న
'వాక్ఛాసనుం'డయి ♦ వఱలువాఁడె?
'తిక్కన'నీభక్తిఁ ♦ దేలియాడకయున్నఁ
'గవిబ్రహ్మ' యైకీర్తి ♦ గాంచువాఁడె?
'పోతన' నినుఁగాంచి ♦ పొంగిపొర్లకయున్న
'సహజపాండిత్యుఁ'డై ♦ చనెడువాఁడె?
'శ్రీనాథుఁ'డేనిన్నుఁ ♦ జింతింపకుండినఁ
'గవిసార్వభౌముఁ'డై ♦ క్రాలువాఁడె?

గీ. 'నాచనాన్వయశ్రీసోమ ♦ నాథసుకవి'
సర్వమర్పించి నీసేవ ♦ సలుపకున్న
భవ్య 'సర్వజ్ఞ' చిహ్నుఁడై ♦ ప్రబలువాఁడె?
సకలకల్యాణగుణధన్య! సర్వమాన్య! 64

సీ. నారదమునిభాతి ♦ పవనవరీతుల
భక్తిగీతమ్ములఁ ♦ బాడిపాడి
అన్యోన్యమగుప్రేమ ♦ నందజేయఁగొల్ప
భవ్యవాగ్ఝరులను ♦ పన్యసించి
గురుశిష్యధర్మముల్ ♦ గూర్మింగో నేర్పంగ
నవ్యశాంతినికేత ♦ నంబునిలిపి
విశ్వభారతియను ♦ విమలవిద్యాపీఠ
మును నెలకొల్పెడు ♦ పనికిఁబూని

గీ. ఆసియాకవిసార్వభౌ ♦ మాంకమంది
నిండుకీర్తి 'రవీంద్రనా ♦ థుండు' గనుట
భక్తితో నిన్నుఁగొల్చుట ♦ వలనఁగాదె?
సకలకల్యాణగుణధన్య! ♦ సర్వమాన్య! 65

సీ. ప్రాచీనభారత ♦ ధన్యదృశ్యమ్ముల
బుద్ధిలోఁదలపోసి ♦ భువనమెఱుఁగ
నమల చిత్రమ్ముల ♦ నలవరించుటె కాక
కదుఁజిత్రముగ జీవ ♦ కళలనించి
జాతిజీవనములో ♦ నూతనోజ్జీవంబు
చిత్రచాతురిచేతఁ ♦ జెలఁగనిచ్చి
యాసేతుశీతమ ♦ హాచలపర్యంత
భరతభూమికిగౌర ♦ వంబుఁగూర్చి

గీ. యింటనింటను గంటికి ♦ నింపునింపి
పూతచారిత్రములబుద్ధి ♦ పొడమఁజేసి
కీర్తి 'రవివర్మ' గనుటసీ ♦ కృపనుగాదె ?
కపలకల్యాణ గుణధన్య ! ♦ సర్వమాన్య! **66**

సీ. బాలవితంతుల ♦ పరితాపములనార్ప
జనకుఁడై యీశ్వర ♦ చంద్రుఁ డొప్పె
నతఁడే యితండన ♦ నతికృపామతిఁ బాయి
'వీరేశలింగము' ♦ వినుతికెక్కెఁ
బరిశుద్ధభక్తిచే ♦ భవ్యవాక్సుధలచేఁ
'గేశవచంద్రసేన్' ♦ కీర్తిఁగాంచె
నతఁడే యితండన ♦ నమలవర్తనముచే
'రఘుపతివేంకట ♦ రత్న' మమరె

గీ. నహాహా! ఈశ్వర కేశవు ♦ లంతవారు
వీరరత్నంబులలరిన ♦ విమలభూమి
భక్తులకునాటపట్టయి ♦ ప్రబలకున్న?
సకలకల్యాణ గుణధన్య! ♦ సర్వమాన్య! 67

సీ. భక్తిభీష్ముండని ♦ ప్రఖ్యాతివడసిన
'శివనాథశాస్త్రి'తోఁ ♦ జెలిమి నెఱపి
కార్యశూరుండును ♦ గరుణానువర్తియౌ
'వీరేశలింగార్య' ♦ దారిఁ ద్రొక్కి
పాంచాలమండలి ♦ భక్తాగ్రమణులలో
'గురుదత్తవిద్యార్థి' ♦ గుణముగలిగి
యెన్నికీడులుమూడి ♦ తన్ను బాధించిన
నిన్నుఁజిత్తమునందు ♦ నిలిపితోర్చి

గీ. చిన్నయయ్యను భక్తిలోఁ ♦ బెద్దయగుచు
దేశరాజాన్వయాగార ♦ దీపమైన
'పెద్దబాపయ్య' కిల నెవ్వ ♦ రుద్దియయ్యె?
కసలకల్యాణగుణధన్య! సర్వమాన్య! 68

సీ. శ్రీనాథుఁడైనను ♦ జిఱుపద్దమేజెప్పఁ
జాలునే నీదయ ♦ చాలకున్న ?
సర్జుచుండైనను ♦ నంగుళినేనెత్తఁ
జాలునే నీదయ ♦ చాలకున్న ?
వలఁతినారదుఁడైన ♦ నలగీతమేన్పాడఁ
జాలునే నీదయ ♦ చాలకున్న?
హనుమంతుఁడైనను ♦ నణువేనియునుమోయఁ
జాలునే నీదయ ♦ చాలకున్న ?

గీ. కాన నీదయగల్గెడు ♦ కరణిమెలఁగి
భక్తులందఱుఁదమతమ ♦ భక్తికొలఁదిఁ
గార్యసాఫల్యమును బొంది ♦ కాంలుచుందు
సకలకల్యాణ గుణధన్య ! ♦ సర్వమాన్య! 69

సీ. బొబ్బిలిశ్రీరంగ ♦ భూజానినకలంక
శౌర్యశోభితయశ ♦ స్సాంద్రుఁ జేసి
మాడభూమీశులంపు ♦ మణి వేంకటాచార్యు
నతులావధానవి ♦ ఖ్యాతుఁ జేసి
భాష్యమయ్యంగారి ♦ బహుసూక్ష్మన్యాయైక
వీక్షణంబున మహా ♦ దక్షుఁ జేసి
శ్రీకోడిరామమూ ♦ ర్తిని నద్భుతంబగు
బలముచే గౌరవ ♦ కలితుఁ జేసి

గీ. భక్తిరసమును గురిపించు ♦ భవ్యకృతులఁ
ద్యాగరాజునుబరిపూర్ణ ♦ ధన్యుఁ జేసి
పొల్చునినుఁగొల్చి శుభములఁ ♦ బొందరాదె?
సకలకల్యాణ గుణధన్య! ♦ సర్వమాన్య! 70

సీ. ప్రజకుస్వరాజ్యమే ♦ పరమావధియటంచుఁ
దేటగా 'నౌరోజి' ♦ తెలియఁబఱిచె
సంఘసంస్కరణమే ♦ సర్వసాధనమని
తేటగా 'రానడే' ♦ తెలియఁబఱిచె
విద్యయుండినఁగాని ♦ వెలయదుసుఖమని
తేటగా 'గోఖలే' ♦ తెలియఁబఱిచెఁ
గర్మయోగమునందె ♦ కలదుసర్వంబని
తేటగాఁ 'దిలకుండు' ♦ తెలియఁబఱిచె

గీ. నన్నియున్నను నీభక్తి ♦ యున్నఁగాని
సర్వసౌభాగ్యమబ్బదు ♦ జనులకంచుఁ
దేటగానుమహాత్ముండు ♦ దెలియఁబఱిచె
సకలకల్యాణ గుణధన్య! ♦ సర్వమాన్య! 71

సీ. నినుభక్తిమదినిడి ♦ నీతివర్తించుచే
మతమనె 'తాయాబ్జి' ♦ మనుసదృశుఁడు
నినుభక్తిమదినిడి ♦ నీతివర్తించుచే
మతమనె 'ఆడమ్సు' ♦ మహితయశుఁడు
నినుభక్తిమదినిడి ♦ నీతివర్తించుచే
మతమనె 'నౌరోజి' ♦ మాన్యతముఁడు
నినుభక్తిమదినిడి ♦ నీతివర్తించుచే
మతమనె 'మాంటేగ్యు' ♦ మానధనుఁడు

గీ. 'మదనమోహన మాలవ్య' ♦ యదియె యన్నిమ
మతములివియిట్లు నీలోన ♦ మగ్నమయిన
స్వర్గమగుఁగాదె భువియొక ♦ సత్వరముగ
సకలకల్యాణ గుణధన్య! ♦ సర్వమాన్య! 72

సీ. శ్రీమహోర్విసత్పురి ♦ శ్రీమలచేయోగ్యమౌ
వాణిజ్యవృత్తికి ♦ వన్నెఁదెచ్చి
కోట్లకొలందిగాఁ ♦ గూర్చిధనమ్ముల
వరవణిక్ప్రభువని ♦ వాసిఁగాంచి
స్థిరమైనలాభంబు ♦ క్షితికిఁగల్గించెను
విద్యలనార్జించు ♦ నుద్యమమున
ధనరాసులనుమహా ♦ ధారగాఁగురిపించి
'దాత' దాతలకును ♦ ధాతయగుచు

గీ. వేషయంబగుకీర్తిని ♦ నమరుకొల్ల
విమలమౌభక్తిహృదయానఁ ♦ గొమరుమిగిలి
యతిశయంబుగవెలిఁగిన ♦ కతనఁగాదె ?
సకలకల్యాణగుణధన్య ! ♦ సర్వమాన్య ! 73

సీ. బానిసవారల ♦ బంధవిముక్తికై
జంకకపోరిన ♦ ' లింక ' నొకఁడు
పోపు ' లదార్జన్య ♦ మునుధిక్కరించిన
యుత్తమయోధుఁడౌ ♦ ' ల్యూథ ' రొకఁడు
నరకంబులుగనున్న ♦ చెఱలనుసవరించి
మనిన 'హోవార్డను' ♦ మాన్యుఁడొకఁడు
కొజ్జాలఁగల్పించు ♦ క్రూరకార్యంబును
ఖండింపఁబుట్టఁబో ♦ నుండునొకఁడు

గీ. లోకశోకంబులార్ప ప్ర ♦ లోభములను
వదలువారలువీరలె ♦ వారికైన
వందనీయులునీభక్తి ♦ వరులుగాన
సకలకల్యాణగుణధన్య ! ♦ సర్వమాన్య! 74

సీ. బాష్పంబులోపల ♦ 'వాట్టు' నకెంతయు
నెలనితోదర్శన ♦ మిచ్చినావు
పైనుండిరాలిన ♦ పండుచే 'న్యూటను'
చిత్తమాకర్షించి ♦ చెలఁగినావు
'ఎడిసను' నాకర్షింప ♦ వడి 'ఫానుగ్రాఫులో'
వేడుకతో మాట ♦ లాడినావు
వింతగా మెఱుపులో ♦ 'బెంజమన్ ఫ్రాంక్లిను'
తోడదాఁగిలిమూఁత ♦ లాడినావు

గీ. 'మార్కొని' కిఁదీఁగెలేనట్టి ♦ మార్గమందు
వార్తలనుబంపియానంద ♦ వార్ధిలోనఁ
దేల్చినాఁడవునీకృప ♦ తేటపడఁగ
సకలకల్యాణగుణధన్య! ♦ సర్వమాన్య! 75

సీ. అమెరికాకును స్వేచ్ఛ ♦ నార్జించుటకుగాను
' జార్జివాషింగ్టను ' ♦ శౌర్యనిధిని
ఇటలీనిగాపాడ ♦ నేచియాష్ట్రియతోడ
డీకొన ' గ్యారిబా ♦ ల్డి ' నిఘనుని
సర్వవిధమ్ముల ♦ చైనానుసవరింప
' సన్‌యెట్టుసేను ' ని ♦ చతురమతిని
కుడియున్నరష్యాను ♦ వడిలేవనెత్తంగఁ
దగిన ' మహాలినన్ ' ♦ ధైర్యధనుని

గీ. బంపికృపఁజూపినట్టియో ♦ పరమపురుష
యుర్విసొకొక్కదేశంబు ♦ నుద్ధరింపఁ
బంపుదువుకాదెయొకొక్క ♦ భక్తవరుని
సకలకల్యాణగుణధన్య ! ♦ సర్వమాన్య! 76

సీ. ఆర్తులపాలికి ♦ నాప్తుఁడై వర్తిల్లి
కీర్తిఁగాంచినదయా ♦ మూర్తి యెవఁడు?
ప్రభువై జనించియు ♦ విభవమ్ములనుమాని
త్యాగియైమనినవి ♦ రాగియెవఁడు ?
అర్థమ్ముసమవిభా ♦ గార్హ్యమౌ ధర్మమ్ము
దేటగాఁజాటిన ♦ ధీరుఁడెవఁడు ?
హింసకహింసయే ♦ హితమహౌషధమని
తనయందుఁజూపిన ♦ ధన్యుఁడెవఁడు ?

గీ. ఎన్నికష్టమ్ములొదవిన ♦ నెలమినోర్చి
సీమహాదివ్యపథమున ♦ నెగడెనెవఁడు ?
అతఁడు 'టాల్‌స్టాయి' యనెడుర ♦ ష్యామహర్షి
సకలకల్యాణగుణధన్య ! ♦ సర్వమాన్య! 77

సీ. 'సీతామహాదేవి' ♦ శ్రీరామచంద్రుని
వరియించెనుస్వయం ♦ వరమునందు
'దమయంతి' నలమహా ♦ ధరణీధవేంద్రుని
వరియించెనుస్వయం ♦ వరమునందు
'పాంచాలరాట్సుత' ♦ పాండవోత్తముఁబార్థు
వరియించెనుస్వయం ♦ వరమునందు
నట్టిస్వయంవర ♦ మనుగంటిపెండ్లిండ్లు
ప్రబలంగఁజొచ్చెను ♦ బాల్యమందు

గీ. మఱలవిద్యాప్రవీణలై ♦ మానవతులు
వరునివరియించిసుస్వయం ♦ వరమునందు
భవ్యచరితులఁబుత్రులఁ ♦ బడయనిమ్ము
సకలకల్యాణగుణధన్య! ♦ సర్వమాన్య! 78

సీ. నీకరుణావ్యాప్తి ♦ నెగడఁ ' కౌసల్య ' కు
రామచంద్రుఁడుపుట్టి ♦ రహినిగూర్చె
నీయనుకంపచే ♦ నెమ్మి ' దేవకి ' కిశ్రీ
కృష్ణుఁడుద్భవమంది ♦ కీర్తిఁజేర్చెఁ
కృష్ణరాయలునీదు ♦ కృపచేత ' నాగమాం
బా ' సాధ్వికుదయించి ♦ వాసినించె
నీదయచే ' జిజా ' ♦ నిర్మలాత్మకుశివా
జీజనియించిప్ర ♦ సిద్ధిఁదెచ్చె

గీ. నీకటాక్షంబుగల్గిన ♦ నెలతమిన్న
సుగుణమణిభూషగావెల్గు ♦ సుతునిఁగాంచి
కడుపుచల్లఁగబ్రదుకునీ ♦ పుడమియందు
సకలకల్యాణగుణాధన్య ! ♦ సర్వమాన్య! 79

సీ. ఏరాజకన్యయు ♦ నెలఱుఁ బెండ్లాడని
పుట్టుగుడ్డినిగోరి ♦ చెట్టపట్టి
పతికి లేనిసుఖంబు ♦ సతికిఁదగదని
కనులుగన్పడకుండఁ ♦ గట్టుగట్టి
పుత్రులు పెక్కండ్రు ♦ పుట్టినశోకనిని
గనుఁగోక మనసును ♦ గట్టిపెట్టి
యనికేఁగఁ సుతుఁడు మ్రొ ♦ క్క నధర్మమే గెల్చు
వత్స ! పోపొమ్మని ♦ వరమువెట్టి

గీ. భర్తపోఁబడినడవికి ♦ బయలుదేఱి
కష్టములకోర్చె ' గాంధారి ' ♦ కడఁకమీఱి
భక్తినీసతిమించిన ♦ వారలేరి ?
సకలకల్యాణగుణధన్య ! ♦ సర్వమాన్య ! 80

సీ. శ్రీహరిశ్చంద్రుని ♦ బ్రీతితో సేవించి
మహిమమించినచంద్ర ♦ మతియొకర్తు
సత్యవంతునికయి ♦ సకలార్తినోర్చిన
చిత్రచారిత్రసా ♦ విత్రియోర్తు
వీరేశలింగము ♦ వెంటధర్మమునంటి
చనినట్టిరాజ్యల ♦ క్ష్మమ్మయోర్తు
పతితోడ దేశసే ♦ వనుజేసికష్టముల్
పడుచుండు ' కస్తూరి ♦ బాయి ' యోర్తు

గీ. మఱియుసత్కార్యశూరులై ♦ మహినివెలయు
భర్తలకుఁదోడునీడలై ♦ పరఁగుసతులు
పూనినీమెప్పువడసిన ♦ పుణ్యసతులు
సకలకల్యాణగుణధన్య ! ♦ సర్వమాన్య! 81

సీ. తిరిగినచోటెల్ల ♦ స్త్రీసమాజమ్ముల
నెలకొల్పుచుండిన ♦ నెలఁతమిన్న
ఆంధ్రజాతికినొక్క ♦ యాభూషణంబయి
యలరుచునుండిన ♦ లలితసుగుణ
సాధ్వీలలామల ♦ చారిత్రరత్నముల్
దండగాఁగూర్చిన ♦ ధన్యచరిత
యని తనునందఱు ♦ గొనియాడ వెలసిన
యట్టి ‘ శ్రీభండారు ♦ అచ్చమాంబ ’

గీ. నీదునాజ్ఞలఁజెల్లించి ♦ నిష్కళంక
నీతిఁదాఁజరియించిన ♦ రీతినెల్లఁ
దెలుపనినుఁజేరవచ్చెనో ♦ దేవదేవ !
సకలకల్యాణగుణధన్య ! ♦ సర్వమాన్య!

సత్యభామాదేవి ' ♦ సమరకౌశలమున
శౌరినిమెప్పించి ♦ సంతసించె ;
రణమునదశరథ ♦ ప్రభునకుఁదోడ్పడి
కేకయరాట్పుత్త్రి ' ♦ కీర్తిఁగాంచె ;
దుర్గావతీదేవి ' ♦ దుష్టులఖండించి
తనమానమునుగాచి ♦ కొనగతించె ;
' పద్మిని ' శత్రుల ♦ బలములఁజెండాడి
పతిఁజెఱవిడిపించి ♦ భక్తిమించె ;

గీ. ఆత్మరక్షాసమర్థలై ♦ యలరునట్టి
యంగబలమునుగ్రుంగని ♦ యాత్మబలము
గలుగుధీరలెసీకృష్ణ ♦ జెలఁగువారు
సకలకల్యాణగుణాధన్య ! ♦ సర్వమాన్య! 83

సీ. 'సీతాసతీమణి' ♦ చెఱనున్న సమయాన
నోదార్చినదిభవ ♦ త్సూక్తి కాదె?
'పాంచాలిఁ' బట్టంగఁ ♦ బఱతెంచుకీచకుఁ
బడఁదన్నినదిభవ ♦ త్పదము కాదె?
'దమయంతి' నడవిలోఁ ♦ దాఁకవచ్చినవ్యాధు
రూపుమాపినదినీ ♦ చూపు కాదె?
'పద్మిని' జెఱఁగొన ♦ బలసివచ్చినమ్లేచ్ఛు
బలముఁగూల్చినదినీ ♦ బలము కాదె?

గీ. సాధ్వులకుమానభంగంబు ♦ సలుపనెంచు
నీచులనుబట్టివిదలించి ♦ నీఱుసేయ
నెడ తెగక వేచునదినీదు ♦ కడఁక కాదె?
సకలకల్యాణగుణధన్య! ♦ సర్వమాన్య!

సీ. 'రాణీభవాని' దా ♦ రాజ్యంబు సేయంగఁ
ప్రజలకు సౌఖ్యంబు ♦ బ్రబలుటకును
ధరణి 'నహల్యాంబ' ♦ దయతోడఁ బాలింప
స్వర్గధామంబయి ♦ వఱలుటకును
'నూర్జహాఁ' నేలంగ ♦ నూత్నవైభవముల
నెలవుగా నిబ్భూమి ♦ యలరుటకును
'ఆమహావిక్టోరి ♦ యా' మాతరక్షింప
శాంతమ్ము నాట్యమ్ము ♦ సల్పుటకును

గీ. స్త్రీలు పాలించు భాగ్యంబు ♦ క్షితికిఁ గల్గ
నప్పుడెల్లను సంతోష ♦ మబ్బుటకును
గారణము చూడ భవదీయ ♦ కరుణ కాదె ?
సకలకల్యాణగుణధన్య ! ♦ సర్వమాన్య! 85

సీ. బాలవితంతుల ♦ పరితాపములఁగూర్చి
వనరిన ' భగవతీ ' ♦ జననిజనని
వరదయాశాలివై ♦ ప్రజలకుమేలొసంగ
రాసి ' విక్టోరియా ' ♦ రాణిరాణి
తనదానమహిమచే ♦ ఘనగౌరవమ్ములఁ
దనరిన ' స్వర్ణమా ' ♦ దాతదాత
' అమెరికా ' చనిభర్త ♦ యమలసంకల్పంబు
సలిపిన ' యానంద ' ♦ సాధ్విసాధ్వి

గీ. నిరుపమానందరూపుఁడౌ ♦ నిన్ను మదిని
నిరతమునునిల్పిభజియించి ♦ నెగడినట్టి
భవ్య ' తరిగొండవేంకమ ' ♦ భక్తభక్త
సకలకల్యాణగుణధన్య ! ♦ సర్వమాన్య!

సీ. విద్యసరస్వతీ ♦ విగ్రహాంబగు 'రమా'

రమణీలలామంబు ♦ రహిఁవహించె

స్వర్ణగేహాళిపేరఁ ♦ జారుకావ్యమొనర్చి

'కవిసరోజిని' మహా ♦ ఖ్యాతివడసె

మహిళావినోదినీ ♦ మాసపత్రికఁగూర్చి

'కమలా' సతీతిల ♦ కంబుమించె

స్త్రీచికిత్సలనాంగ్ల ♦ సీమనేరిచివచ్చి

'శ్రీద్వారకాబాయి' ♦ చెన్నుమీఱె

గీ. 'సరళ' 'హారిదేవి' మొదలగు ♦ చారుమతులు

విమలగుణముల విద్దెల ♦ వెలసినారు

నీకృపామృతపూరంబు ♦ నెగడుకతన

సకలకళ్యాణగుణధన్య! ♦ సర్వమాన్య! 87

సీ. శ్రీరామకృష్ణుని ♦ శిష్యురాలైయుండి
యతనిబోధలనెల్ల ♦ నాత్మనిలిపి
భారతోద్ధరణమే ♦ పరమధర్మంబని
తనదేశమునువీడి ♦ తరలివచ్చి
భారతీయులపూర్వ ♦ భవ్యచారిత్రమ్ము
లందమౌశైలిని ♦ బొంకుపఱిచి
దీనులయాపదల్ ♦ దీర్చుకార్యములందు
శక్తికిమీఱిన ♦ సాయమొసఁగి

గీ. నిష్కళంకపవిత్రత ♦ నెగడుచుండి
నీదునాజ్ఞలనెఱవేర్చి ♦ నిన్నుఁజేర
'సోదరినివేదితా'కన్య ♦ సుగుణగణ్య
సకలకల్యాణగుణధన్య! ♦ సర్వమాన్య. ౯౪

సీ. రణరంగమున నిరు ♦ పక్క సైన్యములందు
గాయమొందినవారిఁ ♦ గరుణనరయ
స్వయముగాఁ గృషిచేసి ♦ సభలను నెలకొల్పి
ఖ్యాతి 'నైటింగేలు' ♦ గాంచుటెల్ల
సరకుసేయక మహా ♦ దురితముల్ గావించి
చెఱఁబడ్డ పతితుల ♦ చెంతఁ జేరి
యుద్బోధన మొనర్చి ♦ యుత్తములుగఁ జేసి
'ఎలిజబెత్ ఫ్రై' కీర్తి ♦ నలరుటెల్ల

గీ. ఫ్రాన్సులో దేశభక్తిని ♦ బాదుకొల్పఁ
ప్రాణమిడి 'జోను' యశమును ♦ బడయుటెల్ల
దమమనంబుల నీభక్తి ♦ దనరఁగాదె?
సకలకల్యాణగుణధన్య! ♦ సర్వమాన్య! 89

సీ. పాశ్చాత్యదేశానఁ ♦ బ్రభవించియునుగూడ
ప్రాచ్యులమేలుకై ♦ పాటుపడియె
మాంసాశనంబును ♦ మరగియుండియుఁగూడ
కందమూలాశన ♦ కలితయయ్యెఁ
బాలఁతియయ్యునుగూడఁ ♦ బురుషులతోఁ బాటు
ప్రతిసంస్థలోఁదన ♦ ప్రతిభఁ జూపె
నాస్తికాగ్రిణులలో ♦ నాహుమందియుఁగూడ
నీజ్ఞాన సభకు ని ♦ ర్ణేతయయ్యె

గీ. దేవ! యి 'ట్లాఁబీసెంటు' ♦ జీవితమునఁ
జోద్యముగమార్పులెన్నియో ♦ చూపినావు
ఇంకసేవింతమూపుఁగా ♦ నెంచినావా?
సకలకల్యాణగుణధన్య! ♦ సర్వమాన్య! 90

సీ. మిసమిసల్ చిమ్మెడు ♦ మెత్తనిపువ్వుల
నీవు మరందంబు ♦ నించినట్లు
ముద్దుపల్కులఁగుల్కు ♦ పద్దెమ్ములను 'మొల్ల'
రామకథామృత ♦ రసమునించె
ఊరఁబెట్టినయట్టి ♦ యచ్చంపుఁబాలలోఁ
గరళమ్ముసర్పమ్ము ♦ గ్రక్కినట్లు
కదళికాపాకపుఁ ♦ గయితలోఁ జెడుకత
మూర్ఖురాలైకూర్చె ♦ "ముద్దుపళని"

గీ. కానఁగాంతురుసీదయా ♦ గారమైన
స[illegible]షల్ ♦ సంతతంబు
మొల్లకీర్తిని నపకీర్తి ♦ ముద్దుపళని
సకలకల్యాణగుణధన్య! ♦ సర్వమాన్య! 91

సీ. రామచంద్రునివంటి ♦ రమణునిఁ బెండ్లాడి
కుశలవులనుబోలు ♦ కొమరులఁగని
పతిభక్తిలోపలఁ ♦ బ్రఖ్యాతిగాంచిన
సతిసీత కెనవచ్చు ♦ చరితఁగలిగి
పుట్టినయింటికి ♦ మెట్టినయింటికి
క్షీణింపఁబోని స ♦ త్కీర్తిఁగాంచి
నీభక్తిలోపల ♦ నిరతంబు నెగడుచు
నానందమునఁదేలి ♦ యాడుకొఱకు

గీ. జననమొసఁగితివనుబుద్ధి ♦ తనకు లేక
[illegible] నిగ్గ ♦ [illegible]
బ్రానకంబైను ధ్యానంబు ♦ చాలమేలు
సకలకల్యాణగుణధన్య! ♦ సర్వమాన్య! 92

సీ. నిప్పులఁగురిసెడు ♦ నెండవేసవినైన
వదలకవర్షించు ♦ వాననైన
గజగజవణకించు ♦ కడుశీతమునవైన
రేలైనఁ బవలైన ♦ రెంటనైనఁ
గోపించిపైఁబడు ♦ క్రూరునికడనైనఁ
జెడఁదిట్టు నీచుని ♦ చెంతనైన
విధివిరుగడలేని ♦ వృత్తియందేయైన
దేశదేశమ్ములఁ ♦ దిరిగియైనఁ

గీ. గష్టపడిగడియించి రొ ♦ క్కమ్ముదెచ్చి
తన్నుఁబోషించుభర్తకుఁ ♦ దప్పినడచు
సుదతికిఁపరసౌఖ్యములే ♦ సున్నసున్న
సకలకల్యాణగుణధన్య! ♦ సర్వమాన్య! ౯౩

సీ. కనికరముగారాబ ♦ మునఁ బెంచుచుండిన
తల్లిదండ్రుల ప్రాపు ♦ నెల్ల వదలి
యాటపాటలఁ దను ♦ నలరించుచుండిన
తనదుతోఁబుట్టులం ♦ దఱిని వదలి
యిరుగునఁ బొరుగున ♦ నెలమితోఁ గ్రీడల
సలుపుచుండిన యట్టి ♦ సఖుల వదలి
పలుమాఱుఁ జూచుచుఁ ♦ బలుకరించుచు నున్న
మితిలేని బాంధవ ♦ ప్రతతి వదలి

గీ. సర్వమును భర్తయే యని ♦ శ్రద్ధతోడ
వచ్చినాల్చెను సాధ్విని ♦ వదలిపెట్టి
కష్టములఁ బెట్టువాఁడెపో ♦ కటికవాఁడు
సకలకల్యాణగుణధన్య! ♦ సర్వమాన్య! 94

సీ. మానుషజన్మంబు ♦ మాన్యంబుగాఁ జేయఁ
గార్యమ్ము లెన్నియో ♦ కలిగియుండఁ
జీట్లాడువారును ♦ జీటికిమాటికిఁ
బోట్లాడువారును ♦ బుద్ధిగొట్టి
కాట్లాడువారును ♦ కనికరమునుమాని
కోళ్ళపందెముఁజూచి ♦ కులుకువారు
వెలలేనివీర్యంబు ♦ వేశ్యలపాల్జేసి
యిల్లాలినింట నే ♦ డ్పించువారు

గీ. స్వర్గమును నరకంబుగ ♦ సలుపువారు
దేవ! వీరినినీవొక ♦ దెబ్బగొట్టి
మంచిమార్గానఁ బెట్టు నీ ♦ మహిమవలన
సకలకల్యాణగుణధన్య! ♦ సర్వమాన్య! 95

సీ. బడలికఁదీర్చెడు ♦ బంధువుగాఁదోఁచి
పిమ్మటఁబీలిచి ♦ పిప్పి చేయు
జిత్తముఁ గాకసింపఁ ♦ జేయునట్లుగు పడి
చేయఁగూడనిపనుల్ ♦ సేయనిచ్చు
నప్పటికప్పుడా ♦ ప్యాయమానంబయి
విపరీతదాహంబు ♦ వెనుకఁగూర్చు
నంతకంతకుమితి ♦ నభివృద్ధికినిదెచ్చి
కొనకు మేరనుమీఱి ♦ కొంపఁదీయుఁ

గీ. బుట్టుకనువ్యర్థపఱచుఁబె ♦ న్యాతమగుచు
సీకుదూరంబుగానుంచు ♦ నీతిఁజెరచుఁ
గానఁదాగ్రుడుకంటెను ♦ గలదెకీడు?
సకలకల్యాణగుణధన్య! ♦ సర్వమాన్య!

సీ. హాయిగావీచుచు ♦ నాయాసమునుదీర్చు
మహిమనొప్పెడు మంద ♦ మారుతమును
ఆప్యాయమానంబు ♦ లమృతతుల్యంబులు
నిర్మలంబులునైన ♦ నీరములును
అవయవంబులకెల్ల ♦ నమవైనబలమును
బొసఁగించుమృష్టాన్న ♦ భోజనమును
అంతకుమీఱిన ♦ యతిశయసౌఖ్యంబు
నెమ్మదిలోఁగూర్చు ♦ నిద్దురయును

గీ. నీప్రసాదముచేఁగల్గి ♦ నెగడుచుండ
వానిఁగోఁద్రుప్తిఁబొందుట ♦ మానిమద్య
పానమొనరింప నిహమును ♦ బరము చెడదె?
సకలకల్యాణగుణధన్య! ♦ సర్వమాన్య! 97

సీ. వేర్వేఱురుచులచే ♦ వింతలుగొలిపెడు
పలుతెఱంగులమంచి ♦ పండులుండఁ
దలఁచిననోరూరు ♦ తాలింపులకుఁజాలు
గణనకుమీఱు శా ♦ కంబులుండ
దిన మొక్క దినుసుగాఁ ♦ దనియింపఁగల మేలు
పలురకంబులపిండి ♦ వంటలుండ
గరగరఁగరఁగిపో ♦ వరుగులువడియాలు
గడుఁజవిగలయూరుఁ ♦ గాయలుండఁ

గీ. బాలుపెరుఁగు సమృద్ధిగాఁ ♦ బరగుచుండ
గనికరముమాని మాంసంబుఁ ♦ దినమరగిన
క్రూరమతి కేడ? నీభక్తి ♦ కుదురు టేడ?
సకలకల్యాణగుణధన్య! ♦ సర్వమాన్య! 98.

సీ. తొమ్మిది నెలలు గ ♦ ర్భమ్మున మోచి ని
ప్పులకోర్చి కనెడు ప్రి ♦ భూతమాత
యేతటిబిడ్డకు ♦ నేమివచ్చునొయని
భీతిల్లు కరుణా స ♦ మేతమాత
మలమూత్రములుమీఁద ♦ సలిపినవిసువక
పోషించునట్టి ప్రి ♦ పూతమాత
తెగులువచ్చినవేళఁ ♦ బాగలుచుమెలకువ
గలిగివర్తించు వి ♦ ఖ్యాతమాత

గీ. పరమపావనగుణగణ ♦ భరితమాత
యట్టిమాతను సేవించు ♦ నట్టిచేత
నీకుఁగూర్చినచేఁత లో ♦ కైకమాత
సకలకల్యాణగుణధన్య! ♦ సర్వమాన్య! 99

సీ. రక్తికుటుంబ భా ♦ రము నెల్ల వహియించి
వారక పనిచేయు ♦ వాఁడుతండ్రి
యింట నెవ్వరి కెప్పు ♦ డేమి కావలసినఁ
బనిపూని తెచ్చెడు ♦ వాఁడుతండ్రి
గృహ కార్యములయందు ♦ గృహిణికిఁదోడ్పడి
వర్తించుచుండెడు ♦ వాఁడుతండ్రి
మందిరమ్మున మహా ♦ నందమ్ము గలుగంగఁ
బరమమైత్రిసగూర్చు ♦ వాఁడుతండ్రి

గీ. వసుధలోఁ దల్లి సరితూఁగు ♦ వాఁడుతండ్రి
అట్టితండ్రినిద్రోల్పసి ♦ యట్టివాఁడు
బ్రతికిచచ్చినవాఁడన ♦ వచ్చుఁతండ్రి!
సకలకల్యాణగుణధన్య! ♦ సర్వమాన్య! 100

సీ. తనజన్మకారకుల్ ♦ తలిదండ్రులగుటను
భావించివారిని ♦ దేవతలుగఁ
దనతల్లిఁ పేర్వెట్టి ♦ దానధర్మమ్ములఁ
బడఁతులదుఃఖముల్ ♦ పాయఁజేసి
దీనులదైన్యంబు ♦ దీర్పఁగాఁ దనతండ్రి
పేరిడిసత్కార్య ♦ వితతిసలిపి
మాతాపితలనిట్లు ♦ మన్నించిభక్తితో
భవదీయకరుణకుఁ ♦ బాత్రుఁడగుచు

గీ. స్త్రీలుదీనులు దీవెనల్ ♦ చాలనొసఁగ
జననసాఫల్యమొనరించు ♦ కొనెడునట్టి
తనయుఁడొక్కఁడువంశపా ♦ వనుఁడుచాలు
సకలకల్యాణగుణధన్య! ♦ సర్వమాన్య! 101

సీ. సుగుణరత్నంబుల ♦ సుందరహారమై
కులదీపకుండగు ♦ కొడుకుకొడుకు
నీతివర్తనమందు ♦ నిరతుఁడై నిరతంబు
సదుపదేశముసేయు ♦ సఖుఁడుసఖుఁడు
పతినిప్రాణంబుగా ♦ భావించి సేవించి
భక్తితోమెలఁగెడు ♦ భార్యభార్య
ఆత్మకుసమముగా ♦ నతివనుజూచుచుఁ
బరమప్రీతిఁగూర్చు ♦ భర్తభర్త

గీ. సకలమునునీకు నర్పించి ♦ సంతతంబు
నీదునాజ్ఞలఁదలఁదాల్చి ♦ నిష్కళంక
భూరితేజంబుతోఁబొల్చు ♦ బుధుఁడుబుధుఁడు
సకలకల్యాణగుణధన్య! ♦ సర్వమాన్య! 102

సీ. సకలవిద్యలలోని ♦ సారంబుగ్రహియించి
సర్వభూతములందు ♦ సమతనుంచి
భావంబుఁ గరుణాప్ర ♦ వాహంబు చేయించి
తవిలి నీయాజ్ఞ నా ♦ దలధరించి
యభిమానమును గూల్చి ♦ యాగ్రహంబును గాల్చి
కలుషజాలము లెల్లఁ ♦ గడిగివైచి
యంతర్హృదయాంత ♦ వీధమ్ముల నుభక్తి
రసము చుగురిపించు ♦ రక్తిమించి

గీ. సుగుణమణిహారసూత్రమై ♦ సొంపుగుల్క
వినయసూత్రంబు ధరియించి ♦ వెలుఁగుచుండు
వాఁడెపో బ్రాహ్మణుఁడన ♦ వసుధయందు
సకలకల్యాణగుణధన్య! ♦ సర్వమాన్య! 103

సీ. దీనరక్షణకళా ♦ దేదీప్యమానుఁడై
విషయభోగాసక్తి ♦ విముఖుఁడగుచు
భూరిదానవినోద ♦ పారిజాతంబయి
క్రూరమహీజకు ♦ ఠారమగుచు
వివిధవిద్వద్బృంద ♦ విబుధనాథుఁడయి
మూఢులపాలికి ♦ మూకయగుచు
భవదీయమహిమాను ♦ వాదనవందియై
పాపులకడరు ద ♦ వాగ్నియగుచు

గీ. భవ్యకరుణోపవీత సం ♦ బద్ధశౌర్య
ఖడ్గభూషణకాంతిచే ♦ గ్రాలుచుండు
వాఁడెపోతుత్క్రియుండన ♦ వసుధయందు
సకలకల్యాణగుణధన్య! ♦ సర్వమాన్య! 104

సీ. కృషిశిల్పవాణిజ్య ♦ వృత్తుల ధనమును
విరివిగాఁగూరిచి ♦ వృద్ధిఁజేసి
లోభంబు విడనాడి ♦ లోకైకహితకార్య
ములయందు ధారాళ ♦ ముగ నొసంగి
యుపరక్షణంజేసి ♦ యుందఱుఁ బొగడఁ
బరమ విఖ్యాతిఁజేఁ ♦ బడసి విజ్ఞ
నీభక్తిలోఁ బల ♦ నిరతంబు మగ్నుఁడై
యానందమునఁ దేలి ♦ యాడుచుండి

గీ. క్షమయు సత్యంబు దయయును ♦ సహనము
ముంగలపోఁగులు దాలిచి ♦ పొలుపుమీఱు
వాఁడెపో వైశ్యరత్నంబు ♦ వసుధయందు
సకల కల్యాణగుణధన్య! ♦ సర్వమాన్య! 105

సీ. అవనికి సర్వస ♦ స్యశ్యామలాఖ్య నామంబు
సార్థకంబగునట్లు ♦ శ్రమలకోర్చి
సకలధాన్యంబుల ♦ సర్వశాకంబులఁ
బలుతెఱంగుల నుంచి ♦ పల్లెపల్లె
విరివిగాఁ బండించి ♦ సిరులను గడియించి
నీతిమార్గమునందు ♦ నెగడుచుండి
పరిపూర్ణ కరుణతోఁ ♦ బసులను బోషించి
పాడి సమృద్ధిగాఁ ♦ బడయుచుండి

గీ. అన్నదాతగ నందఱుఁ ♦ దన్నుఁ దలఁచి
దండములు పెట్టునంత యు ♦ ద్దండ భక్తి
శోభఁ బొల్చెడు వాఁడె శూ ♦ ద్రుండనంగ
సకలకల్యాణగుణధన్య! ♦ సర్వమాన్య! 106

సీ. నీతిబాహ్యముగాని ♦ నిర్మలవృత్తిని
నెవరుదాల్చినసేమి ♦ హేయముగునె?
విద్వాంసులును మఱి ♦ విమలవర్తనులగు
విబుధులుచేపట్టు ♦ వృత్తులెల్ల
వికసించు దేశంబు ♦ విద్యానివాస
విరివిగా సిరులచే ♦ విలసిల్లగు
దేశస్థులకునెల్ల ♦ దివ్యతేజంబబ్బు
ఘనము వెలుంగు కీర్తి ♦ భరతఖండాన

గీ. కాని నీభక్తి గలుగక ♦ కలసిమెలసి
యందఱును నొక్కయనుకూల ♦ మైన మార్గ
మందు వర్తించుటెట్లబ్బు? ♦ సహర్షమేయ!
సకలకల్యాణగుణధన్య! ♦ సర్వమాన్య! 107

సీ. కన్నులు చల్లని ♦ కాంతులీనుచునుండఁ
బలుకుల నమృతంబు ♦ లొలుకుచుండ
మనముచే హృదయంబు ♦ కరఁగి పాఱుచునుండ
మోమున శాంతంబు ♦ పొదలుచుండ
హస్తంబు దీనుల ♦ కభయమిచ్చుచునుండ
విజ్ఞానమున బుద్ధి ♦ వెలయుచుండఁ
[illegible]గిలోపలి భక్తి ♦ పొరలివచ్చుచునుండ
దలమీఱిన వినయంబు ♦ గులుకుచుండు
మించి లోకంబులేల నే ♦ తెంచు యోగి
యోగియగుఁగాక తక్కిన ♦ జోగులెల్ల
యోగులౌనొకొ? ఋషిహృద్య ♦ యోగివేద్య!
సకలకల్యాణగుణధన్య! ♦ సర్వమాన్య! 108

సీ. చాతుర్యముగ నీతిఁ ♦ బ్రతిభోఁ దెలిపిన
యఖిలోపయోగి వే ♦ మన్న యోగి
తత్త్వమ్ముకందగ ♦ తములందుఁ జెప్పిన
యాత్మానుభోగి వే ♦ మన్న యోగి
తనజీవితమునందు ♦ త్యాగమ్ముఁ జూపిన
యనుపమత్యాగి వే ♦ మన్న యోగి
తను నందఱిలలోనఁ ♦ గొనియాడఁ జేసిన
మంత్రిపత్రియోగి వే ♦ మన్న యోగి

గీ. దేవ! నీభక్తియనియెడి ♦ నావనెక్కి
సూటిగా భవవార్ధిని ♦ దాఁటినట్టి
యమృతలోకానురాగి వే ♦ మన్న యోగి
సకలకల్యాణగుణధన్య! ♦ సర్వమాన్య! 109

సీ. కోర్కులై సంసార ♦ ఘోరమహారణ్య
మందు నీతేజంబు ♦ నొంది చొచ్చి
నిఖిలమూఢాచార ♦ నిబిడాంధకారమ్ము
సరకుసేయక నీతి ♦ సంచరించి
భవదీయభక్తియన్ ♦ పసనైన వాలునఁ
క్రూరపాపమృగాళిఁ ♦ గూలనడఁచి
సాధుల దీనుల ♦ సంత్రాసములఁ దీర్చి
యాదర్శమూర్తులై ♦ యలరుచుండి

గీ. మఱల నినుఁ జేర వచ్చెడు ♦ మహితమతులు
భూమిలోఁపల నవతార ♦ పురుషులనఁగ
నక్షయంబైన కీర్తిచే ♦ నమరుచుండ్రి
సకలకల్యాణగుణధన్య! ♦ సర్వమాన్య! 110

సీ. లోకరక్షణకళా ♦ లోలుఁడై పొల్చు నీ
కరుణకుఁ గరములు ♦ కరముమోడ్చి
త్రిభువనసామ్రాజ్య ♦ విభుఁడవై యొప్పు నీ
సిరులకుఁ బలుమాఱు ♦ శిరమువంచి
సకలసృష్టిస్థితి ♦ సంహారకారి యౌ
త్వన్మహాశక్తికి ♦ దండము లిడి
ఋషిమునియోగీంద్ర ♦ హృదయస్థితుఁడవై
యలరెడు నీకు జో ♦ హారొనర్చి

గీ. నిఖిలభువనైకదండమై ♦ నిల్చునీదు
మహిమ కెంతయు భక్తి న ♦ మస్కరించి
నన్ను నీభక్తునిగఁ జేయ ♦ విన్నవింతు
సకలకల్యాణ గుణధన్య! ♦ సర్వమాన్య! 111

సీ. ఊషరక్షేత్రమై ♦ యూరక చెడుచుండు
మనమును నందన ♦ వనముఁ జేసి
కఠినకార్యములకుఁ ♦ గడఁగుచుండెడునట్టి
కరముల వరదయా ♦ కరముఁ జేసి
పరుషవాక్యములచేఁ ♦ బతితమౌనాస్త్రింబు
భవ్యవాక్సుధలచే ♦ బాగుఁజేసి
బుద్ధిని భవదీయ ♦ శుద్ధవిజ్ఞానతే
జంబుచే భాసమా ♦ నంబుఁ జేసి

గీ. యఖిలమును నీకు సేవకై ♦ యప్పగించు
విమలమైనట్టి భక్తిని ♦ నమరఁజేసి
నెమ్మి రక్షించుభారమ్ము ♦ నీదిసుమ్ము
సకలకల్యాణ గుణఘన్య! ♦ సర్వమాన్య! 112

సీ. దేశభక్తుల మహా ♦ దివ్యచారిత్రముల్
మించిన వేడ్కఁ జా ♦ లించుదినము
దీనులయాపదల్ ♦ దీర్పంగ ధనమును
హెచ్చినతమని వె ♦ చ్చించుదినము
వివిధవిద్యలయందు ♦ విఖ్యాతులగువారి
నెలమి మీఱఁగ గౌర ♦ వించుదినము
బంధుమిత్రాదుల ♦ బాగు నోగును గని
యెంతయుఁ బ్రీతి మ ♦ న్నించుదినము

గీ. నిన్నుఁ గరుణాస్వరూపుని ♦ నిష్కళంక
భక్తితోఁ గొల్చిపొల్చి సౌ ♦ భాగ్యదినము
దిన మగునుగాక తక్కిన ♦ దినము దినమె
సకలకల్యాణ గుణధన్య! ♦ సర్వమాన్య! 113

సీ. పూనినసత్కార్య ♦ మును బూర్తిసేయఁగా
నపుడుగల్గెడు నట్టి ♦ హర్షమొకటి
మహనీయుఁడొక్కఁడు ♦ మందిరమ్మునుజేరి
నపుడుగల్గెడు నట్టి ♦ హర్షమొకటి
చాలకాలముమీఁద ♦ సఖునిఁజూడఁగ గల్గి
నపుడుగల్గెడు నట్టి ♦ హర్షమొకటి
కలుగక కలుగక ♦ కడకుఁ బుత్త్రుఁడు గల్గ
నపుడుగల్గెడు నట్టి ♦ హర్షమొకటి

గీ. చెప్ప శక్యంబు గాదని ♦ చెప్పుచుందు
గాని నినుఁ గన్నసమయానఁ ♦ గలుగునట్టి
హర్షమున కెద్దిసాటి? స ♦ ద్వర్షి వినుత!
సకలకల్యాణ గుణధన్య! ♦ సర్వమాన్య! 114

సీ. లోకబాంధవుఁడని ♦ లోకమెన్నఁగ దీన
లోకంబుఁగాచు సు ♦ శ్లోకుఁ డగుచు
మిత్త్రిఁ డీతండని ♦ మించుకూరిమితోడ
బుధులుమెచ్చెడు పుణ్య ♦ పురుషుఁడగుచు
శ్రీపీఠికాపురీ ♦ సింహాసనంబను
పూర్వాద్రిఁబొల్చు స ♦ న్మూర్తియగుచు
భవదీయ భక్తి ప్ర ♦ భాభాసమానుఁడై
రాజిల్లు శ్రీసూర్య ♦ రావుప్రభువు

గీ. ఆయురారోగ్యపుత్త్రపౌ ♦ త్రాభివృద్ధి
సకలసంపత్సమృద్ధియు ♦ శాంతిఁ గల్గి
ప్రబలుఁ గావుత నీకృపా ♦ పటిమచేత
సకలకల్యాణ గుణధన్య ! ♦ సర్వమాన్య ! 115

సీ. దంపతు లన్యోన్య ♦ ధర్మముల్ రక్షించి
యురుసుఖాబ్ధిని దేలు ♦ చుందురిగాక
ప్రజలు రాజును పర ♦ స్పరము ప్రేమించుచు
మితిలేని శుభముల ♦ మింతురిగాక
మిత్రులు పరిశుద్ధ ♦ మైత్రిం దో వర్తిల్లి
కలకాలమును గీర్తిఁ ♦ గాంతురిగాక
జనకులు సంతాన ♦ మును బాడిఁ గాపాడి
కులపావనము చేసి ♦ కొందురిగాక
గీ. అందఱును గూడి నిన్ను నా ♦ నందమయుని
భక్తిఁ గొల్చుచు సంతోష ♦ భరితులగుచు
బృథ్వినే స్వర్గభూమి గా ♦ వింతురిగాక
సకల కల్యాణగుణధన్య! ♦ సర్వమాన్య! 116

శ్రీ

లోకపావనశతకము.

ఉత్పలము.

శ్రీరమణీయమూర్తి వయి ♦ శిష్టముముక్షుజనానువర్తివై
చారువిశాలకీర్తి వయి ♦ సర్వమునీంద్ర హృదబ్జవర్తివై
గూరిమి మీఱఁగా భువన ♦ కోటుల నేలెడు చక్రవర్తివై
సారెకు వెల్గుచుండుదువు ♦ సజ్జనజీవన ! లోకపావనా ! 1

ఉత్పలము.

చంపకమాలికల్ మఱియుఁ ♦ జక్కనియుత్పలమాలికల్ గడుఁ
సొంపులు గుల్కనొక్కకృతిఁ ♦ జొక్కపుభక్తిఁ గూర్చి నీకిదే
యింపుగ నప్పగింతుఁ బర ♦ మేశ దయన్ గయికొమ్ము రమ్ము నా
సంపదయెల్ల నీవె కద ♦ సజ్జనజీవన ! లోకపావనా ! 2

ఉత్పలము.

శ్రీకరము న్విచిత్రమగు ♦ సృష్టినొనర్చి చెలంగు నీదు శో
భాకృతి యోగిరాట్తతి స ♦ మంచితరీతి సమాధిఁ జూచి నిర్
నాకధునీప్రవాహముల ♦ నవ్వెదు వాగ్ఘరుల న్నుతించు నీ
శా ! యఖిలోకమూలధన ! ♦ సజ్జనజీవన ! లోకపావనా ! 3

చంపకము.

నిరతము నీవినోదములె ♦ నిర్మలబుద్ధికిఁ దోఁచుచుండుటన్
నిరుపమగీతజాతముల ♦ నీగుణగానముఁ జేయు చాత్మలో
గురియగునిన్నుఁ గాంచిబుధు ♦ కూటముగంతులువైచియాడెడిన్
సరసమనోహరా ! సకల ♦ సజ్జనజీవన ! లోకపావనా ! 4

ఉత్పలము.

ఆశ నిరాశయౌ తతిని ♦ నద్భుతరీతిని నాస గొల్పు స
ర్వేశ ! భవద్విచిత్రముల ♦ నెల్లను జూచి మునీంద్రులందఱా
వేశముచేత నీయశము ♦ వింతగఁ బాడి సుఖించుచుందు రీ
శా ! శరణాగతాభయద ! సజ్జనజీవన ! లోకపావనా ! 5

చంపకము.

తమగలిఁదప్పకుండఁగ న ♦ దాగ్రహ...బులుధూమకేతువుల్
గ్రమముగఁ దోఁచుచుండుటను ♦ గాంచిబుధుల్ గడుఁజోద్య [మందుచున్
బ్రమదము మీఱనీనియమ ♦ పాలినిఁ బాడుచునుందు రిభక్తిలో
శమదమభూషితాత్ములయి ♦ సజ్జనజీవన ! లోకపావనా ! 6

ఉత్పలము.

ఆకసమందుఁ బక్షికుల ♦ మందముగా విహరించునట్లు లీ
లోకచయమ్ము నీకడుపు ♦ లోపల వింతగ సంచరించుచున్
వాకొనుచుండు నీమహిమ ♦ వారక మెచ్చుచు వేయినోళ్లతోఁ
జౌకగఁ జెప్పనౌనె నిను ♦ సజ్జనజీవన ! లోకపావనా ! 7

ఉత్పలము.

చల్లని కీర్తిచంద్రికలఁ ♦ జల్లుచు లోకము లేలు మన్మనో
వల్లభ! నీపరిభావమునఁ ♦ బాపచయంబుల నెల్లద్రుంచి వ
ర్ధిల్లుచు భక్తిభావమున ♦ దివ్యతరస్తుతి పుష్పమంజరుల్
చల్లగనియ్యవే సకల ♦ సజ్జనజీవన! లోకపావనా! 8

ఉత్పలము.

అందఱు స్వేచ్ఛమీఱఁగవి ♦ హారముసల్పుచు నాదనంబుగా
సుందరమైనయాధరను ♦ సూరులు మెచ్చ రచించినావు నీ
యందము చందమిందుఁగని ♦ హర్షసుధాంబుధిఁ దేలిమేమునీ
సౌంద్రియశంబుఁ బాడుటకు ♦ సజ్జనజీవన! లోకపావనా! 9

చంపకము.

అణువునకంటెసూక్ష్ముఁడవె ♦ యంతట నెట్టులునిండినావు? నూ
కనులకుఁగానరావెపలు ♦ కాంతులఁ జిమ్ముచుసూర్యకోటులన్
ఘనమతి! యెట్లుచేసితివి! ♦ గాంచగ నీపనులెల్లవింతలా
సనకసనందనాదినుత ♦ సజ్జనజీవన! లోకపావనా! 10

ఉత్పలము.

చందురుశైత్యమెంతమఱి ♦ సంద్రములోపలి లోఁతదెంతపే
రొందిన గ్రీష్మభానుని స ♦ ముజ్జ్వలభీష్మపరితాప మెంత నీ
యందలి సీతు లోఁతులను ♦ నారసి వేఁడిమి ముందు విస్ఫుర
త్సౌంద్రియశోమహావిభవ! సజ్జనజీవన! లోకపావనా! 11

ఉత్పలము.

నీవొకసారి యోఁ యనిన ♦ నీరధు లెల్లఁగలంగి పారెన్
దావకృశానుఁ డంతయును ♦ దర్పముమీఱ జగంబుఁగాల్చెన్
భూవలయంబు చూర్ణమయి ♦ పోవఁగవీచును జండవాతముల్
స్థావర మెల్ల ఝాపడఁగు ♦ సజ్జనజీవన ! లోకపావనా ! 12

చంపకము.

నను నిటు గట్టిపెట్టితివి ♦ నాబలమెల్లను గ్రుంగిపోయెడిన్
దినములవెన్ని నేనిటులు ♦ దీనుఁడనై పడియుండుఁ జెప్పవే
యని మొఱనీకు బెట్టెడిక్రి♦యన్ గడు ఘోషిలుసంద్రిమెప్పున్
సనియమశక్తిసంభరణ ! ♦ సజ్జనజీవన ! లోకపావనా ! 13

ఉత్పలము.

భూతములన్ వరాశ్వములఁ ♦ బొందికతోనొడఁగూర్చి లోకమున్
ఖ్యాతరథంబు నీవుగడఁ ♦ కన్నడిపింపఁగ మేముహాయిగా
భీతిని మాని నీకృపకు ♦ భృత్యులమై సుఖమున్నవారమీ
శా ! త్రిజగన్నుతైకయశ ! ♦ సజ్జనజీవన ! లోకపావనా ! 14

ఉత్పలము

పిల్లలుమేము నీకృపను ♦ బెల్లుగ నాటల నాఁడు కొంటకై
యెల్ల పదార్థము ల్గలుగు ♦ నిల్లుగ భూమినలంకరించి మా
యుల్లము సల్లవించున్నటు లొప్పగ వింతలఁజూపుచుందువా
సల్లలితప్రశస్తగుణ ! సజ్జన[illegible] ! లోకపావనా ! 15

ఉత్పలము.

బాలురమయ్య మేము నఘ ♦ పాతము సెప్పఁగుమండపేప్రసీ
పాలితమైనలోక మిది ♦ భవ్యతరం బగు పాఠశాల వే
యేలభవత్ప్రబోధమున ♦ నిష్టచరిత్రుల మౌదు మయ్య యీ
శా! లలితప్రభాకలిత! ♦ సజ్జనజీవన! లోకపావనా! 16

ఉత్పలము.

ఎల్లఱ నీవు గర్భమున ♦ నెల్లపుడున్ వహియించియుంటివే
గొల్లగ భోజ్యవస్తువులఁ ♦ గూరిమి నొందగూర్చుచుంటివే
బెల్లుగ నీకృప న్బ్రదివి ♦ కీడని గోపికఁ బెంచుచుంటివే
జల్లని తల్లివే కద! ♦ సజ్జనజీవన! లోకపావనా! 17

ఉత్పలము.

అందఱు మమ్ము విడిచను ♦ నప్పుడు మావెనువెంటనుండి మా
డెందములోని కుంకులను ♦ డిందగఁ జేసి కడింది ప్రేమతో
ముందును వెన్కఁ దోడగుచు ♦ మోదముఁ గూర్చెడుమిత్రుఁడీవెగా
చందనశీతలా! విమల! ♦ సజ్జనజీవన! లోకపావనా! 18

చంపకము.

అకలుష! భక్తవత్సల! ద ♦ యామయ! నీవు భవాబ్ధిపోతమై
ప్రకటజగత్త్రయంబునకు ♦ బంధువువై పరమోపకారివై
త్రికరణశుద్ధిగాఁ గొలుచు ♦ ధీరులకుం గడుదోడునీడవై
సకలమున న్పాలింగెదవు ♦ సజ్జనజీవన! లోకపావనా! 19

ఉత్పలము.

సర్వమునీదయంగలుగు ♦ సంగతిభస్త్రంజెలుగుఁ గానఁదా
గర్వము మాని సర్వమును ♦ గాన్కగనీకునొసంగియాత్మలోఁ
బర్వినవేడ్కనుత్సవముఁ ♦ బాయకసల్పుచునుండునిత్యముక్
సర్వసుభప్రదా! సకల సజ్జనజీవన! లోకపావనా! 20

ఉత్పలము.

సంతత మంత రంగమున ♦ సత్యపథంబుజనాళిచూపుచుక్
వింతగనంతయుం దెలిసి ♦ వేయివిధంబులఁ బ్రీతిఁబ్రోచుచుక్
బాగ్యముతో [illegible] ♦ బ్రగ్గుమాని మునం జెప్పుచుక్
సంతస మొందు జేర్చెదవు ♦ సజ్జన జీవన! లోకపావనా! 21

ఉత్పలము.

సత్యముసీస్వరూపమని ♦ సత్యాతములోఁ దలఁపోసినిత్యముక్
సత్యవచో విహారముల ♦ సర్వముఁనర్పణసేయునట్టియా
సత్యప్రతాపశీలుర ప్రి ♦ శాంతమనస్కులసత్యకీర్తికిక్
సత్యము నీవె కారణము ♦ సజ్జన జీవన! లోకపావనా! 22

చంపకము.

సతతము లొక్కటంబులకి ♦ దూఁకగనొచినయప్పుడాత్మలోఁ
బరువముఁగాని యుస్మరిసి ♦ బారగఁ ద్రోచెమశక్తిసీమసం
స్మరణముచేతఁ గల్గునిది ♦ సత్యము సత్యము సత్యమంచునిక్
స్మరణముచేసి చెప్పఁగల ♦ సజ్జనజీవన! లోకపావనా! 23

చంపకము.

పరమకృపాళువౌ కతన ♦ శాపదవాగ్ని [illegible] వారిజా
గర మనురక్తి నెత్తికడ ♦ [illegible] ముత [illegible] మూ[illegible]
బఱపి ప్రశాంతచిత్తులఁ ♦ భా[illegible]
శరణమె శాంతికారణము ♦ [illegible] పావనా! 24

చంపకము.

దురిత దవాగ్ని దూలకొను ♦ [illegible]
దరిగనరాక కుందితివి ♦ దర్పము[illegible]
గురిసి భవత్కృపామృతము ♦ [illegible]
శరణము [illegible]చ్చితి [illegible] వినుము ♦ [illegible] పావనా! 25

చంపకము.

మనసును [illegible]చ్చి చూచెదప్రు ♦ నూటలచే [illegible] నపు[illegible]
ననువగు [illegible] రాత్పర! స ♦ మంచితచా[illegible]నా
మనసునువిప్పిచూపెదను ♦ మానక న[illegible]తా[illegible] జేయవే
చనవున నిన్ను చేరితిని ♦ స[illegible]! లోకపావనా! 26

ఉత్పలము.

మీఱితి నీకు [illegible]లను ♦ మేలును గీడును నెంచకెంతయుఁ
జాఱితిఁ బాపకూపమున ♦ జన్మము దుఃఖము పాలుసేసితిఁ
[illegible]రితిఁ గావ్రు కావుమని ♦ చేతులు మోడ్చితి దీనుఁ[illegible] వే
సారితి నింక నీవెగతి ♦ సజ్జనావన! లోకపావనా! 27

చంపకము.

అతుల విచిత్ర లోకముల ♦ నద్భుతరీతి సృజించి ప్రోచు నీ
ప్రతిభకు నన్నుఁ గాంచు లోక ♦ భారమె యో కరుణాసుధానిధీ !
మతి నిను నెంచినంతటనె ♦ మాని వెతల్, సుఖియించు నెంతయున్
సతతము నీవె నాకు గతి ♦ సజ్జనజీవన ! లోకపావనా ! 28

ఉత్పలము.

చింతలు పైఁబడన్ బొదివి ♦ చెచ్చెరఁ గీలలఁ బోలె నంటినన్
బంతము శోకరుజావళులు ♦ పట్టిపొరింబొరి బెట్టుఁ దాఁకినన్
వింతఁగ శాంతమై మఱలు ♦ విశ్వవిభుండగు నిన్ స్మరించినన్
శాంతినికేతనా ! సకల ♦ సజ్జనజీవన ! లోకపావనా ! 29

ఉత్పలము.

ఘోరవిపత్సముద్రమునఁ ♦ గూలినవారికి నీకటాక్షమే
పారముఁ జేర్చునావ కద ♦ భక్తచకోరక పాళికిన్ సదా
పారణపూర్ణచంద్రికయుఁ ♦ బాపవిమోచనధారయుం గదా
చారుకృపాసుధాసదన ! ♦ సజ్జనజీవన ! లోకపావనా ! 30

ఉత్పలము.

భూతలమందుఁ బ్రాణులను ♦ భూరివిపద్దశ నొందఁ జేయుచున్
ఘాతుకులై మెలంగు నప ♦ కారవిహారుల నీతిదూరులన్
బ్రీతిగ శిక్షసేయు నెడ ♦ భవ్యతరంబగు నీకటాక్షమే
శాతకృపాణమై తనరు ♦ సజ్జనజీవన ! లోకపావనా ! 31

చంపకము.

నిరతమునీదయామృతము ♦ నిండిజగంబునఁబర్వుచుండియున్
దురితమునన్ బ్రవర్తులగు ♦ దుష్టుల బుద్ధికిగోచరించు నే?
మఱిమఱిఁబైపయిన్ గవియు♦ మంటగఁదాఁగినపించుఁగాకయీ
శ్వర! సుఖపూర! పాపహర! ♦ సజ్జనజీవన! లోకపావనా! 32

ఉత్పలము.

సారెకుఁబాపపంకమున ♦ జారెడుమూర్ఖులమమ్ము నెత్తుచున్
దీరనిప్రేమతోఁ దుడిచి ♦ దిద్దుచునుందువు, కొంచమైన వే
సారవు, నీకుమాగుణము ♦ సన్నుతిసేయఁగ మాకు శక్యమే
చారుకృపామహాభరణ! ♦ సజ్జనజీవన! లోకపావనా! 33

ఉత్పలము.

నీకరుణావలోకనము ♦ నిల్చియ దెవ్వనిమీఁదఁ బొల్చునో
లోకము లెల్ల నాతనికి ♦ లొగ్గి నమస్కృతి సేయు, నాతఁడు
స్తోకమనీషతో వెలుఁగు, ♦ దోఁగుచునుండుసుఖాబ్ధిలోన, నీ
శా! కరుణానివేశయశ! ♦ సజ్జనజీవన! లోకపావనా! 34

చంపకము,

దయహృదయాంబరస్థలిని ♦ దద్దయుబూర్ణసుధాంశుమించెడు
న్దయహృదయాంబుజాతమునఁ♦ దన్మకరందముగాస్రవించెడున్
దయహృదయాద్రిసంజనిత ♦ధన్యతమామృతవృష్టియైచనున్
స్వయమది నీగుణంబగుట ♦ సజ్జనజీవన! లోకపావనా! 35

ఉత్పలము.

శిష్టులసద్గుణంబు లనెడు ♦ చెన్ను పసిండి మెఱుంగు దేరఁగాఁ
గిష్టము వెట్టి రాచెదవు ♦ కానఁగ లేరుగ నీప్రభావముల్
నష్టమతుల్ గ్రహించమున ♦ నాథ! భవత్కరుణావిశేషముల్
స్పష్టముతోను సాధులకె ♦ సజ్జనజీవన! లోకపావనా! 36

చంపకము.

తరిచినకొద్ది వెన్న దగుఁ ♦ దగ్గను గాని జగంబులో నిసుక్
దరచినకొద్ది సిరిగంధ ♦ మెడయు నటులి కానుపించు, నిన్
దలఁపగనివాని నెవ్వఁడు న ♦ దామదిఁ గొల్చునో, వాఁడె ధన్యుఁడై
సరిగున ముక్తిఁ జూఱఁగొను ♦ సజ్జనజీవన! లోకపావనా! 37

ఉత్పలము:

సృష్టిని జూచి, నీమహిమ ♦ చిత్తములోఁ దలపోసిపోసి, నీ
కిష్టము లేనివానికిడ ♦ కింతయుఁ బోవక ద్రోసిద్రోసి, యే
కష్టము వచ్చినన్ విడక ♦ గ్రక్కున నీపని చేసి చేసి, నిన్
స్పష్టముగాఁ గనంగ నగు ♦ సజ్జనజీవన! లోకపావనా! 38

చంపకము.

వదలక నీవు సర్వమున ♦ వ్యాపకుఁడై విలసిల్లినావు; నీ
యుదరమునందు సర్వమును ♦ హోత్తమరీతి వసించుచున్న స
మ్ముదమున భక్తబృందమును ♦ బూతచరిత్రు నిబూజ్యునిన్ను హృ
త్సదనములందె చూచెదరు ♦ సజ్జనజీవన! లోకపావనా! 39

ఉత్పలము.

చిత్రవిచిత్రయంత్రములఁ ♦ స్థలనానాఘ దేహ యంత్రముల్
బుత్త్రిలమున్ మనూనుఁబరి ♦ పూర్ణదయన్ దయచేసినావు; సు
చిత్రము లెల్లఁ జూపినను ♦ జిత్తములోఁగనిపోఁగకొల్ప, నీ
శా! త్రిజగత్ప్రకాశయశ! ♦ సజ్జనజీవన! లోకపావనా! 40

చంపకము.

రవికిసిఙ్గుత్తఖామియును ♦ రమ్యముగా గనిచుక్కఁ జాగుత్రిముల్
భువి తనచుక్కఁదాఁ దిరిగి ♦ పోలుగ నస్స్య మానసానసరా
లవనిని గల్గఁజేయును ను ♦ సుస్ఫురితత్రిలోకసంభాసన
స్త్రవమొనరించుచున్ సతము ♦ సజ్జనజీవన! లోకపావనా! 41

ఉత్పలము.

పింతగ భూవిమానమున ♦ విగ్రహిపికా! నుమముమానిరంతరపై
నెంతయు జేర్చఁదిప్పెదవ ♦ యేమివిచిత్రమొ? నీప్రవృత్తిగా
కీర్తియుఁగాన రాదహహా! ♦ యొప్పఁదనర వైభవత్ప్రభావముల్
సంతతసౌఖ్యహేతువులు ♦ సజ్జనజీవన! లోకపావనా! 42

ఉత్పలము.

ఆకసమున్ బట్టబునము ♦ హస్తభృతకేత్ని ను హెంద్రి చాపముల్
శ్రీకమనీయవర్ణములఁ ♦ జిత్రతరంబుగ నెవ్వపాటగా
నే కలిగించి చూపెదవ ♦ వెంతవిచిత్రపు వ్రాతకాఁడ వీ
శా! కమనీయశుభ్రయశ! ♦ సజ్జనజీవన! లోకపావనా! 43

చంపకము.

రవి దివి వచ్చి పోవ్రతఱి ♦ రాజిలు చిత్రపటంబులోయనన్
బ్రవిమలకాంతులీనెడు ప్ర♦భాతరుచుల్ మఱిసాంధ్యరాగముల్
దవిలి నభోంగనామణి స ♦ దానినుఁగూర్చి రచించి వ్రాయుసం
స్తవకవితాప్రభావములు ♦ సజ్జనజీవన ! లోకపావనా ! 44

ఉత్పలము.

వారిధిలోని నీరము ♦ బాష్పవిధంబుఁ బీల్చి దానినే
వారక వారిదాకృతిగ ♦ నద్రిలఁ జేసి సువృష్టి భూములం
జారుతరంబుగాఁ గురుపు ♦ చక్కనియంత్రము భాస్కరుండునిన్
సారెకుఁ జాటుచుండెడిని ♦ సజ్జనజీవన ! లోకపావనా ! 45

ఉత్పలము

చీఁకటిఁ జిమ్మునీ వడరి ♦ జెంగు ఫిరంగి గడంగి కాల్చునన్
బ్రాకటమైన తెల్లపొగ ♦ పర్వెననంగను బూర్వదిక్కునన్
వేఁకువఁ దెల్లవాఱు రవి ♦ బింబము వచ్చును గుండుభాతి నీ
శా! కమనీయభూరియశ ! ♦ సజ్జనజీవన ! లోకపావనా! 46

ఉత్పలము.

తెండని,మీఁదఁ జేవయిది ♦ [illegible]లగెఁ జూచెనుమూర్ఛఁ దోఁచఁగా
నాఁడజముల్ రొద ల్పలుపు, ♦ [illegible]
త్రాఁడు[illegible] ♦ [illegible]
చండశరప్రభాపముః ♦ సజ్జనజీవన! లోకపావనా! 47

సాపకము

ఉదయమునందు లేచి [illegible] ♦ [illegible]
హృదయము[illegible] ♦ నెంతయు [illegible]
మదముఖదుర్గుణావళులు ♦ [illegible]
సదమలశాసనా! సకల ♦ సజ్జనజీవన! లోకపావనా! 48

ఉత్పలము.

పెల్లుగ వెల్గువేవెలుఁగు ♦ వేఁడిమి [illegible]
జల్లగఁ బైపయిఁ సుధలఁ ♦ జల్లుచు పున్నమనాఁటి [illegible]
బిల్లి స్పృశించి [illegible] ♦ పేర్మికు సూచనఁ జూపి [illegible]
చల్లఁదనం బదెంతటిదో? ♦ సజ్జనజీవన! లోకపావనా! 49

ఉత్పలము.

జల్లునఁ [illegible]సిఁపయినఁ ♦ జల్లిన [illegible]లో! నిజమోత్సవా
వెల్లడఁజాటుదీపములో? ♦ యీశ్వర! నీదు విలోకనంబులో?
కొల్లఁగమింటఁజుక్కలనఁ ♦ గోట్లకొలంది వెలుంగులోకముల్
సల్లలితప్రభావిభవ! ♦ సజ్జనజీవన! లోకపావనా! 50

ఉత్పలము.

సూర్యుడునీకుముందు నెఱ ♦ సున్న ప్రతాపమునందు జంద్రుఁడో
స్థైర్యముఁ బూని చెప్పుటకుఁ ♦ జాలఁడు దానర సున్నసున్న మో
వీర్యయశంబులందు. నర ♦ విందము బిందులఁదెల్పుఁ జెల్వలో
శౌర్యముఁ జూఁపజాల నని ♦ సజ్జనజీవన! లోకపావనా! 51

ఉత్పలము.

ధారుణిమీఁద భాస్కరుఁడు ♦ దారుణరశ్ములు వేలుచిమ్మినన్
గూరుచు శాంతిమేఘములు ♦ గూరిమిఁగోట్లకొలంది చిన్కులన్
సారెకు నీప్రభావమున ♦ సర్వదయాపర! భక్తకింకరా!
చారుపవిత్రసచ్చరిత! ♦ సజ్జనజీవన! లోకపావనా! 52

చంపకము.

ఖరకరుఁడెంత తీక్ష్ణముగఁ ♦ గిన్నులకున్ మిణుమిట్లు గొల్పినన్
శిరమునుకింత యెత్తకడుఁ ♦ జెన్నగు పచ్చని యాకు జొంపమున్
సరగునఁజూడ నేత్రములు ♦ శాంతి సుధాంబుధినోలలాడు నే
శరణము చొచ్చువారివలె ♦ సజ్జనజీవన! లోకపావనా! 53

ఉత్పలము.

నీదగుసృష్టి చిత్రముల ♦ నెమ్మిగనందగు చారుసౌధముల్
ఖేదముమాపుగంధవహు ♦ క్రీడకుఁ జాలిన రమ్యరంగముల్
మోదముగూర్చువాహినుల ♦ మూలపదంబులు భూరిశైలముల్
సాదరముల్ భవత్కృతులు ♦ సజ్జనజీవన! లోకపావనా! 54

ఉత్పలము.

భూమికి సారముల్ గొలిపి ♦ పూతకనీనులఁ జేసి స్వాతులన్
బ్రేమను లక్షకోటులకుఁ ♦ బెల్లుగ జీవనమిచ్చి నిర్దయా
స్తోమముగల్ల వెల్వరిసి ♦ సోయగఁగూర్చెదవు సమ్మహానకుల
స్వామి! భవద్యశోలతలు ♦ సజ్జనజీవన! లోకపావనా! 55

చంపకము.

తగువిగతావరోధమునఁ ♦ దద్దయు స్వేచ్ఛ నెలాగుఁ గాంచరన్
మృగములు పక్షులున్ మరిన ♦ రీసృపముల్ ఫలపుష్పవృక్షముల్
సొగసుగఁజాటు నీప్రభలు ♦ సుందరబంధురవహా మహాటవిన్
స్వగతస్వతంత్రసౌఖ్యమున ♦ సజ్జనజీవన! లోకపావనా! 56

ఉత్పలము.

ఇమ్ముగ లేఁజిగుర్ల్మెసవి ♦ యింపుగఁగూసెడు కోకిలావళుల్
ప్రిమ్మిన ప్రేమఁబల్లదిని ♦ పల్కులమూలలు చిల్కచిల్కలున్
గమ్మనితేనెనానుచు సు ♦ కమ్ముగఁజుమ్మని పాడుతుమ్మెదల్
సమ్మతితో నినున్ బొగడు ♦ సజ్జనజీవన! లోకపావనా! 57

ఉత్పలము.

తీయని తేనె నానుటకుఁ ♦ దేంట్లకుఁ బూలకొసంగ, కోకిలల్
మేయఁగఁ లేఁజిగుళ్ళిడి, ♦ మించుతమిన్ దిన దోరగాయలన్
బాయని ప్రేమఁజిల్కలకుఁ, ♦ బండ్లనుమాకొదవించి, మావినీ
చాయ నొకింత చూపెడిని ♦ సజ్జనజీవన! లోకపావనా! 58

చంపకము.

పనసకుఁబూలు లేవు; మఱి పండులు మల్లెకు లేవు, క్రోటనుల్
ననలనుఁబండ్లనీవు;కరు ♦ ణామయ! మామిడిపూల బండ్లతోఁ
తనరుచునుండుఁజోద్యము గ ♦ దా! భవదీయవిచిత్రసృష్టియే
జనుఁడునుతింపఁగాఁగలఁడు? ♦ సజ్జనజీవన! లోకపావనా! 59

చంపకము

అలగులు పండ్లు క్రోటనుల ♦ యందుదయింపనిలోటుఁ బాపఁగా
విలసదనంతవర్ణముల ♦ వెల్గెడు నాకులు వానియందు సం
కలితము చేసి చిత్రముగఁ ♦ గన్నుల విందొనరించినావు; నీ
సలలితసృష్టి వింత గద! ♦ సజ్జనజీవన! లోకపావనా! 60

చంపకము

ఋతువునకొక్క పూవెతన ♦ యింపునుసొంపునుజూపుచుండఁగా
సతతమునొక్క తీరునవ ♦ సంతము సేయు గులాబి,గావునన్
బ్రతికవి దీనిఁబుష్పలకు ♦ రాణిగఁ జెప్పుచు నీయశంబు నే
సతమును జాటుచుండెడిని ♦ సజ్జనజీవన! లోకపావనా! 61

ఉత్పలము.

మెత్తనిచిత్తముం గలిగి ♦ మేల్మికరందముఁబోలు భోజనం
బుత్తమయాచకాళికిడి ♦ యూర్జితమౌ ఘనకీర్తిసౌరభం
బొత్తుగ దిక్కులన్నెఱపు ♦ యోగ్యుఁడెనీదగుభక్తుఁడంచుఁ దా
సత్తెమె చాటుఁబుష్పమిల ♦ సజ్జనజీవన! లోకపావనా! 62

ఉత్పలము.

మల్లెలు నీవిలాసమును ♦ మాటికిఁజాటుటు చేతనేకదా
చల్లగఁగంటికగ్గుకొని ♦ చానలు వేనలి వ నిఁదాల్చుటల్
మల్లెలె గావవేవయిన ♦ మన్ననఁ జెందు నె నిన్ను వీడి? భా
స్వల్లలితప్రభావిసర! ♦ సజ్జనజీవన! లోకపావనా! 63

ఉత్పలము.

నీవిధి దాఁటువారలకు ♦ నేరుపుమీఱ ననేకరోగముల్
నీవుసృజించియుంచు మఱల ♦ నీదగుకూరిమిఁ బేర్చి తోడ నా
నావిధులౌ బ్రతిక్రియలు ♦ నాథ! మహౌషధులందుఁగూర్చితౌ
స్థావరసత్కృపాభరణ! ♦ సజ్జనజీవన! లోకపావనా! 64

చంపకము.

పఱచెడువానిపైఁ బడక ♦ పట్టుకుఁజిక్కని వానిఁ గోలికిన్
బఱవక క్షుత్తు లేని తఱి ♦ వన్యమృగంబుల జాడఁ బోక భీ
కరత గభీరతన్ గలిగి ♦ కాననసీమల నేలుచుండు కే
సరిని సృజించినావు గద ♦ సజ్జనజీవన! లోకపావనా! 65

చంపకము.

తమతమజట్టు వీడని వి ♦ ధంబునజంతులనాజ్ఞఁ బెట్టగా
సమదమృగోత్కరంబులను ♦ సంసృతిలో సృజియించినావు నీ
క్రమమును దప్పువాని కిల ♦ గట్టిగముప్పు ఘటిల్లితీరెడున్
సమధిక దుష్టనిగ్రహణ! ♦ సజ్జనజీవన! లోకపావనా! 66

ఉత్పలము.

కాకము కావుకావుమని ♦ కర్ణకఠోరముగాఁగఁ గూసినన్
వేఁకువదెల్పదే? మఱియు ♦ వేయివిధంబులఁ దన్ను దెప్పినా
కోకిలఁ జెంపదే భువిని? ♦ గుందులకున్ సుగుణాళిఁగూర్చియీ
శా! కృపఁజూపినావుగద ♦ సజ్జనజీవన! లోకపావనా! 67

చంపకము.

అతులిత శేముషీగరిమ ♦ నద్భుతమై తనరార గూడునం
చితగతిఁ గట్టుచుండుటను ♦ శిల్పిగణంబులు భూమిలోపలన్
బతఁగుల శిల్పిరాజనుచు ♦ బంగరుపిచ్చుకఁ బిల్చు టెల్ల నీ
చతురతచేతఁగ లెగద ♦ సజ్జనజీవన! లోకపావనా! 68

ఉత్పలము.

పక్షము లెప్పుడున్ మెఱుఁగు ♦ ఛాయనిరీతిని రాచిపుల్వ్వకోన్
బక్షికిఁ బుచ్చకోశమున ♦ భవ్యతరంబుగ మంచితైలమున్
రక్షణచేసి దువ్వెనగ ♦ రాజిలు ముక్కును నీమకూర్మికిన్
సాక్షిగనిచ్చినావుగద ♦ సజ్జనజీవన! లోకపావనా! 69

ఉత్పలము.

పాపముచేత బుద్ధి చెడి ♦ పావన! నీపాదఁజూడ నోడు నా
పాపినిబోల్పి చెప్పుటకు ♦ భానునిఁజూడఁగ నోడు గూబలన్
జూపితి వౌర లోకమున ♦ శుభ్రియశోవిభవాభిరాము! సం
స్థాపితసర్వధర్మపథ! ♦ సజ్జనజీవన! లోకపావనా! 70

ఉత్పలము.

పీలిచి ప్రాణవాయువును ♦ బెల్లుగ మే మిడు దుష్టవాతముల్
గ్రోలుచు మంచిగాలి నొడ ♦ గూర్చుచునుం డెడు వృక్షజాలముల్
చాల సృజించి నీమహిమఁ ♦ జాటితివౌర! జగంబులోపలన్
జాలు నెవండు నిన్బొగడ ♦ సజ్జనజీవన! లోకపావనా! 71

ఉత్పలము.

అన్నిటికంటె ముఖ్యముగ ♦ నాదరువై తనరారి యందరన్
గ్రన్ననఁ గాచుచుండునది ♦ గాలిగదా యనిదాని నెల్లెడన్
బన్నులు రాజు లెవ్వరును ♦ బన్ననిరీతిని నించినావు నిన్
సన్నుతి సేయఁగాఁ దరమె? ♦ సజ్జనజీవన! లోకపావనా! 72

ఉత్పలము.

ఘాటిగఁ బ్రాణికోటులిల ♦ దాహముదీర్చుకొనంగ బ్రావునా
నీటిని దేటఁ జేయుటకు ♦ నేరుపుమీఱఁగ మీనయంత్రముల్
కోటులకొద్దిఁ జేసితివి ♦ కూరిమిలోపల నీకు నెవ్వరున్
సాటియె విశ్వసంభరణ! ♦ సజ్జనజీవన! లోకపావనా! 73

చంపకము.

పసిఁడిని జేయఁగానరులు ♦ భస్మములున్ రసముల్ ఘటించినన్
బసిడికిఁగాక పెక్కుపని ♦ పాటలకున్ ఫలకారియౌచు నీ
యసమకృపావిలాసముల ♦ నంతటఁ జాలెను లోకమందు నీ
జసమె వెలుంగుచుఁగా సకల ♦ సజ్జనజీవన! లోకపావనా! 74

ఉత్పలము.

పిల్లలు దొర్లుచు న్బడుచుఁ ♦ బెల్లుగ నాడుదురంచు వారిలోఁ
బల్లవకోమలంబు లన ♦ పాయముగా నెముకల్ ఘటించియో
వల్లభ ! యెల్లరుం దెలియ ♦ వైఖరిఁ జక్కఁగఁ జాటితౌర! నీ
సల్లలితార్ద్రచిత్తమును ♦ సజ్జనజీవన ! లోకపావనా ! 75

ఉత్పలము.

వెన్నునఁ గాలుమోపి కరి ♦ వెళ్ళినవెంటనె యొంతొ వింతగాఁ
దిన్నగఁ జీమ దెప్పిరిలి ♦ తేకువఁ దెన్నునుబట్టి పోయెడున్
బిన్నల నెల్ల నెంతయును ♦ బ్రేమ భరింతువు చిత్రరీతినిన్
సన్నుతిసేయ శక్తులమె? ♦ సజ్జనజీవన ! లోకపావనా ! 76

ఉత్పలము.

వేసవిలోన గొఱ్ఱెలకు ♦ వేసటఁ బాపఁగఁ దీయు నున్నియే
వాసిగ శీతకాలమునఁ ♦ బాపును మాచలి నిట్టు లిర్వురున్
గాసికిఁ దప్పుమార్గమును ♦ గల్గఁగఁ జేసితి వౌర ! నీకృపా
శాసన మెన్న మాతరమె? ♦ సజ్జనజీవన ! లోకపావనా ! 77

చంపకము.

రవికిఁ బ్రదక్షిణంబుగను ♦ రమ్యముగా భువినీవుద్రిప్పుటన్
బ్రవిమల సౌఖ్యసంపదలు ♦ ధన్యతరంబుగ మాకుఁ గూర్పఁగా
వివిధఋతుల్ క్రమానుగతి ♦ వింతగఁ గల్గుచునుండు నీకృపన్
స్తవమొనరింపఁగా వశమె? ♦ సజ్జనజీవన! లోకపావనా! 78

చంపకము.

చిగురులచీరఁ గట్టి మఱి ♦ చెన్నలరారెడునట్టి పువ్వులన్
నగలుగఁ దాల్చి భృంగముల ♦ నాదముతోఁ బికకూజితంబులన్
సొగసుగఁ గూర్చి స్వామినిను ♦ సొంపుగఁ బాడి వసంతలక్ష్మి దా
స్వాగతసుఖంబుఁ జాటుఁగద! ♦ సజ్జనజీవన! లోకపావనా! 79

చంపకము.

చనిచని యంతుగానని ర ♦ సాతల మంటిన నీటి నూటిగాఁ
దనకిరణాళి గ్రీష్మరవి ♦ తద్దయుఁ బీల్చుటచేతనే కదా
ఘనముగ నెల్లనాళ్ళముఁ ♦ గాంచి జలంబు తరుల్ చిగుర్చుటల్
జను లరుదంది నిన్బొగడ ♦ సజ్జనజీవన! లోకపావనా! 80

చంపకము.

మెఱుము మనునిప్పుసోఁకఁగనె ♦ మేఘశతఘ్ని భయంకరంబుగా
నుఱుముచునుగాని జల్లుమని ♦ యుత్తమశీతలసౌఖ్యవృష్టియే
గురియునుగాదె నీకరుణఁ గూర్మి నెవ్వరు నీసమల్ దయా
శరధివి నీవెగా సకల ♦ సజ్జనజీవన! లోకపావనా! 81

ఉత్పలము.

పున్నమనాఁటిచంద్రుఁ డను ♦ పూర్ణసుధాకలశంబు చేతిలోఁ
గ్రిస్మసునఁ దా నరత్నముల ♦ గైకొని నీకభిషేక మింపుగా
మన్ననతోఁడ జేసెనిశి ♦ మాటికి భక్తులు సంతసిల్లఁగా,
సన్నుతసత్యశ్రీవిభవ ! ♦ సజ్జనజీవన ! లోకపావనా ! 82

ఉత్పలము.

సుందరశిల్పకల్పము వ ♦ సుంధర గావున దీనియందమున్
గుందఁగనీయరా దనుచుఁ ♦ గూరిమి నీవొడగూర్చికప్పుమే
లొందిన జిలుగుసెసఁగ ♦ నొప్పు హిమంబు హిమర్తువందునీ
చందము లెన్నఁ జిత్రములు; ♦ సజ్జనజీవన ! లోకపావనా! 83

ఉత్పలము.

లేమిని మమ్ము నీడకుము ♦ లేదనఁబోకుము మాకు దిక్కునీ
వే మహనీయయంచు నిను ♦ నెంతయు వేఁడెదునగ్నశాఖలం
దామనియందుఁ బూర్ణకృప ♦ నాకులఁబూల నలంకరింతువో;
స్వామివిగావె యన్నిఁటికి? ♦ సజ్జనజీవన ! లోకపావనా ! 84

ఉత్పలము.

నిర్వచనీయశక్తియుత ! ♦ నేర్పున గొంగళిపుర్వు నందమై
పర్వెడుఱెక్కలం గలిగి ♦ భాసిలు సుందరకీటకంబుగా
నుర్విని మార్చు నీప్రతిభ ♦ యొక్కటిచాలదె నిన్నుఁ జాటఁగా
సర్వశుభప్రదా ! సకల ♦ సజ్జనజీవన! లోకపావనా ! 85

ఉత్పలము.

పీలిచి పిప్పిచేసినను ♦ బెల్లుగ ముక్కలుగాఁగఁ గోసినన్
గూలిచి శీర్షమున్నఱకి ♦ కూర్మిరతి గానుగఁ బెట్టి త్రిప్పినన్
జీలిచివేసినన్ మధుర ♦ శీలమె చూపుము భక్తి జాటఁగాఁ
జాలదెపో భువిం జెఱకు ♦ సజ్జనజీవన! లోకపావనా! 86

ఉత్పలము.

చిన్నదినూఁపుగిం జయినఁ ♦ జేయఁగఁజాలము సర్వలోకముల్
చెన్నుగఁ జేయుచుండునినుఁ ♦ జింతనసేయము కండ్రక్రొవ్వునన్
మిన్నును మన్నుఁగానము షు ♦ మించెదొమమ్ముదలించిదిద్దెదో
సన్నుతసత్కృపాభవన ♦ సజ్జనజీవన! లోకపావనా! 87

ఉత్పలము.

అర్థములేనివస్తు వొక ♦ టైనను గల్గునె నీదుసృష్టిలో?
వ్యర్థులుగామె మేము పర ♦ మార్థమునన్బనిసేయకుండినన్?
స్వార్థములేని కేవలప ♦ రార్థపరుండవు నీవు గావునన్
సార్థులఁజేయు మయ్య మము ♦ సజ్జనజీవన! లోకపావనా!

ఉత్పలము.

పచ్చిక మెత్తపానుపుగఁ, ♦ బండ్లను దియ్యనివిందుగా సదా
యచ్ఛపునీరె పానముగ, ♦ హాయిగ సోఁకెడు చల్లగాలియే
విచ్చలు వీచు వీవనఁగ, నెమ్మది నెంచుచు నిన్నుఁ గొల్చునా
సచ్చరితుండె ధన్యుఁడుగ ♦ సజ్జనజీవన! లోకపావనా! 89

చంపకము.

కలకలలాడుచంద్రుఁగని, ♦ కాకలఁజిమ్మెడుసూర్యుఁగాంచి, వే
జలజలఁ బారునేఱులను ♦ జల్లఁగ వీచెడు గాలిఁ జూచి, భూ
వలయమునందుఁ బండు పలు ♦ పంటలఁగన్గొని నీకుదండమున్
సలుపనివాఁడు మానవుఁడె? ♦ సజ్జనజీవన ! లోకపావనా! 90

ఉత్పలము.

కోరినవెల్ల నీయవని ♦ కొందఱు దూషణసేయుచుందురిన్
గోరినవెల్ల నీవిడినఁ ♦ గూళలమై భువినెల్లఁ గూల్పమే?
కూరిమి నిడ్డవెన్నుఁటినో ♦ కుత్సితమార్గములందుఁ గాల్పమే?
సారథివై మము న్నడపు ♦ సజ్జనజీవన ! లోకపావనా ! 91

చంపకము.

వరద ! యసంఖ్యహస్తముల ♦ వారక యిత్తువు నీవు కోరికల్
కరముల రెంటనే నెటులు ♦ గైకొనఁజాలుదునయ్య నీకృపన్
గరములుమోడ్చి నీకిడెద ♦ గౌరవసూచకమౌ నమస్కృతిన్
సరవిఁ బరిగ్రహింపు మిదె ♦ సజ్జనజీవన ! లోకపావనా! 92

చంపకము,

గిరగిర సర్వలోకములఁ ♦ గేలిగఁ ద్రిప్పెడు నీదుశక్తికిన్
బోరిఁబోరి దుష్టులం బొడివి ♦ బుద్ధిని నేర్పెడు నీదుయుక్తికిన్
మరిమరి భక్తులన్ననుచు ♦ మానితమైన త్వదీయరక్తికిన్
శరణముజొచ్చి మ్రొక్కెదని ♦ సజ్జనజీవన! లోకపావనా! 93

చంపకము.

హృదయసభాస్థలిన్ బరమ ♦ హృద్యముగాఁ బనరారుభక్తియన్
సదమలభద్రపీఠమున ♦ స్వామిని నిన్ను వసింపఁజేసి స
మ్ముదమునఁ గొల్చి ధన్యుఁడగు ♦ ముక్తిని నేను జెలంగు టెన్నఁడో
సదయ ! నిరంతరాభ్యుదయ! ♦ సజ్జనజీవన ! లోకపావనా! 94

ఉత్పలము.

మాఱును జంద్రుఁడున్ రవియు ♦ మాఱు గ్రహంబులు ప్రగ్రహంబులున్
మాఱును జంతుసంతతులు ♦ మాఱును మానవజాతిరీతులున్
మాఱును సర్వ; మెన్నఁటికి ♦ మాఱనివాఁడవు నీవుమాత్రమే
సారెకు వెల్గుచుండుదువు ♦ సజ్జనజీవన ! లోకపావనా ! 95

ఉత్పలము.

ఆకసమందు మేఘము మ ♦ హాద్భుతరీతిని మాఱునట్లు లో
కైకశరణ్యా! నాహృదయ ♦ మక్కట మాటికి మాఱుచుండెడిన్
నీకరుణాకటాక్షమున ♦ నిర్మలము స్థిరమౌను గాక యీ
శా ! కరుణాసుధాకలశ ! ♦ సజ్జనజీవన ! లోకపావనా ! 96

ఉత్పలము.

ఎచ్చటనుండినన్ మఱియు ♦ నేగతి నుండిన నేమి చేసినన్
బొచ్చెములేని భక్తి నినుఁ బుణ్య ♦ చరిత్రుని గొల్వనిచ్చి నా
యిచ్చను దీర్పుమయ్య పర ♦ మేశ్వర! నన్విడనాడకయ్య నీ
సచ్చరితంబె పాడెదను ♦ సజ్జనజీవన! లోకపావనా! 97

ఉత్పలము.

త్యాగము భోగముంగలిగి ♦ ధర్మపథంబునఁ బీఠికాపురిన్
దాఁ గృపనేలు సూర్యనర ♦ నాథుని నాతనిరాణి ధీమణిం
బాగుగ వారిసంతతిని ♦ బాయనిప్రేమను బ్రోవుమయ్యనిన్
సాగిలిమ్రొక్కి వేఁడెదను ♦ సజ్జనజీవన! లోకపావనా! 98

ఉత్పలము.

అందఱు నీకు భక్తులయి ♦ యంచితరీతి దయార్ద్రచిత్తులై
సుందరసద్గుణాభరణ ♦ శోభితులై ధరణీతలంబు నా
నందమయంబుగా సలిపి ♦ నర్మిలి వర్ధిలుచుండ్రుగాక స
త్సాంద్రయశోవిశాలురయి ♦ సజ్జనజీవన! లోకపావనా! 99

చంపకము.

జయజయ భక్తకోటినుత! ♦ చారువిశాల యశోవిరాజితా!
జయజయ ఘోరపాపహర! ♦ సర్వశుభంకర! దుష్టభీకరా!
జయజయభూరిశాంతికర! ♦ సాధుమనోహర! సత్కృపాకరా!
జయజయపూర్ణ! శ్రీసదన! ♦ సజ్జనజీవన! లోకపావనా! 100

ఓమ్

ప్రబోధశతకము.

శ్రీకరుండును దుర్జన ♦ భీకరుండు
శంకరుండును బాపనా ♦ తంకరుండు
రంజనుండును భక్తార్తి ♦ భంజనుండు
విశ్వపతి గాన నతని సే ♦ వింపు మనస.

గీతము.

నిల్వఁగా నేల, శాగుఁగాఁ ♦ బీల్వ గాలిఁ,
త్రాగఁగా నీరుఁ, దినఁ బండ్లు, ♦ ధాన్యములను
గొల్లగాఁ బెట్టి జగమును ♦ నిల్పి గట్టి
హరికి మనమీఁద నెంతటి ♦ కరుణ మనస.

గీతము.

వింతవింతగ మెఱుపుతో ♦ పీట పీటఁ
గోట్లకొలఁదిగ దీపముల్ ♦ గూర్ప నేమి
దివిని దేవుండు వెల్గించు ♦ దీపమైన
సూర్యునకు సాటివచ్చునే ♦ చూడు మనస.

గీతము.

ఆఁకలికి నేడ్వఁ బాలిచ్చి ♦ యలఁతఁ దీర్చు
నిదుర వచ్చిన జోకొట్టి ♦ నిదురపుచ్చు
మందగింపక వ్యాధికి ♦ మందు వోయు
అమ్మ పరమేశుదయకుఁ జి ♦ హ్నమ్ము మనస. 4

గీతము.

పెద్దలను భక్తితోడ సే ♦ వింపవలయు
సములతో మైత్రి నెప్పారఁ ♦ సలుపవలయుఁ
బతితులను బ్రేమ నుద్ధరిం ♦ పఁగవలయు
వసుధ హరికృపఁ గనఁగోరు ♦ వారు మనస. 5

గీతము.

లోపములనెల్లఁ దేటగాఁ ♦ జూపువాఁడు
మేలు నెప్పుడుఁ గోరుచు ♦ మెలఁగువాఁడు
ఇడుమలను బాపఁ బ్రాణమే ♦ నిచ్చువాఁడు
మిత్రుఁ డనఁదగువాఁడు ధ ♦ రిత్రి మనస. 6

గీతము.

పాలు పోకింతయుఁ జెడకుండఁ ♦ బాలనుండి
తేనియను బీల్చుచుండెడు ♦ తేఁటికరణి
సౌఖ్య మింతయుఁ జెడకుండ ♦ జనులనుండి
పన్నుఁ గొనుటయె ప్రభునకుఁ ♦ బాడి మనస. 7

గీతము.

సదమలం బయి సుగుణాళి ♦ సదన మైన
స్వాంతమే కద భువిలోన ♦ స్వర్గ మనఁగ
మలినమయి దుర్గుణాళికి ♦ నిలయ మైన
చిత్తమే కద నరకంబు ♦ చెప్పుము మనస. 8

గీతము.

బలము విద్యయు సుగుణ సం ♦ పదయుఁ గలిగి
ప్రాయమం దుండువారు వి ♦ వాహమైన
సంచితం బగుసంతాన ♦ మబ్బుఁ గాని
బాల్యమునఁ బెండ్లి యాడిన ♦ ఫలమె మనస. 9

గీతము.

నీతి లేకున్న జగతి వి ♦ ఖ్యాతి లేదు
నీతి లేకున్న మదికి సం ♦ ప్రీతి లేదు
నీతి లేకున్న నాత్మకు ♦ జ్యోతి లేదు
ఏదియును నీతికిని సాటి ♦ రాదు మనస. 10

గీతము.

తనకు నభిమానవిషయమా ♦ దాని జనుఁడు
చిరముగాఁ గృషి చేసి సా ♦ ధింపవలయు
నన్యవిషయము లెల్ల సా ♦ మాన్యముగను
దెలిసి విద్యావినోది గా ♦ వలయు మనస. 11

గీతము.

ఒకని మెప్పింప సాధ్యమై ♦ యొప్పుఁ గాని
సర్వజనులను మెప్పింప ♦ సాధ్య మౌనె ?
కానఁ దనయంతరాత్మయై ♦ క్రాలుచుండు
నొక్క దేవుని మెప్పింప ♦ నొప్పు మనస. 12

గీతము.

పగను బగ వోదు గావునఁ ♦ బొగరు దక్కి
ధరణి నంతటఁ బ్రేమామృ ♦ తమ్ముఁ బఱపి
పగను జల్లార్చినచెను ♦ పావనుండె
పరమసంతోషధామంబుఁ ♦ బడయు మనస. 13

గీతము.

ధర్మమును సుంతయైనను ♦ దప్పకుండఁ
దగినమార్పులఁ గాలోచి ♦ తముగఁ జేసి
కాలచక్రంబుతోఁ బాటు ♦ కదలుజాతి
పరమసౌభాగ్యవంతమై ♦ ప్రబలు మనస. 14

గీతము.

స్వర్గమునకంటెఁ దనదగు ♦ జన్మభూమి
నెంతయును గొప్పగా నెంచి ♦ సంతతంబు
దానివృద్ధికి నన్నివి ♦ ధాలచేతఁ
బూని పనిసేయు దేశాభి ♦ మాని మనస. 15

గీతము.

ప్రబలు లెప్పుడు భువిని దు ♦ ర్బలులఁ ద్రుంప
వేచి యుందురు గాన వి ♦ వేకమతులు
దైవమును నమ్మి యొంటియు ♦ ధైర్యమూని
యెల్లబలముల నార్జింప ♦ నెంత్రు మనస. 16

గీతము.

అవయవము లెల్ల నైకము ♦ త్యమ్ము నొంది
దేహమును గాచుచుండును ♦ [illegible] నోఁప
దేశభక్తులు దమతమ ♦ దేశములను
గాచుకొందు రైకమత్యంబు ♦ గలిగి మనస. 17

గీతము.

తమసుఖమ్మును దుఃఖమ్ము ♦ తనవి గాఁగ
నెంచి తమవారి సుఖమె న ♦ [illegible]ంచుచుండి
ప్రాణపదముగఁ దమ్ముఁ గా ♦ పాడు నేని
ప్రభునకియ్యరె ప్రాణమేని ♦ ప్రజలు మనస. 18

గీతము.

ఎప్పటికి నెవ్వి జనుల క ♦ భీప్సితములొ
యప్పటికి వాని నిర్మించి ♦ యద్భుతముగ
నమ్మకము గొల్పి యోగ్యులొ ♦ భమ్ముఁ గొనుచు
నమ్మి ధనవంతులౌట న్యా ♦ యమ్ము మనస. 19

గీతము.

పరులు దనపట్ల నెట్టులు ♦ పరఁగఁగోరుఁ
బరులపట్టులఁ దానట్లు ♦ పరఁగుచుంట
ధరణిలోపల నుత్కృష్ట ♦ ధర్మమంచుఁ
జాటి రార్యులు సర్వదే ♦ శముల మనస. 20

గీతము.

వివిధవిజ్ఞానశాస్త్రముల్ ♦ విశ్వవిభుని
నిరత మొకతీరుగా వెల్గు ♦ నియమములను
దెల్పి యాతనిమహిమ బో ♦ ధించుఁ గాన
వాని నందఱుఁ బఠియింప ♦ వలయు మనస. 21

గీతము.

తాను వసియింపఁ బ్రేమతో ♦ దైవ మిడిన
మందిరమ్మగు దేహమ్ము ♦ నందునుండు
యంత్రములఁగూర్చి యెఱుఁగని ♦ యజ్ఞుఁ డెట్లు
కడు సుఖమ్ముగ వసియింపఁ గలఁడు మనస. 22

గీతము.

సృష్టిలోపలిచేతనా ♦ చేతనములు
పరుల కుపకార మొనరించి ♦ వఱలుచుండ
మానవుఁడు స్వార్థపరుఁ డయి ♦ మనియెనేని
వానిజన్మంబు భువిని ని ♦ ష్ఫలము మనస. 23

గీతము.

ఆకసంబున నెల్లబ్ర ♦ హ్మాండములను
నలుసులట్లుగఁ దేల్చి య ♦ నంతమహిమఁ
జూపుసర్వేశు మదిలోనఁ ♦ జూడఁ డేని
వాఁడెపో యంధుఁ డనఁదగు ♦ వాఁడు మనస. 24

గీతము.

చూచువా రెంతయును మదిఁ ♦ యోగ్యమందఁ
జిత్తరువు వ్రాసి దానికి ♦ జీవ మిడఁగ
శక్తి లేమిని గర్వంబు ♦ సర్వ ముడిగి
దైవమును జిత్రకారుఁడు ♦ దలఁచు మనస. 25

గీతము.

వేనిచేతను దేశముల్ ♦ వృద్ధిఁ గనెను
వేనిచేత నశించెనో ♦ వానినెల్ల
దేశచరితలలోఁ గాంచి ♦ దేశమునకు
వృద్ధి గూర్పఁ గడంగు సు ♦ బుద్ధి మనస. 26

గీతము.

పెరుఁగును మథింపఁ గలిగెడు ♦ వెన్నమాడ్కిఁ
బ్రకృతిని మథించుకొలఁదిఁ బ్ర ♦ పంచమునకు
మేలు సమకూర్చువస్తువుల్ ♦ వేలకొలఁదిఁ
గలుగుఁ దఱుఁగని పరమేశు ♦ కరుణ మనస. 27

గీతము.

పువ్వులోపలఁ దేనె, ను ♦ వ్వులను నూనె,
యబ్ధిలో నుప్పు, దారువు ♦ లందు నిప్పు,
పెరుఁగులో వెన్న పెట్టిన ♦ కరణి నెన్న
నీశ్వరుఁడు దేహమునఁ బ్రాణ ♦ మిడెను మనస. 28

గీతము.

వినెడువారికి వీనుల ♦ విందుగాఁగఁ
బరమపురుషుని సుగుణప్ర ♦ భావములను
వివిధవృత్తాళిలోపల ♦ వినుతి సేసి
సుకవిసంతోషభరమునఁ ♦ జొక్కు మనస. 29

గీతము.

రాగతాళమ్ములను గూర్చి ♦ రమ్యఫణితిఁ
బాడనేర్చిన మాత్రాన ♦ ఫలము గలదె
దేవదేవునిదివ్యప్ర ♦ భావములను
జెన్ను మీఱఁగఁ గీర్తింప ♦ కున్న మనస. 30

గీతము.

ఒక్కవైపున సూర్యుని ♦ నొక్కవైపు
సురుచిరంబుగఁ జుక్కలఁ ♦ జూపుకొఱకు
రమ్యతరమైనభూమియన్ ♦ రాట్నమందుఁ
బెట్టి మము ద్రిప్పుగద విశ్వ ♦ విభుఁడు మనస. 31

గీతము.

పలు తెఱంగులబుతువులు ♦ గలిగి జనులు
వివిధ సౌఖ్యమ్ములను గాంచి ♦ వెలయుకొఱకు
సకలజగదేకనాథుఁ డా ♦ సనముచేతఁ
ధరణిచుట్టును దిరుగును ♦ ధరణి మనస. 32

గీతము.

దుష్టులే లేకయుండిన ♦ శిష్టులకును
సుగుణసంపద యెల్లను ♦ జూపుటకును
సమయ మబ్బునె కావున ♦ జగతియందుఁ
గ్రాలు నన్నిటఁ బరమేశు ♦ కరుణ మనస. 33

గీతము.

పాపికిడు భీతి, బాధకుఁ ♦ బార మొసఁగు
వచ్చువారికిఁ జోటిచ్చుఁ, ♦ బ్రీతిభఁ జూపఁ
గ్రొత్తవారికి సమయంబుఁ ♦ గూర్చుఁ గాన
మరణమునఁగూడ హరికృప ♦ మెఱయు మనస. 34

గీతము.

పాటుపడఁ దిండి రుచ్యమై ♦ పరఁగుచుండుఁ
బాటుపడ హాయిగా నిద్ర ♦ పట్టుచుండుఁ
బాటుపడ దేహ మారోగ్య ♦ భాగ్య మందుఁ
బాటుపడువాఁడె సుఖములఁ ♦ బడయు మనస. 35

గీతము.

బడలికను దీర్ప, నొడలికి ♦ బలముగూర్పఁ,
బాటవముతోడ బుద్ధికిఁ ♦ దేటగొల్పఁ
జక్కఁగాఁ బనిసేయను ♦ త్సాహ మిడఁగ
నుచితమగునిద్ర పరమేశుఁ ♦ డొసఁగె మనస. 36

గీతము.

ప్రస్తుతం బున్నతిని గాంచఁ ♦ బాటుపడక
పూర్వులపరాక్రమాదులే ♦ పొగడికొనుచు
వ్యర్థముగఁ గాలమునుబుచ్చు ♦ వాని బుధులు
వట్టిమూర్ఖునిగా నెంతుర్ ♦ వసుధ మనస. 37

గీతము.

స్త్రీలు పురుషులుగూడ నే ♦ దేశమందు
మోద మిడుచురో విద్యావి ♦ నోదు లగుచు
నద్ది సర్వేశుకరుణచే ♦ నలరుచుండి
దేశములకెల్లఁ దిలకమై ♦ తీరు మనస. 38

గీతము.

లోపములఁ జూపువారిపైఁ ♦ గోపపడక
వందన మొనర్చి తనకున్న ♦ కుందులెల్లఁ
బాపుకొనఁ బాటుపడుచుండు ♦ భవ్యమతియె
యఖిలసద్గుణవంతుఁడై ♦ యలరు మనస. 39

గీతము.

ఎట్టివాఁడైనఁ బరమేశు ♦ సృష్టిలోన
గర్వభరమునఁ గన్నులు ♦ గానఁడేని
లోఁతు తెలియంగరానట్టి ♦ గోతిలోనఁ
దల్లక్రిందుగఁ బడును ద ♦ థ్యమ్ము మనస. 40

గీతము.

తన్నునమ్మినవారల ♦ యున్నతికిని
దఱిని సాయమ్మొనర్పఁగఁ ♦ దప్పువాఁడు
కీడుమూడినయప్పుడు ♦ తోడుగనక
డిల్లపడి యొంతయును దల్ల ♦ డిల్లు మనస. 41

గీతము.

దిక్కుమాలినదీనులఁ ♦ బెక్కులైన
తంత్రములచేత నెక్కఁగాఁ ♦ దలచువాని
నొక్కసారిగ భగవంతుఁ ♦ డుక్కడంచు
దీనరక్షయె తనదీక్ష ♦ గాన మనస. 42

గీతము.

తీసి యీలేని ప్రాణముల్ ♦ దీసి తీసి
భావమం దుండుకరుణను ♦ బాపి పాపి
చేత వాతను బాపముల్ ♦ చేసి చేసి
బ్రదుకుమనుజుఁడు భూమికి ♦ బరువు మనస. 43

గీతము.

ఒరులయున్నతి వీక్షించి యుడుకువాఁడు
తనప్రతాపమ్ము కొసయాడు ♦ కొనెడువాఁడు
బాధపడువారిఁ గని దుఃఖ ♦ పడనివాఁడు
పరమపాతకుఁ డనఁదగు ♦ వాఁడు మనస. 44

గీతము.

శత్రువేషంబుఁ దాల్చిన ♦ మిత్రుఁ డరయఁ
జేయలేఁడేని మేల్ కీడు ♦ సేయకుండు
మిత్రవేషంబుతో నున్న ♦ శత్రు వన్నఁ
గూర్మిఁ జూపుచునే గొంతుఁ ♦ గోయు మనస 45

గీతము.

దుర్జనులు సజ్జనులవలెఁ ♦ దోఁచుచుందురు
తోఁచుచుందురు సుజనులు ♦ దుష్టులట్టు
లున్నరీతిని గనపడ ♦ కుంద్రుజనులు
గానఁ బైవేషముల నమ్మఁ ♦ గాదు మనస. 46

గీతము.

పరులదోషముఁ గనఁ బాటు ♦ పడుటకంటెఁ
దొడరి తనదోషమును జూడఁ ♦ దొడఁగెనేని
మాని తనయల్పభావంబు ♦ మానవుండు
పడయుచుండు నుదారభా ♦ వంబు మనస. 47

గీతము.

జగములోపల నిష్ప్రియో ♦ జనముగాఁగ
నేడియును హరి సృష్టింప ♦ లేదు గానఁ
బనికిమాలిన దని దేనిఁ ♦ బలుకకుండ
దానియుపయోగ మెఱుఁగంగఁ ♦ దగుదు మనస. 48

గీతము.

వానకోయిల తమిఁగోడ ♦ వానచినుకు
కొఱకు వేచెడుగతిని స ♦ ద్గుణముకొఱకు
వేచి యెచ్చట నది గన్న ♦ విడువకుండ
నీదిగా నెంచి కైకొంట ♦ నీతి మనస. 49

గీతము.

అప్పటికిఁ గష్ట మొదవిన ♦ నెప్పటికిని
సుఖమె కలిగెడు పని సేయఁ ♦ జూడవలయు
నప్పటికి మేలు గల్గిన ♦ నెప్పటికిని
గష్టమబ్బెడు పని సేయఁ ♦ గాదు మనస. 50

గీతము.

హానిలాభమ్ములనుబట్టి ♦ యరసి చూడఁ
గొందఱకు నష్ట మొదవినఁ ♦ గొంచెముగను
బలువురకుఁ జాల మేలును ♦ గలుగఁజేయు
పనులు సేయుచు నుంటయే ♦ పాడి మనస. 51

గీతము.

పాపపుణ్యంబులనుగూర్చి ♦ భవ్యమతులు
స్పష్టముగఁ దెల్పినట్టిల ♦ క్షణము వినుము
పరుల కపకార మొనరింపఁ ♦ బాప మగును
బరుల కుపకృతి పుణ్యమై ♦ పరఁగు మనస. 52

గీతము.

మంచిచెడుగులు రెండును ♦ మనుజునందుఁ
బెనగొనియె యుండు, మంచిని ♦ బెంపకున్నఁ
జెడుగు చెలరేఁగుఁ, జెడుగును ♦ జెడ నడంప
మంచి తలయెత్తి యెంతయు ♦ మించు మనస. 53

గీతము.

సుగుణమణిహార సూత్రమై ♦ నెగడుచుండు
మాత్తురనుగూడ సఖులుగా ♦ మార్చుచుండు
గుప్తముగఁ గీర్తి నల్గడఁ ♦ గూర్చుచుండు
నడఁకువయె యెల్లవారికిఁ ♦ దొడవుమనస. 54

గీతము.

పరుల కుపకార మొనరింపఁ ♦ బాటుపడెడు
పుణ్యమూర్తికి హృదయానఁ ♦ బొదలుశాంతి
ఘోరతరములు గష్టముల్ ♦ గోట్లకొలఁది
వచ్చినను నోర్చుకొనశక్తి ♦ నిచ్చుమనస. 55

గీతము.

తమసుఖమె చూచుకొనుచుండు ♦ దంపతులకు
నీశ్వరుఁడు ప్రేమసంతాన ♦ మిదుట చూడఁ
బరులకై స్వార్థమును వీడి ♦ పాటుపడఁగ
నెమ్మినొసఁగెడుపరిశ్రమపా ♦ ఠమ్ము మనస. 56

గీతము.

తనబలమ్మును విద్యయుఁ ♦ దనధనమ్ము
దేవదత్తము లని మదిఁ ♦ దెలిసి వాని
సతతము పరోపకృతి నిడు ♦ సదయుమీఁద
హరి సుఖామృతవృష్టిని ♦ గురియుమనస. 57

గీతము.

విత్తనము నష్టమైనను ♦ వృక్షరూప
మొంది వర్ధిల్లుచుండెడు ♦ చందమునను
గాయ మెడలినసుజనుండు ♦ ఖ్యాతిరూప
కాయమును బొంది వర్ధిల్లుఁ ♦ గాదె మనస. 58

గీతము.

వివిధభాషలయందుండు ♦ విషయములను
లలితమైశైలితోడ స ♦ లక్షణముగ
మాతృభాషను భాషాభి ♦ మానివ్రాసి
యక్షయంబగుకీర్తిచే ♦ నలరు మనస. 59

గీతము.

సూదిబెజ్జంబులోపల ♦ సూటిగాను
సానుజంబైన దూరంగఁ ♦ జాలుఁగాని
మోక్షరాజ్యమహాద్వార ♦ మును జొరంగ
లేఁడు విషయాబ్ధి మునిఁగిన ♦ వాఁడు మనస 60

గీతము.

యుద్ధమున వేలకొలఁదిగ ♦ యోధవరులఁ
గూల్చువీరునికంటెను ♦ ఘోరపాప
జాలములతోడఁ బోరాడి ♦ జయముగాంచు
వీరుఁడే యుర్వి శ్రేష్ఠుఁడై ♦ వెలయు మనస. 61

గీతము.

అఖిలపాపములకు మూల ♦ మగుచు నడరు
నింద్రియాళిని నెదిరి జ ♦ యించి వాని
సత్పథంబున నడిపింపఁ ♦ జాలఁడేని
నెన్ని రాజ్యము లేలిన ♦ నేమి మనస. 62

గీతము.

ఎంతధనమున్న బిరుదుల ♦ నెన్నిగన్న
సకలవిద్యలయందును ♦ జాణయైన
నెవఁడు దనజన్మభూమి ప్రే ♦ మింపకుండు
వాఁడె జీవన్మృతుండనఁ ♦ బడును మనస. 63

గీతము.

వివిధదేశస్థులందఱు ♦ విహితమతిని
మించునన్యోన్యప్రేమ వ ♦ ర్తించిరేని
జగడములుమాని శాంతిశ్రీ ♦ నెగడిరేని
భూతలంబెల్ల స్వర్గమై ♦ పొదలు మనస. 64

గీతము.

పాపమునుగూడ మర్యాదఁ ♦ బడయుటకును
బుణ్యవేషంబుఁ దాల్చెను ♦ పోల్కిఁ జూడఁ
బూని పాపంబుగూడ న ♦ పుణ్యమునకు
గౌరవముఁ జూపుచుండుట ♦ గాదె మనస. 65

గీతము.

సత్యమనుధ్రువరేఖపై ♦ సంతతంబు
దిరుగుచును నిల్చి హరియుండుఁ ♦ దిరముగాను
సత్పథమ్మున నరుగుపౌ ♦ శస్త్రమతిమె
భూతలస్వర్గలోకమై ♦ పొల్చు మనస. 66

గీతము.

పొగడుఁగాక జనావళి ♦ దెగడుఁగాక
పెంతుర్గాక నృపాలురు ♦ నొంతుర్గాక
చేరుఁగాక సుఖమ్ములు ♦ జాఱుఁగాక
సత్పథమునుండి తొలఁగింపఁ ♦ జనదు మనస. 67

గీతము.

సత్యమై యొప్పు న్యాయ ప ♦ క్షంబుఁ బూని
సముల పైఁగాని తమకంటె ♦ శక్తియందు
నధికులౌవారి పైఁగాని ♦ యడరి తొడరి
గెలుపుగొనుటయె శౌర్యమై ♦ వెలయు మనస. 68

గీతము.

దీనులై తమకెవ్వరు ♦ దిక్కు లేక
పొక్కువారలపైఁ బొగ ♦ రెక్కియరిగి
పెక్కుబాధలఁ జిక్కించు ♦ ఫక్కి చూడఁ
గ్రౌర్యమే కాని శౌర్యంబు ♦ గాదు మనస. 69

గీతము.

మహిని దప్పొనరించుట ♦ మనుజగుణము
తప్పు క్షమియించు టెంతయు ♦ దైవగుణము
గానఁ జేసినతప్పులకై ♦ కరము వగచు
దీను క్షమియింప హరి మెచ్చి ♦ తీరు మనస. 70

గీతము.

చూపవలయును మిత్రుని ♦ లోపములను
జూడవలయును శత్రుని ♦ సుగుణములను
జూచికొని తనలోపలఁ ♦ జొచ్చియున్న
పాపములనెల్లఁ బాపుకో ♦ వలయు మనస. 71

గీతము.

తమచరిత్రల నుత్తమో ♦ త్తమములుగను
జేసికొనఁగోరువారల ♦ చిత్తములకు
నెదుట నాదర్శకము లయి ♦ పొదలుచుండు
ధరమహాత్ముల సచ్చరి ♦ త్రములు మనస. 72

గీతము.

బలము నార్జింప సుగుణసం ♦ పద గడింప
భక్తి మదిఁ బెంపఁ బరమపా ♦ వను భజింప
గురుల సేవింప విద్యల ♦ నెఱిఁ బఠింప
బ్రహ్మచర్యంబు వహియింప ♦ వలయు మనస. 73

గీతము.

అంద ఱానందమునఁ దేలి ♦ యాడుచుండ
నేడ్చుచును వత్తు మిబ్భువి ♦ కెల్లరమును
వగవ మనకంద ఱానంద ♦ ముగను మనము
పోవునట్లుగ మెలగంగఁ ♦ బోలు మనస. 74

గీతము.

వచ్చి గర్వంబు దనలోనఁ ♦ జొచ్చెనేని
హరికిఁ దనకును నుండెడు ♦ నంతరంబు
మనుజుఁడు దలంప నెండకు ♦ మంచువోలెఁ
గరఁగిపోవును గర్వ మా ♦ క్షణమె మనస. 75

గీతము.

పాపరోగంబు నిన్నుండి ♦ పాయుటకును
వేకువను సంజ నిత్యంబు ♦ విడువకుండ
హరిగుణధ్యాన మనుపర ♦ మౌషధంబు
భక్తియుతముగ సేవింప ♦ వలయు మనస. 76

గీతము.

హృదయసింహాసనంబున ♦ నీశు నునిచి
సకలజీవులకును దన ♦ శక్తికొలఁదిఁ
గూర్మిఁ గని సాయ మొనరించు ♦ కొలు వొనర్చి
మనెడుకరుణాళువే భక్తుఁ ♦ డనఁగ మనస. 77

గీతము.

భక్తు లని వేషములు వేయ ♦ వచ్చుఁగాని
నిర్మలం బగుమదితోడ ♦ ధర్మ మెఱిఁగి
పరమపురుషునియాజ్ఞలో ♦ పల మెలంగి
ధన్యతను బొంద మిగులదు ♦ స్తరము మనస. 78

గీతము.

చాటుచాటుగఁ బాపముల్ ♦ చాల సలిపి
యంద ఱెఱుఁగ నొకింతపు ♦ ణ్యంబు చేసి
జనుల వంచింప నగుఁ గాని ♦ సర్వ మెఱుఁగు
దైవమును మోసపుచ్చంగఁ ♦ దరమె? మనస. 79

గీతము.

పాపములకయి లోనఁ జే ♦ వాల్లు పెట్టి
యంద ఱజేఁగెడునట్లు పు ♦ ణ్యాంబులకును
దగినయాదరమును గూర్చి ♦ దయను జూపు
జగదధీశున కెవ్వరు ♦ సాటి? మనస. 80

గీతము.

మిత్రుఁడుగఁ గొందఱకు నుండు ♦ శత్రువుగను
గొందఱకు నుండుఁ దక్కిన ♦ యాదఱకును
మహిఁ దటస్థుఁడుగా నుండు ♦ మానవుఁడు
అందఱకు మిత్రుఁడగువాఁడు ♦ హరియె మనస. 81

గీతము.

నిప్పు గాల్పంగ లేనట్టి ♦ నీరమైన
గడిగి వేయంగ లేనట్టి ♦ గాలియైనఁ
బారఁదోలంగ లేనట్టి ♦ పాపములను
నిముసమునఁ బాపు హరిఁ జేరి ♦ నెగడు మనస. 82

గీతము.

అంతరాంతరహృదయగు ♦ హాంతరమునఁ
గదలి మెదలక తిరముగాఁ ♦ బాదలుమాని
తేట తెల్లంబుగాఁ జూపు ♦ తెన్నువట్టి
మోక్షసామ్రాజ్యమును జేరఁ ♦ బొమ్ము మనస. 83

గీతము.

విన్నఁ బరమేశుమాటలే ♦ వింటివేని
గన్నఁ బరమేశుతత్త్వమే ♦ కంటివేని
మన్నఁ బరమేశుసేవనే ♦ మంటివేని
సున్నమై పోవు పాపమ్ము ♦ లన్ని మనస. 84

గీతము.

పాడుచుండుము హరికీర్తి ♦ భక్తితోడఁ
గూడుచుండుము భక్తులఁ ♦ గూర్మితోడ
వీడుచుండుము దుష్టుల ♦ వెరపుతోడ
హరి ముదంబున నీతోడ ♦ నాడ మనస. 85

గీతము.

గుట్టు సఖులకుఁ దెల్పినఁ ♦ గూర్మి మఱచి
వెల్లడింతురు లోలోన ♦ నెల్లరకును
ఎన్ని దెల్పిన విని హరి ♦ యించుకైన
నెవరికిని జెప్పఁ డెంతటి ♦ హితుఁడు మనస. 86

గీతము.

ఇచ్చటికి నిన్ను దేవుఁడు ♦ దెచ్చినప్పు
డెన్ని సదుపాయములఁ గూర్చె ♦ నెఱుఁగుదు గద
యెచటకుం గొనిపోయిన ♦ నచటఁగూడ
నిట్లె కృపచేయు నని నమ్మ ♦ వేల ? మనస. 87

గీతము.

గర్భమందున్నయప్పుడు ♦ గాచినాఁడు
గాఢమౌనిద్రయందును ♦ గాచినాఁడు
గావకుండునె మరణంబు ♦ గాంచినపుడు
చేర్చి తనయొడి హరి నిన్నుఁ ♦ దేర్చు మనసఁ 88

గీతము.

జననికడనుండి వచ్చి యా ♦ జననిదరికి
నరుగఁ జింతిల్లునినుఁ జూడ ♦ నలుక వాఁడవుఁ
బుట్టినింటికి నందఱు ♦ ముదముతోడఁ
బోవ నీకిది యేమిదు ♦ ర్బుద్ధి మనస. 89

గీతము.

పట్టియున్నట్టిమైలను ♦ బాపుటకును
బట్టలను బండపైఁ బెట్టి ♦ బాదునట్లు
వీడిపోవంగఁ బాపముల్ ♦ వెతను బెట్టి
దేవుఁ డుతుకును నిన్ను భీ ♦ తిలకు మనస. 90

గీతము.

ఎప్పు డెచ్చటఁ గోరిన ♦ నప్పు డచట
దర్శనం బిచ్చి నినుఁగాచు ♦ దాత యైన
దైవ ముండంగ నల్పుల ♦ దరిని జేరి
వృథగ యాచించుచుండుదు ♦ వేల ? మనస. 91

గీతము.

కూర్మి నీమీఁద శుభములే ♦ కురియుచుండు
దేవుఁ డొసఁగినదానితోఁ ♦ దృప్తి గనక
యేల యడిగెద విది యది ♦ యిమ్మటంచు
నెఱుఁగఁడే హరి నీకెద్ది ♦ హితమొ ? మనస. 92

గీతము.

ఒండొకటితోడ డీకొన ♦ కుండుమాడ్కి
నద్భుతమ్ముగ దివిని బ్ర ♦ హ్మాండములను
వివిధరీతులఁ ద్రిప్పెడు ♦ విశ్వప్రభుని
చేతిలీలారవిందమై ♦ చెలఁగు మనస. 93

గీతము.

రమ్యకల్యాణగుణమణి ♦ రచితభక్త
హృదయసింహాసనంబునఁ ♦ బొదలుచుండి
సకలజగముల నేలెడు ♦ సార్వభౌము
కూర్మిబిడ్డవు నీకేమి ♦ కొదువ ? మనస. 94

గీతము.

అర్కశతకోటిచంద్రస ♦ హస్రకోటి
కలితలలితమహాద్భుత ♦ కాంతియుక్త
చారుసౌందర్యమూర్తియౌ ♦ స్వామియెదుట
నిల్వుటద్దముగా నిల్చి ♦ నెగడు మనస. 95

గీతము.

ధర్మవైరులఁ జెండాడ ♦ దైన మెంచి
వారిపై నినుఁ గొల్వన ♦ నార్యధైర్య
శౌర్యములఁ జూపి పోరాడి ♦ జయము గాంచ
దివ్యభృత్యుఁడ వనుకీర్తిఁ ♦ దెమ్ము మనస. 96

గీతము.

నమ్మి నీకంతయు నొసంగు ♦ నమ్మకమ్ముఁ
స్వామికిని గల్గునట్లుగా ♦ సంచరించి
పరమమైత్రిని నాతని ♦ పట్టఁజేరి
యార్తులకు నెల్ల నాప్తుఁడ ♦ వగుము మనస 97

గీతము.

నేను వరియింప నెవరిని ♦ నిన్నె కాని
యంచు నన్నియు విడనాడి ♦ హరిని నీవు
వలచితివి గాన నతఁడును ♦ వలచె నిన్నుఁ
గూర్మి నొకటైతి రింకేమి ♦ కొఱఁత? మనస. 98

గీతము.

ఏకతంబున లోనఁ బ్రా ♦ ణేశుఁడైన
పరమపురుషునిఁ గాంచి ♦ పాడియాడి
నిరుపమానందభరమునఁ ♦ గరము సొక్కి
మఱచిపొమ్మెల్ల నిను నీవు ♦ మఱచి మనస. 99

గీతము.

ఎంతకూరిమి నెక్కుడై ♦ యొసఁగుచున్న
ప్రభుప్రవరియించె నని గర్వ♦ పడితి వేని
పడినపాటెల్ల వ్యర్థమై ♦ ప్రథమదశకు
నిన్ను నగ్గర్వమే దెచ్చు ♦ నిజము మనస. 100

గీతము.

స్వచ్ఛమైనట్టిభక్తితో ♦ స్వామిసేవ
నఖిలవిధములచేత నీ ♦ వాచరించి
మరలి రాకుండ మోక్షసా ♦ మ్రాజ్య మందె
యలరుచుండుము నాప్రియ ♦ మైనమనస. 101

గీతము.

అంద ఱాప్రభుసంతాన ♦ మగుటఁ దెలిసి
గాఢసోదరభావంబు ♦ గలిగి మెలఁగి
భూతలం బెల్ల స్వర్గమై ♦ పొదలునట్లు
సలుపవేనుము సర్వేశు ♦ సతము మనస. 102

గీతము.

శతక మిది ప్రియఁగొల్పిన ♦ హితుని సుగుణ
రతుని నాయనివేంకట ♦ రంగనృపునిఁ
దత్సతిని సంతతిని మహా ♦ దారమతిని
బెంపఁ బరమేశు భక్తిఁ బ్రా ♦ ర్థింపు మనస. 103

శ్రీ

భక్తకర్ణామృతము.

మధ్యమావతి-చాపు

ఎంతవాఁడను నిన్నుఁ గీర్తింప

ఈశ్వరనే

నెంతవాఁడను నిన్నుఁ గీర్తింప

సుంతయైనను గాన సాహితి ♦ చొప్పెఱుంగని శుద్ధమూర్ఖుఁడ॥ నెం॥

వింతవింతగ నిన్నుఁ గూరిచి ♦ వేయివిధములఁ బాడుటకు నా
కెంతయో మది యున్నదది ఫల ♦ వంతమగు టెట్లో యెఱుంగను
॥ఎం॥

చారుసంగీత ప్రవీణులు నారదాదిమహామునీంద్రులు
సారెకును బాడంగఁ గూరిమి ♦ మీఱ నాకర్ణించు విభుఁడవు॥ఎం॥
రాగతాళము లెల్ల నేరిచి ♦ రక్తితో నినుఁ బాడి నీయను
రాగమును నార్జించి మించిన ♦ త్యాగరాజును గాను బీదను॥ఎం॥
భక్తితో నిశుభగుణమ్ముల ♦ భవ్యరీతులఁ బాడుటకుఁ గల
శక్తియెవ్వియు లేనివాఁడను ♦ స్వామి నిన్నే నమ్మినాఁడను ॥ఎం॥
హెచ్చుగా నినుఁ గొల్చి పాడెదు ♦ నెందఱో మహాసియులుండఁగ
మెచ్చుకొందువె యీశ్వరా నా ♦ వచ్చిరాని గీతజాతము॥ఎం॥

2 కమాచ్ - ఛాపు

కొనియాడఁదరమే నిన్నుఁ

కువలయవినుత

కొనియాడఁదరమే నిన్ను

దినకరశశితార ♦ గణముల వెలిఁగించు

ఘన తేజమునుజూపు ♦ కాంతిమంతుఁడవీవు ॥కొని॥

బంగరమ్ములమూడిక్రి ♦ భూమ్యాదిగ్రహముల

నింగి గిరగిరఁద్రిప్పు ♦ నేర్పుకాఁడవునీవు ॥కొని॥

ఒండొంటి ఢీకొన ♦ కుండలోకములను

ద్దండరీతిని నడుపు ♦ చండశాసనుఁడీవు ॥కొని॥

స్తుత్యమౌనీసృష్టి ♦ సుందరమ్ముగఁ జేసి

యత్యద్భుతముఁజూపు ♦ నైంద్రజాలుఁడవీవు ॥కొని॥

పారశాంగ జగతి ♦ బహువిధములఁ జేసి

పాఠములనునేర్పు ♦ పరమగురుఁడవు నీవు ॥కొని॥

3 సురటి-ఆదితాళము

పొగడఁదరమె నిన్ను మాప్రభు పొగడఁదరమె నిన్ను

ధగధగ మెఱసెడు ♦ తరణికోటులకు
జిగిబిగిఁగూరుచు ♦ చిన్మయరూపా! ॥పొగ॥
అగణితమగుబ్రహ్మాండకోటులను
సొగసుగఁదీరిచి ♦ సూత్రధారివలు
గగనరంగమునఁ ♦ గడుఁజోద్యమ్ముగఁ
దగనాడించెడు ♦ తాండవ లోలా! ॥పొగ॥
నేత్రపర్వముగ ♦ నిగనిగలాడెడు
చిత్రవిచిత్రపుఁ ♦ జిన్నెలవన్నెల
ధాత్రిని నతిసొం ♦ దర్యరాశిగా
చిత్రశాలగాఁ ♦ జేసినస్వామీ! ॥పొగ॥
వీనుల విందుగ ♦ వివిధ స్వరముల
గానముచేసెడు ♦ కలకంఠాదుల
మానితరీతిని ♦ మహినలరించెడు
గానకళాలం ♦ కరణధురీణా! ॥పొగ॥
పరిపరివిధముల ♦ పాపరోగములఁ
బరితపించుమా ♦ పరితాపమ్ములఁ
బరమకృపామృత ♦ ఫలితౌషధములఁ
బరిహారముసేయు ♦ వరవైద్యమణీ! ॥పొగ॥

4 బేహాగ్-ఆదితాళము

నినుఁ గొనియాడఁగ ♦ నేర్చునెవ్వఁడు భువి
మనమునకందని ♦ మహిమలునీవి ॥నిను॥

మునులు ఋషీంద్రులు ♦ ముదమునహృదయాన
ననుదినమును నిన్నె ♦ యరయుచునుండియు
దినకరకోటుల ♦ దివి వెలిఁగించియుఁ
గనఁబడకున్నావు ♦ కరమువిచిత్రము ॥నిను॥

వివిధజగమ్ముల ♦ వింతగఁద్రిప్పుచు
నవనవలీలల ♦ నటనము సల్పుచు
నెవరు నెఱుంగని ♦ యేకాంతమ్మునఁ
బ్రవిమలకాంతితో ♦ భాసిలుచుందువు ॥నిను॥

నమ్మినభక్తుల ♦ నెమ్మదిలోపలఁ
దుమ్మెదవలెవాలి ♦ ఝుమ్మనిపాడుచుఁ
గమ్మనిభక్తిర ♦ సమ్మును గ్రోలుచుఁ
గొమ్మని శుభములఁ ♦ గురియుచునుందువు ॥నిను॥

5 శంకరాభరణము. రూపకము

దేవనీప్రభావగరిమ ♦ తెలియశక్యమా
కేవలకరుణా ప్రపూరమ ♦ కీర్తిధామమా ॥దేవ॥
పరమభక్తినిన్నుఁగొల్చు ♦ భక్తవరులకు
దురితములను దఱుముశక్తి ♦ నిరతమిత్తువు ॥దేవ॥
పరులహితముకొఱకె పాటు ♦ పడెడువారికి
నిరుపమానంద పదవి ♦ నెమ్మిఁగూర్తువు ॥దేవ॥
నిన్నుఁజూడ నిచ్ఛయించు ♦ నీతిపరులకు
నన్నిచోట్లదర్శనమిడి ♦ యాదరింతువు ॥దేవ॥
వివిధజగములను వెలంగు ♦ వింతఁ జూపఁగ
వివిధ దేహముల నొసంగు ♦ విశ్వవిభుఁడవు ॥దేవ॥
మొదటఁగష్టపెట్టిమదిని ♦ బదనుపఱచుచు
సదయహృదయుఁడౌటతుదకు♦ముదమునింతువు ॥దేవ॥

6 మాయామాళవగౌళ-ఆదితాళము

ఏమనిపిలుతును నిన్ను నే ♦ నేమనిపిలుతునునిన్ను

స్వామియందున ♦ సఖుఁడాయందున

ప్రేమకు నెలవగు ♦ ప్రియుఁడాయందున ॥ఏమని॥

తల్లియందున ♦ తండ్రియందున

యెల్లరఁబ్రోచెడు ♦ నీశ్వరయందున ॥ఏమని॥

దివ్యసౌఖ్యమిడు ♦ దేవాయందున

అవ్యయుఁడగు పర ♦ మాత్మాయందున ॥ఏమని॥

భవరోగమహా ♦ వైద్యాయందున

వివిధజగద్గణ ♦ వేద్యాయందున ॥ఏమని॥

గురులకునెల్లను ♦ గురువాయందున

వరములనిడుకల్ప ♦ తరువాయందున ॥ఏమని॥

ఎంతయుభక్తుల ♦ హృదయరంగముల

వింతగవెలిఁగెడు ♦ వెలుఁగాయందున ॥ఏమని॥

7 శ్రీరాగము - చాపు

ఏడనిన్ జూడఁగనగును - నీ

జాడ తెల్పను నాకు ♦ జడమతి నేను
వేడఁగఁజాలను ♦ పాడఁగఁజాలను
కూడి నీతో నుండ ♦ వేడుకగలిగెను ॥ఏడ॥

ఏమనిపిలువఁగవలెనో - ని

న్నెచ్చట వెదకఁగవలెనో

నామమెఱుంగను ♦ ధామమెఱుంగను
ఏమనిపిలుతు ని ♦ న్నెచ్చట వెదకుదు ॥ఏడ॥

అందఱు నిన్నెఱిఁగినారు - నే

నెందఱనడిగిన ♦ నెఱుఁగమన్నారు

పొందుగ నినుఁబొంది ♦ పొంగి ముదమ్మున
నుందామనునాశ ♦ యుదయించియున్నది ॥ఏడ॥

ఒకపరిదర్శనమిమ్ము - నీ

వొకపరిమాటాడిపొమ్ము

ఇఁక నినుఁబిలువను ♦ ఇఁక నేమియడుగను
సకలమర్పించి నే ♦ సుకముగనుందును ॥ఏడ

8 బేహాగ్-రూపకతాళము

నినువినా జగదీశమాకు ♦ నెయ్యుఁడెవ్వఁడు
కనికరమున మమ్ముఁగాచు ♦ కాంతుఁడెవ్వఁడు ॥నిను॥

తల్లి గర్భమందునున్న ♦ తరుణమునందుఁ
బిల్లల మముఁగాచినావు ♦ ప్రేమదాతవు ॥నిను॥

తల్లిఁ దండ్రిగూరువు నన్నఁ ♦ దమ్ముల సఖుల
నెల్లబంధువులనొసంగి ♦ యెలమిఁగూర్తువు ॥నిను॥

చింతలనొకక్షణములోన ♦ శాంతిపఱతువు
వింతవింతగ సృష్టిఁజేసి ♦ వేడ్కనింతువు ॥నిను॥

పాపదావాగ్నిఁజిక్కి ♦ పరితపించెడు
పాపులమము నుద్ధరించు ♦ పావనుండవు ॥నిను॥

9 బేహాగ్-ఆదితాళము

నీనామమె యెంతో రుచిరా ♦ నిఖిలసజ్జనగోచరా
మానసమునకింపునింపు ♦ మహితవీణారవమురా ॥నీ॥
మధురమైన నీనామమె ♦ మానులకుజపమురా
అధమాధములనుద్ధరింప ♦ నంచితసాధనమురా ॥నీ॥
అఖిలపాపములను బాప ♦ నదియెసిద్ధౌషధమురా
సుఖమునాత్మబలము నిచ్చు ♦ సురచిరామృతరసమురా ॥నీ॥
భవ్యధర్మరంగస్థిత ♦ భ క్తవీరకోటికి
నవ్యయోత్సాహమ్ముగొల్పు ♦ దివ్యభేరీరవమురా ॥నీ॥

10 శంకరాభరణము - ఆదితాళము.

నీకంటెవేఱెవ్వరు మమ్మేలరింపఁగ నీకంటెవేఱెవ్వరు
శోకాపనోదివి ♦ లోకవినోదివి
రాకాసుధాంశుకోటి ♦ రమణీయమూర్తివి॥ నీకంటె॥
బ్రహ్మాండకోటులతో ♦ బంతులాడెదునీవు
బ్రహ్మాది బిరుదుల ♦ భాసిల్లుచున్నావు ॥నీకంటె॥
రవిచంద్రతారల ♦ రాజిల్లు దివియెల్ల
ప్రవిమలరత్నాల ♦ పందిరిగ దనీకు ॥నీకంటె॥
ర క్తినిన్ గొల్చు ప్రి ♦ స క్తితోఁ జెన్నారు
భక్తులహృదయమ్మె ♦ భద్రపీఠము నీకు ॥నీకంటె॥

11 నవరోజు - చాపు.

నిండుచందురుఁడీవు ప్రభువర ♦ నిర్వికారశుభంకరా

పండువెన్నెలఁ దిను చకోరపుఁ ♦ బక్షి నేను పరాత్పరా ॥నిం॥

కమలపుష్పము నీవు దేవర ♦ కమ్మతేనియఁ ద్రావు నా

భ్రమరమేను త్రిలోకసుందర ♦ భవ్యవిభవధురంధరా ॥నిం॥

నిరుపమప్రజ్ఞానజ్యోతివి ♦ నీవు భక్తవశంకరా

దరిసి నీపయి వలచి వాలు ప ♦ తంగమేను మనోహరా ॥నిం॥

నీవు పరమానందపూరిత ♦ నీరదము సంపత్కరా

నేవివేషము విరాజనా [illegible] ♦ నెమిలి మునివరగోచరా ॥నిం॥

కాంతమినుమును డాసిముగ్గెను ♦ కిరణికరుణాసాగరా

చెంతఁ జేర్చి ముదంబుగూర్పుము ♦ చిత్తజలరుహ భాస్కరా ॥నిం॥

నీరువీడిన చేపకైవడి ♦ నిన్నువీడి తపించితిన్

నేరమెంచకు నన్ క్షమింపుము ♦ నిఖిలవిమలగుణాకరా ॥నిం॥

చాతకంబను వేచినాఁడను ♦ స్వామి నేనొకచినుకుకై

ప్రీతిఁగురియుము పూర్ణవర్షము ♦ ప్రియతమామృత జలధరా ॥నిం॥

12 కల్యాణి - ఆదితాళము.

దినమిది సుదినముకాదా

పల్లవి

దినమిది సుదినముకాదా

కనుఁగొని నినుమది ♦ గానము చేసెదు ॥దిన॥

ఘనులగు నీభక్త ♦ జనములఁగూడి

మునినుతసనుఁగూర్చి ♦ ముచ్చటలాడెదు ॥దిన॥

కనికరమెదలోఁ ♦ గరఁగిపాఱఁగా

ననదలకష్టము ♦ లన్నియుఁ దీర్చెదు ॥దిన॥

ధీరతనీయాజ్ఞఁ ♦ దీరిచిపొల్చెదు

వీరుల చరితము ♦ వినిహర్షించెదు ॥దిన॥

కళలఁదేరి స ♦ త్కార్యములొనరిచి

విలసిలు బుధులను ♦ వేడ్కమన్నించెదు ॥దిన॥

•నీదయఁ గల్గిన ♦ నిఖిలబాంధవుల

నాదరించి ముద ♦ మందుచునుండెదు ॥దిన॥

13 కాంభోజి - ఛాపు

ఓనాథ నీగుణ మొకయింత తెలిసిన ♦ వానిజన్మమెజన్మము
మానసముప్పొంగి ♦ మేనుపులకరించి
యానందాశ్రుపులొల్క ♦ నారంభమగు దేవా ॥ఓనాథ॥

జ్ఞానము కరుణయు ♦ న్యాయముపక్షిల్లఁబూనుధర్మవ్రతము
మానావమానముల్ ♦ మదిని దలంపక
తానునీయాజ్ఞకై ♦ తన వెల్లనర్పించు ॥ఓనా॥

ఎన్నికీడులుమూడి తన్ను బాధించిన ♦ నన్నివిడువఁగల్గిన
నిన్నదలోనెంచి ♦ నీయాజ్ఞ పాలించుఁ
దన్ను నిరతముఁగాచు ♦ తండ్రినీవెయంచు ॥ఓనా॥

సత్యమెనమ్ముచు సత్యమెపల్కుచు ♦ సత్యమెయాచరించు
నత్యంతభక్తితో ♦ నన్నిటనినుఁజూచి
నిత్యానందములోన ♦ నిరతమోలలాడు ॥ఓనా॥

దీనులయాపదల్ దీర్పంగసమకట్టి ♦ నానాబాధలుపడును
ప్రాణమున్న వఱకుఁ ♦ బరులకుఁదోడయి
తాను జీవనయాత్ర ♦ ధన్యముగాసల్పు ॥ఓనా॥

14 కాఫి - ఛాపు

వారికృతార్థులు ♦ వసుమతిలోస్వామి
కూరిమితోనిన్నుఁ ♦ గొల్చుచునుండెడు ॥వారి॥

దూరినదారుణ ♦ దుఃఖములోదవిన
ధీరతనీయాజ్ఞఁ దీరిచిపొల్చెడు ॥వారి॥

విబుధులఁజేరి ♦ విద్దెలఁదేరి
శుభగుణవంతులై ♦ శోభిలుచుండెడు ॥వారి॥

పరిబలబలాఢ్యులై ♦ భక్తినినమ్రులై
యబలులకెల్లను ♦ నభయమొసంగెడు ॥వారి॥

అంతటనీవని ♦ అన్నియునీదని
అంతయు నీకయి ♦ యర్పణచేసెడు ॥వారి॥

15 మధ్యమావతి - ఆదితాళము.

పతితపావనుఁడవు నీవు ♦ పతితులము మేము
అతులితకృపనుద్ధరింపు ♦ మంచు వేఁడినాము ॥పతి॥

తల్లి నీవు పిల్లలు మేము ♦ దయను జేఁపితనుపుము
ఉల్లమురంజిల్లఁగ నీ ♦ యొడినిడికొని కాపాడుము ॥పతి॥

గురుఁడవీవు శిష్యులు మేము ♦ కోరితిమి సుజ్ఞానము
పరమజ్ఞానదీపముమా ♦ స్వాంతములవెలిఁగింపుము ॥పతి॥

కేవలముమా స్వామినీవు ♦ సేవకులము మేము
దేవనీకు నిష్టమైన ♦ సేవలొనుముఁ బెట్టుము ॥పతి॥

అనుపమసుఖదాతవీవు ♦ యాచకులము మేము
కనికరించి బిచ్చమిడుము ♦ కరము చాఁపినాము ॥పతి॥

ప్రభుఁడవీవు ప్రజలము మేము ♦ భాగ్యమే సౌభాగ్యము
శుభములనంతములు మాపై ♦ సూటిగాగురియింపుము ॥పతి॥

16 బిలహరి - రూపకతాళము.

మొగము నేనెట్లు చూపుదు ♦ పూతచారిత్ర నీకు
అగణితపాపౌఘములను ♦ ఆచరించి యాచరించి ॥మొగ

సుగుణరాశివైన నీదు ♦ సుగుణములను దలంచియైన
తగని చెడపనులనుండి ♦ తలగకుండనుండియుండి ॥మొగ॥

ఎట్టివారికట్టిఫలము ♦ లిత్తువంచుఁ దెలిసి తెలిసి
గుట్టుగుట్టుగాన వెన్కో ♦ కూళపనులఁ జేసి చేసి ॥మొగ॥

పగల మెప్పుబడయుటకే ♦ పాపపనులు చూడ రేగాని
పరమపురుష నీవుమెచ్చు ♦ పనులఁ జేయకుంటినే ॥మొగ॥

దేవనీనివాసమయి ♦ తేజరిల్లు డెందమును
కేవలము శ్రాంతలకును ♦ గృహము చేసి చెఱచి చెఱచి ॥మొగ॥

పరమస్వర్గధామమయి ♦ భాసిలు సంసారమును
నరకముగాఁ జేసికొంటి ♦ సాక్షి నీవు నాజ్ఞదాఁటి ॥మొగ॥

17 కమాచ్ - ఛాపు

ఎంతయుఁదగుననురా! ఈశ్వర! శిక్ష

కెంతయుఁ దగుఁదునురా

ఇంతైన పుణ్యము ♦ నేఁజేయఁగనైతి

సంతతముననుష్ట ♦ చర్యలజరిపితి ॥ఎంత॥

అంతమెలేదునా ♦ యపచారకోటికి

నెంతదండించిన ♦ నీశ్వర! నినుదూర ॥ఎంత॥

ఎందఱినో నిం ♦ దించినవాఁడను

గందును సుఖమని ♦ కడుస్వార్థపరుఁడనై ॥ఎంత॥

మోక్షమునకు శిక్ష ♦ మొట్టమొదటిమెట్టు

శిక్షయెతగుమందు ♦ చిత్తశుద్ధికి ముందు ॥ఎంత॥

18 భైరవి - ఆదితాళము.

ఆపద్బాంధవ ♦ అతులదయార్ణవ
ప్రాపుసేవని నీ ♦ పాలఁబడితి దేవ ||ఆప||

పాపములెన్నెన్నో ♦ పలుమఱు సలిపితిఁ
దాపములను బడి ♦ తల్లడిల్లితిని
గోపము చూపకిఁకఁ ♦ గూర్మితో నేలుము
పాపములను బాపు ♦ పరమపావనరూప ||ఆప||

ఘోరదుష్కృతములు ♦ కోటులుచేసితి
వీరభక్తుఁడనని ♦ వేసము వేసితిఁ
గోరఁగూడనియట్టి ♦ కోర్కెల్కఁగోరితి
నేరీతిఁజూపెదో ♦ యీశ్వరనీదయ ||ఆప||

పంచభూతమ్ములఁ ♦ బ్రాణేంద్రియముల
నంచితబంధుల ♦ నాహారాదుల
వంచకునకు నాకు ♦ వరముగనిడితివి
ఎంచగదరమౌనె ♦ యీశ్వరనీకృప ||ఆప||

ఎన్నియొకరుణించి ♦ యిచ్చినదానిని
నెన్నకయింకను ♦ నియ్యలేదనుచు
నిన్ను నిందించిన నీచాతి ♦ నీచుఁడను
నన్ను శిక్షించెదో ♦ నాథరక్షించెదో ||ఆప||

19 శుద్ధసావేరి - ఆదితాళము.

ఇఁకనిను విడువను ♦ ఏమయినను గాని
ప్రకటితముగ నీవె ♦ ప్రభుఁడని దెలిసెను ||ఇఁక||
చకచకనీ నెపు ♦ చంద్రసూర్యాదులు
సకలచరాచర ♦ సహితలోకమ్ములు
ప్రకటముగాయునింగోఁ ♦ బ్రబలుచున్నావను
అకలంక తేజసి ♦ యుండెలయుచును ||ఇఁక||
అతులితసుఖముల ♦ నలరఁగఁజేసి
మతికిఁజోద్యమ్ముగ ♦ మహిమలఁజూపి
హితముల నెంతయు ♦ నెలమితోఁదెల్పి
సతతముఁబ్రోచెదు ♦ జనకవి నీవు ||ఇఁక||
దోసముచేసి నీకు ♦ దూరమైపోయిన
గాసిలి హాయని ♦ కరములుమోడ్చిన
దాసులఁజేరఁదీసి ♦ తప్పులక్షమియించి
త్రాసముదీర్చెదు ♦ తండ్రివి నీవు ||ఇఁక||
అందఱు విడనాడి ♦ యరిగెడునప్పుడు
కొందలమంది మది ♦ కుందెడునప్పుడు
డెందము నిరాశతో ♦ డిందెడునప్పుడు
కుందని యుత్సాహము ♦ కూర్చెడు సఖుఁడవు ||ఇఁక||

20 ధన్యాసి ◆ రూపకతాళము.

ఎన్నికష్టమ్ముల ◆ నీశ్వర నేఁబడి
నిన్నువిడువను నే ◆ నీవిఁక ॥ఎన్ని॥

కన్నతల్లిపిలుపఁజేఁగ ◆ గాసి వానెననీతి
నిన్నుఁజేరిన నా ◆ కన్నిబాధలుదీఱు ॥ఎన్ని॥

కన్నవారలనెల్లఁ ◆ గన్నవాఁడవు నీవు
ఎన్న నీకన్నను ◆ నెక్కుడెవ్వరురా ॥ఎన్ని॥

ఎప్పుడు లోపల ◆ నేకాంతముగనెంచి
తప్పులొప్పులఁ దెల్పు ◆ తండ్రివిగదరా ॥ఎన్ని॥

నాలోనుండు నీవు ◆ నీలోనుండు నేను
సలీలఁజూడ న ◆ న్నేలువాఁడవు నీవె ॥ఎన్ని॥

ఖేదమెకానిర ◆ మోదమెకానిర
యేదైననేమిర ◆ నీదయకదరా ॥ఎన్ని॥

21. మోహన - ఆదితాళము.

అంత నీదయరా ♦ అఖిలోద్ధార ♦ అంత నీదయరా
చింతలు నీదయ ♦ చిత్తము నీదయ
వింతలు నీదయ ♦ విత్తము నీదయా ||అంత||
జనకుఁడు నీదయ ♦ జననియు నీదయ
జననమరణ ♦ సంసారము నీదయ ||అంత||
శత్రువు నీదయ ♦ మిత్రుఁడు నీదయ
పుత్రుఁడు పుత్రిక ♦ క్షేత్రము నీదయ ||అంత||
గాలియు నేలయు ♦ గగనజలాగ్నులు
కాలము దేశము ♦ కష్టము నష్టము ||అంత||
భావము నీదయ ♦ భాషయు నీదయ
పావనతరమగు ♦ ప్రాణము నీదయ ||అంత||

22. భైరవి - ఆదితాళము.

వెదకివెదకినా ♦ హృదయములోపలి
మదాదిరిపులను ♦ వధింపరా తండ్రి ! ||వెదకి||
త్వదీయశరణమె గ ♦ దా మదాత్మకు
సుఖంబు నొసంగును ♦ సదాదయానిధి ||వెదకి||
నిరంతరమునన్ ♦ దురంతచింతలు
గరంబుఁగాల్చెను ♦ భరింపలేనిఁక ||వెదకి||

పరాత్పరా నిను ♦ నిరాటంకముగ
స్మరించుటకు నవ ♦ సరంబు దొరకదుర ॥వెదకి॥
స్మరించి నిన్నును ♦ సరించినీతిని
జరించి భవములఁ ♦ దరింపఁజేస్తును ॥వెదకి॥

---

23. ఆనందభైరవి - చాపు.

ఆనందామృతము నీ ♦ యాత్మలో బ్రవహింప
నందు నీమది ముంపవేల ♦ ముంపవేల?
మానసేంద్రియములఁ ♦ మంచిత్రోవకుఁద్రిప్పి
ప్రాణేశుదయఁగాంచవేల ♦ కాంచవేల? ॥ఆనం॥
దానముగా నెన్నో ♦ దైవము దయసేయ
దీనులకును నియ్యవేల ♦ నియ్యవేల?
మానవకోటికి ♦ మానము దెచ్చెను
మానవాంతులఁగూడవేల ♦ కూడవేల? ॥ఆనం॥
భావములో పలఁ ♦ బరితాపాగ్ని నిగోల్పి
పాపములను గాల్పవేల ♦ కాల్పవేల?
పావనమూర్తిని ♦ వరశుభకీర్తిని
భక్తిమీరఁగఁ బాడవేల ♦ పాడవేల? ॥ఆనం॥
నమ్మఁగూడనివారి ♦ నమ్మి ధర్మమ్మును
నమ్మచేయుచునుండవేల ♦ ఉండవేల?
నెమ్మదింగ విభు ♦ నమ్మినవారికే
నెమ్మదియని నమ్మవేల ♦ నమ్మవేల? ॥ఆనం॥

24. కల్యాణి - చాపు.

రమ్మీ నాహృదయమ్మును ♦ బారిజేశ గై
కొమ్మీ నీగృహముగను
నెమ్మి నీకయినేను ♦ నిరతము వేచితి
నమ్మి చేయకు ♦ నా వాంఛితార్థమునిమ్మీ ॥రమ్మీ॥

శాంతినికేతనమా ♦ సర్వోత్తమ
సుంత నీదయకల్గిన
వింతగ సద్గుణ ♦ వితతిచే నొప్పారి
స్వాంతము పరిపూర్ణ ♦ స్వర్గధామంబగు ॥రమ్మీ॥

సర్వేశ్వర శ్రీకర ♦ సర్వాధార
సర్వసద్గుణసాగరా
సర్వము లోపల ♦ స్వామి నీమహిమన
సర్వదా చూచెదు ♦ శక్తినియ్యవె చాలు ॥రమ్మీ॥

ఎన్ని సుఖములఁగూర్చితో యెలమిని నాకు
నెన్న శక్యమె యీశ్వరా
సన్నుతింపఁగనేర ♦ స్వామి నీకరుణను
మన్న మస్కృతులివె ♦ మన్నించికొనవే ॥రమ్మీ॥

25. కళావతి - ఆదితాళము.

నన్నుఁగన్నతండ్రి ♦ నన్ను [illegible]

నిన్నుఁ గాని గతిగా ♦ నెన్న నెవ్వరిని ||నన్ను||

ఎన్ని కష్టములు ♦ నున్న నిన్ను మఱి

నెన్నికొల్చుభక్తి ♦ నిచ్చి కావవే ||నన్ను||

అలుక లేనియట్లు ♦ యెపుడుఁడంచు నిన్నుఁ

బలుకుచుండ భక్తి ♦ వరులు వింటినే ||నన్ను||

పాపజాలములు ♦ పట్టిలాగు వేళ

కాపువై నన్నుఁ ♦ బట్టి ప్రోవవే ||నన్ను||

సుగుణరాశివౌ ని ♦ సుతుఁడనౌట యెఱిఁగి

తగినరీతి మెలఁగు ♦ దారిఁజూపవే ||నన్ను||

26. శహానా - ఛాపు.

ప్రభునిమఱచితివేల ♦ పాపపుమనసా
శుభదృష్టితో నిన్నుఁ ♦ జూచునుగదవే ||ప్రభుని||

విభుదయ లేకున్న ♦ విశ్వములోన
విభవములెవ్వైన ♦ విలసిల్లగలవె ||ప్రభుని||

నీపుట్టుకమున్నె ♦ నీకును దయతోఁ
గావలసినవెల్లఁ ♦ గల్పించెఁగదవే ||ప్రభుని||

శరణని యాప్రభు ♦ మఱుఁగునఁ జేర
దరిలేని దుఖాబ్ధి ♦ దాఁటించుఁగదవె ||ప్రభుని||

తలఁపులో పలనుండి ♦ ధర్మమెచూపి
పలు తెఱఁగుల నిన్నుఁ ♦ బాలించుఁగదవె ||ప్రభుని||

కరుణాదిసద్గుణ ♦ గణమణిఖనివై
పరిపరివిధముల ♦ భాసిల్లుఁగదవె ||ప్రభుని||

27. తోడి - ఝాపు.

ఏలా నిరాశ? ఈశ్వరుఁడుండ ఏలా నిరాశ?

పాలించు నినునతఁడు ♦ భయపడకుము మనస ॥ఏలా॥

లీలతో జగముల ♦ నేలుచుండియునతఁడు

నీలోనే యున్నవాఁడు ♦ నినువిడువఁడు ॥ఏలా॥

పతితపావన బిరుదు ♦ పడసినవాఁడతఁడు

అతనికంటెను హితుఁ ♦ డన్యుఁడెవ్వఁడు లేఁడు ॥ఏలా॥

సుఖదుఃఖముల వంకఁ ♦ జూచుచుందువ దేల

సఖుని నాతనిఁగొల్వ ♦ సర్వము సుఖమగు ॥ఏలా॥

అన్ని జాతులవారి ♦ నన్ని మతములవారి

నన్ని స్థితులవారి ♦ నరసిరక్షించును ॥ఏలా॥

28. ముఖారి - ఆదితాళము.

నిఖిలజగము లేలుతేఁడు ♦ నిన్ను నేలకుండునా?
నిఖిలమెఱుఁగు సర్వసాక్షి ♦ నిన్ను నెఱుఁగకుండునా ?
॥నిఖిల॥

నిఖిలజీవరక్షకుండు ♦ నిన్నుఁ గావకుండునా?
నిఖిలభువననాయకుండు ♦ నిన్ను నడుపకుండునా? ॥నిఖిల॥

నిఖిలమతనికి నప్పగింప ♦ నిన్ను మెచ్చకుండునా?
నిఖిలమతని దయ యేయనిన ♦ నీకు దుఃఖముండునా ?
॥నిఖిల॥

నిండియంతటనుండువాఁడు ♦ నీలో నుండకుండునా?
నిండుమదినినతనిఁగొల్వ ♦ నీకు లోపముండునా? ॥నిఖిల॥

29. జంఝూటి - ఆదితాళము.

వదలి కుమార్గము ♦ వరమార్గమ్మున
వర్తిలుచుండవె ♦ యోమనసా
సదమలభక్తిని ♦ స్వామినిగొలుచుచు
సౌఖ్యములందవె ♦ యోమనసా ॥వదలి॥
పరులసుఖమునే ♦ పాటించుచుభువిఁ
బనులొనరింపవె ♦ యోమనసా
దురితదవాగ్నిని ♦ దూరుచుఘోరపు
దుఃఖములందకె ♦ యోమనసా వదలి॥
సత్యమె సర్వ ♦ శ్రేయస్కరమని
సతతమెఱుఁగవె ♦ యోమనసా
సత్యవ్రతమును ♦ సలిపెడువప్పుడె
శౌర్యముఁజూపవె ♦ యోమనసా ॥వదలి॥
న్యాయమె స్వర్గ ♦ ప్రాయముజగతిని
నమ్ముము ధృఢముగ ♦ నోమనసా
న్యాయముదప్పిన ♦ నరకంబుగభువి
నాఁడేమాఱునె ♦ యోమనసా ॥వదలి॥
సుగుణరత్నముల ♦ సొగసుగఁదాలిచి
శోభిలుచుండవె ♦ యోమనసా
అగణితగుణర ♦ త్నాకరుఁడగు పర
మాత్ముయె శరణము ♦ వినుమనసా ॥వదలి॥

30 మధ్యమావతి - ఆదితాళము.

మరి రాదుర యీ ♦ మానుషజన్మము
పరమపురుషుకృప ♦ వలననె కలిగెను ॥మరి॥

పరమేశుని వౌ ♦ పరమాద్భుతముల
దర్శనమొనరింపఁ ♦ దగుయంత్రంబిది ॥మరి॥

పరిపరివిధములఁ బరులకు హితములఁ
దలఁచిసేయ సౌ ♦ ధనరాజమ్మిది ॥మరి॥

ఘనసద్గుణమణి ♦ గణము గడింపఁగ
మనకు లభించిన ♦ మహితధనమ్మిది ॥మరి॥

దేవుని జేర్పఁగ ♦ జీవుని గొని చను
దేవచ్ఛత్రమా ♦ దివ్యరథంబిది ॥మరి॥

కాని దీనిఁ జెడు ♦ కార్యములం దిడు
వానిజన్మ మిల ♦ వ్యర్థము వ్యర్థము ॥మరి॥

31 పంతువరాళి - చాపు.

ప్రాతఃకాలం బయ్యో ♦ భక్తులారా లెండు
చేతుల జోడింతము ♦ శ్రీకరుఁదలఁచి ♦ చేతులజోడింతము ॥ప్రా॥

రాతిరి యేకీను ♦ రాకుండ రక్షించి
ప్రీతి నెంతయుఁ జూపెను ♦ ప్రియతమవిభుఁడు
ప్రీతినెంతయుఁ జూపెను ॥ప్రాతః॥

బడలియుండినమన ♦ యొడలికి బలమును
గడుదయ నొడఁగూర్చెను ♦ కరుణానిధి
కడుదయనొడఁగూర్చెను ॥ప్రాతః॥

సందమందమ్ముగ ♦ మారుతమ్మును గొల్వ
నందఱ లేపంగను ♦ ఆనందజలధి ♦ యందఱ లేపంగను॥

ఇంపుగఁ గూయుచు ♦ హెచ్చరికలు దెల్పఁ
బంపెఁ బిట్టలగుంపుల ♦ ప్రాణేశుఁడు ♦ పంపెఁ బిట్టలగుంపుల॥

చిమ్మచీఁకటి ముగ్గి ♦ చెన్ను దప్పినభువిని
గ్రమ్మఱ వెలఁగించెను♦కమనీయకీర్తి ♦ క్రమ్మఱవెలిఁగించెను॥

చేతనాత్మకములై ♦ చెలఁగంగఁజొచ్చెను
భూతజాలములెల్లను ♦ భువనేశుదయను ♦ భూతజాలములెల్లను॥

ఆలసింపకుఁ డింక ♦ ఆప్తులారా లెండు
ఆలించి సేవింతము ♦ ఆప్రభునాజ్ఞ ♦ ఆలించి సేవింతము॥ప్రా॥

32 కురంజి - ఆదితాళము.

సంజ యెంతయు మంచి ♦ సమయము కాదా
ప్రాంజలిఁ గూర్చి ప్రభు ♦ ప్రార్థన సలుప ॥సంజ॥

మంజులఘోషిణి ♦ గానసకల్మష
భంజను భక్తజన ♦ రంజనుఁ బొగడ ॥సంజ॥

శాంతుఁడై రవి యస్త ♦ శైలపీఠముఁ జేరి
శాంతి గొల్పునుగద ♦ స్వాంతములందు ॥సంజ॥

పంకజాతమ్ములు ♦ భక్తిని దల వంచి
సంకటహారునకు ♦ సలుపు నమస్కృతి ॥సంజ॥

చుక్కలు నింగిపై ♦ నెక్కి యుప్పొంగుచు
మక్కువతో విభు ♦ మహిమను జాటు ॥సంజ॥

మాని గొదలు పక్షుల్ ♦ మౌనముతో విభు
ధ్యాన మొనర్చును ♦ దమతమగూండ్ల ॥సంజ॥

కామక్రోధాదులు ♦ గర్వ ముడిగి మన
స్వామిని సేవింప ♦ సాయపడునుగద ॥సంజ॥

33 హిందూస్థానిభైరవి - రూపకము.

విశ్వవిభునిధ్యానము ♦ విమలముక్తిసోపానము
శాశ్వతసుఖసంధానము ♦ సకలఋషివిధానము ॥విశ్వ॥

కామక్రోధలోభముల్ ♦ కఠినశత్రుజాలముల్
నేమముతో వాని నడుప ♦ నిజము చెదరు దురితముల్ ॥విశ్వ॥

చిత్తమం దసూయ పుట్టి ♦ చిచ్చుగాల మండకుండ
నుత్తమశాంతస్వభావ ♦ మూనియుండుము నిరతము ॥విశ్వ॥

మిత్రదృష్టితోడఁ బ్రాణి ♦ మాత్రి మెప్పుడు చూడుము
పాత్రవర్తన గల్గి జీవన ♦ యాత్ర సలుపఁగడఁగుము ॥విశ్వ॥

జగము నద్భుతంబుగా ♦ సలిపి యేలువానికంటె
జగతి నధికుఁ డెవఁడు లేఁడు ♦ శరణ మతనిఁ బొందుము ॥విశ్వ॥

34 కన్నడ - ఛాపు.

అతనిఁ గన్గొనరే

అతులితసుఖరూపు ♦ నంతర్యామిని ॥అతని॥

మితిలేనిశుభముల ♦ సతతము వర్షించు

పతిని సర్వోత్తముని ♦ భక్తవత్సలుని ॥అతని॥

పలువిధములసూక్ష్మ ♦ పరమాణువులఁ గూర్చి

బలుసొంపునింపుప్ర ♦ పంచము చేసెను ॥అతని॥

జగతిలోపలిజంతు ♦ జాలము వర్ధిల్ల

తగినయాహారముల్ ♦ దయతో నొసంగెదు ॥అతని॥

జీవులకోటికల్ ♦ చెల్లింప సమకట్టి

కేవలాద్భుతదేహ ♦ గృహము లొసంగెను ॥అతని॥

నిర్మలధర్మముల్ ♦ నిరతము కాపాడు

ధర్మాత్ములకెల్ల ♦ ధైర్యము నొసంగెను ॥అతని॥

35 బేహాగ్ - ఆదితాళము.

భజింపుఁ డతని సదా ♦ భవాబ్ధి సుఖముగఁ దరింపఁగోరిన

భజింపుఁ డతని సదా

నిజానుచరులను ♦ నిరంతరంబును

దృజింప కరసెను ♦ దయాస్వరూపుని ॥భ॥

చరాచరంబుల ♦ జగద్గణంబుల

భరించుచుండెను ♦ పరిభూత్తమోత్తము ॥భ॥

మునీంద్రనిర్మల ♦ మనోంబరంబున

ఘనంబుగా వెల్గు ♦ దినేంద్రమూర్తిని ॥భ॥

అనంతసుఖముల ♦ ననంతజీవుల

కనుగ్రహించెను ♦ ననంతమహిముని ॥భ॥

36 హిందూస్థానిభైరవి - ఛాపు.

నేఁడు మనమందఱము కూడి
పాడుదము పరమేశుని
ఈడు జగమున లేక యంతట
హెచ్చి వెలిఁగెడుజ్యోతిని ॥నేఁడు॥

కందరమ్ముల మందిరమ్ముల ♦ గహనపర్వతసీమల
సుందరధ్వనితోడ యోగులు ♦ స్తుతియొనర్చెడు దేవుని ॥నేఁడు॥

చెట్టుచెట్టునఁ గాననంబునఁ ♦ జెలఁగుమధురరుతంబులఁ
బిట్టలెవనిని బాడుచుందురొ ♦ ప్రీతిసాగరు నాతని ॥నేఁడు॥

నూతులందును చెఱువులందును ♦ లోఁతు తెలియని జలధిలో
శీతజలమును ద్రావి కీర్తన ♦ చేయు జలచరమాతని ॥నేఁడు॥

ఉత్సవంబుల నుల్ల మలరఁగ ♦ నువిద లెవ్వనిఁ బాడుచు
నుత్సహింతురొ యాదయామయు ♦ నుత్తమోత్తమపురుషుని.

శూరులును పేరాతివీరులు ♦ శుద్ధహృదయాంబుజముల
సారెసారెకు నెవనిఁ దలఁతురో ♦ సత్స్వరూపుఁబరేశుని ॥నేఁడు॥

37 శుద్ధసావేరి - ఛాపు.

సేవింతము రండు ♦ దేవదేవేంద్రుని
కేవలానందనిధిని ♦ కైవల్యధనుని ॥సే॥

ఏవంకఁ జూచిన ♦ నావంక నావిభు
పావనచిహ్నములె ♦ భాసిల్లుచుండును ॥సే॥

భావించి యాప్రభు ♦ భవ్యగుణమ్ముల
సేవించువారికిఁ ♦ జింతలెల్ల నుడుగు ॥సే॥

చండసూర్యుఁడు గూడ ♦ సన్నమిణుఁగురుఁ బోలు
నిండారువిభునిప్ర ♦ చండతేజముముందు ॥సే॥

పూర్ణ చంద్రుఁడు గాజు ♦ ముక్కయైనను దగఁడు
పూర్ణుఁడౌవిభునిసం ♦ పూర్ణకీర్తికి ముందు ॥సే॥

ప్రభ దప్పి తుంపరల్ ♦ పగిదిఁ దోఁచును నదుల్
విభునిదయామృత ♦ విమలపూరముముందు ॥సే॥

38 మధ్యమావతి - ఛాపు

రండు మనహృత్పీఠమున బ్రహ్లాదనాథుండు
నిండుకొలువుండంగ వచ్చెను లెండు లేలెండు ॥రండు॥

సుగుణమణిగణతోరణంబుల సుందరంబుగఁ గట్టఁడు
నెగడు పరమోత్సాహధ్వజమును నింగి ముట్టఁగ నిల్పెఁడు॥

భవ్యతరముగ నెప్పుడయయను పట్టుగొడుగును బట్టెఁడు
దివ్యవిజ్ఞానప్రదీప్తులఁ దేజరిల్లఁగఁ జేయుఁడు ॥రండు॥

శాంతిసత్యము లనెడు తెల్లని చామరంబుల వేయుఁడు
చెంత దుర్గుణగణము లెవ్వియుఁ జేరకుండఁగఁ దఱుముఁడు॥

వినుతు లనియెడు విరులవానను విరివిగాఁ గురియింపుఁడు
ఘనతరంబుగఁ గ్రొత్తభక్తిని గానగా వర్షింపుఁడు ॥రం॥

39 బేహాగ్ - ఆదితాళము.

పరమపితా మా ♦ ప్రార్థన వినరా
పాపములోఁ బడ ♦ నీయకురా
శరణాగతర ♦ క్షకుఁడని నిన్నే
శరణువొచ్చితిమి ♦ విడువకురా ॥పరమ॥

పరులను మావలె ♦ భావించెడు మదిఁ
బరమాత్మా మా ♦ కొసఁగుమురా
నిరతము నంతట ♦ నీమహిమలఁ గను
నిరుపమవిద్యను ♦ నేర్పుమురా ॥పరమ॥

నీయాజ్ఞలనే ♦ నెఱవేర్పఁగ మది
నిర్మలభక్తిని ♦ గొలుపుమురా
న్యాయసత్యకరు ♦ ణాలయ మాలో
నద్భుతనాట్యము ♦ సల్పుమురా ॥పరమ॥

శాంతిధామ మా ♦ స్వాంతమునందలి
చింతల నీ వెగఁ ♦ జిమ్ముమురా
అంతరంగ మను ♦ నరవిందము నీ
కెంతయుఁ బ్రీతిన ♦ ర్పింతుమురా ॥పరమ॥

40 అఠాణా - ఛాపు.

బుద్ధిపై పొరఁదీయరా ♦ భువనేశ్వర ♦ బుద్ధిపై పొరఁదీయరా
శుద్ధమగునీసత్స్వరూపముఁ ♦ జూచి చూచి కృతార్థులగుదుము
శ్రద్ధతో నీసేవఁగొనరిచి ♦ శాశ్వతానందమ్ముఁగాంతుము॥బు॥

భక్తిభిక్షము పెట్టరా ♦ ప్రాణేశ్వర ♦ భక్తిభిక్షము పెట్టరా
సక్తిమీఱఁగఁ బాపచయములఁ ♦ జక్కఁగాఁ జెండాడి వైతుము
రక్తితో మాహృత్పురంబును ♦ రాజధానిగ నీకు నిత్తుము ॥భ॥

దయను మాపయిఁ గురియరా ♦ దయాకర
దయను మాపయిఁ గురియరా

దయను మాపయి నీవు గురిసినఁ ♦ దాపములు చల్లారిపోవును
రయముగా హృత్క్షేత్రములస ♦ ద్రమ్యగుణముల పంటపండును॥

ఐకమత్యముఁగూర్పరా ♦ అఖిలాధారా♦ఐకమత్యముఁగూర్పరా
లోకమంతయునీకుటుంబము ♦ లోనిదే యని తెలిసి మెలఁగుచు
నీకటాక్షముచేత వర్ధిలి ♦ నిఖిలసుఖములఁబడయుచుందుము॥ఐ॥

41 బేగడ - ఆదితాళము.

కనుఁగొంటిని ♦ కనులపండువుగాఁ గనుఁగొంటిని
కనికరంపుగనివై ♦ కాంచుచుండు నిను ॥కను॥

జనన మిచ్చి ప్రీతి ♦ స్తన్యపాన మొసఁగి
మనిచినట్టినాఁడు ♦ మాతయందు నిన్ను ॥కను॥

నయభయమ్ములచే ♦ నాహితమ్ము కోరి
దయను జూపినట్టి ♦ తండ్రియందు నిన్ను ॥కను॥

మఱవరానిసీదు ♦ మహిమ లెన్నొ నాకుఁ
గరుణఁ దెల్పినట్టి ♦ గురునియందు నిన్ను ॥కను॥

మాయ లేనితనము ♦ మాకుఁ జూపుటకును
నీయొసంగినట్టి ♦ నిసుపులందు నిన్ను ॥కను॥

చింత నున్నవేళఁ ♦ జెంతఁ జేరి నాకు
సంతసమ్ము నిడిన ♦ సఖులయందు నిన్ను ॥కను॥

42 నారాయణి - ఛాపు.

కరుణామృతపూరమా ♦ పరంధామ

కరుణామృతపూరమా

శరణు చొచ్చినవారిపాలికి ♦ నరయ సుందరపారిజాతమ

పరమసుగుణసముద్రమా మునివరులకునునినుబొగడఁదరమా

సర్వేశ్వర శ్రీకర ♦ సర్వాధర ♦ సర్వేశ్వర శ్రీకర

సర్వదుర్గుణములకు లోఁబడి ♦ గర్వమునఁ గనుగానకుండెడు

దుర్వినీతులఁ బట్టి దిద్దెడు ♦ సర్వశక్తుఁడ వీవె దేవర ॥సర్వే॥

న్యాయపాలనభూషణ♦అన్యాయశోషణ♦న్యాయపాలనభూషణ

న్యాయమునవర్తించువారల ♦ కేయమేయసుఖంబులొసఁగుదు

న్యాయమునుబ్రకటించుసుజన ♦ ధ్యేయనిరుపమపరమపావన॥

సత్యవ్రతధారక ♦ శాంతిప్రసారక ♦ సత్యవ్రతధారక

నిత్యసుఖధర్మప్రచారక ♦ నిరుపమానందైకకారక

సత్యదీక్షాచరణపూరక ♦ సాధుతాపత్రయనివారక ॥సత్య॥

43 కాఫి - ఛాపు.

తామసమేల స్వామి ♦ తనయునినేలవేమి
నామొఱవినవేమి ♦ నాగతియేమి ॥తామ॥

వేమఱువేఁడిన ♦ వెక్కసేనేడ్చిన
నీమదికెక్కదేమి ♦ నేరమదేమి ॥తామ॥

అందఱనాదరించు ♦ నతికృపామతివని
యందరుపల్కుట ♦ యనృతమయేమి ॥తామ॥

ఎందఱనోయుద్ధ ♦ రించినవాఁడవె
అందఱికంటెను ♦ నధముఁడనాయేమి ॥తామ॥

దిక్కునీవేయంటి ♦ దీనుఁడనేనంటి
నక్కటనన్నువిడ ♦ నాడకుమంటి ॥తామ॥

44 బేహాగ్ - ఆదితాళము..

దరిసెన మియ్యరా ♦ ధన్యులఁ జేయరా
పరమదయాకరా ♦ పాపనివారా ॥దరి॥

భక్తకర్ణామృతము.

మముఁ గృపఁజూడరా ♦ మా మొఱ వినరా
సుమనోమనోహరా ♦ శుద్ధవిచారా ॥దరి॥
రార మామదిదొర ♦ రాజ్యము సేయరా
కోరికల్ మితిమీర ♦ కొల్లగఁబొసఁగుమరా ॥దరి॥
చింతలఁ దీర్పరా ♦ చిత్తాబ్జభాస్కరా
సంతాప మార్పరా ♦ శాంతిసుధాకరా ॥దరి॥

---

45. మోహన - ఆదితాళము.

నిరుపమానందము ♦ నిజముగఁ గలును
పరమపురుషుసేవ ♦ భక్తితో సల్పిన ॥నిరు॥
దురితములెల్లను ♦ దూరమైపోవును
కరుణాదిసద్గుణ ♦ గణము లభించును ॥నిరు॥
పలుకులఁ దేనియ ♦ లొలుకఁ దొడంగును
తలఁపుల నొకవింత ♦ తెలివి చెలంగును॥ ॥నిరు॥
వదనము తేజో ♦ వంతమై యొప్పును
పొదలుదేహమునిండఁ ♦ బులకలు పొడమును ॥నిరు॥
చూపుల నమృతంపు ♦ సోనలు గురియును
అపరమేశుఁడై ♦ యంతటఁదోచును ॥నిరు॥

46. కాంభోజి - రూపకతాళము.

జయదేవా జయదేవా ♦ జయ త్రిభువనకర్తా
ప్రభు జయ త్రిభువనకర్తా
జయ సర్వార్థప్రియదాతా ♦ భయసంకటహర్తా ॥జయ॥
నీమహిమను కొనియాడును ♦ నిఖిలచరాచరతతులు
ప్రభు నిఖిలచరాచరతతులు
నీముందటఁదలవంతురు ♦ నిఖిలోర్వీశులుప్రజలు ॥జయ॥
వర్ణింపఁగఁ దరమే నినుఁ ♦ బరమదయాకరమూర్తి
ప్రభు పరమదయాకరమూర్తి
పూర్ణముగా వెలుఁగొందును భువి ♦ దివినీశుభకీర్తి ॥జయ॥
చేతనము లచేతనమును ♦ వెలుఁగుదు వంతటను
ప్రభు వెలుఁగుదు వంతటను
బ్రీతిని బహిరంతరముల ♦ వీక్షింతువు సతము ॥జయ॥
నీజ్ఞానమె నలుగడలను ♦ నిగనిగమని వెలుఁగ
ప్రభు నిగనిగ మని వెలుఁగ
సుజ్ఞానులుస్త్రీపురుషులు ♦ చూతురుచోద్యముగ ॥జయ॥
వర్ణింపఁగఁదరమేనీ ♦ పరమాద్భుతశక్తి
ప్రభు పరమాద్భుతశక్తి
చూర్ణముచేయుముగర్వము ♦ సురుచిరశుభసూక్తి ॥జయ॥
అక్షయమగునుత్సాహం ♦ బమరెను నీసేవా
ప్రభు అమరెను నీసేవా
భిక్షముగాఁగోరితి మిదు ♦ ప్రేమాస్పదదేవా ॥జయ॥

47. సురటి - చాపు.

మంగళం మంగళం మా ప్రభునీకు మంగళం మంగళం ॥మం॥

శృంగారమగు సృష్టి ♦ చిత్రముగాఁ జేసి

నింగి నేల నిండి ♦ పొంగి రంగారుచు

తుంగమహిమంబో ♦ వెలింగెడు దేవా ॥మంగళం॥

నీయాజ్ఞ పాలించు ♦ నీతివర్తనులకు

నీయానందమె యిచ్చి ♦ నెఱిఁ బ్రోచినీదు

న్యాయమె ప్రకటించు ♦ మాయయ్య నీకు ॥మంగళం॥

సదమలమగు నీదు ♦ సద్గుణపుంజము

ముదముతో నొదవించు ♦ మదిలోద మాదా

హృదయాబ్జమందున ♦ నుదయించు తండ్రీ ॥మంగళం॥

ఆర్యావర్తప్రశంస.

సీ. రత్నకిరీటమై ♦ రంజిల్లు నెద్దాని
శీర్షభాగంబున ♦ శీతనగము
ఆణిముత్తెమ్ముల ♦ హారమై యెద్దాని
కంఠాననొప్పు గం ♦ గాభవాని
కమనీయతరమైన ♦ కాంచియై యెద్దాని
కటిఁగ్రాలు వింధ్యన ♦ గంపుఁజాలు
చిత్రచేలంబయి ♦ చెన్నారు దేనిపై
సర్వసస్యాఢ్యయౌ ♦ సారభూమి

గీ. దేనిపదపీఠమై లంక ♦ తేజరిల్లు
వీచికల దేని నిరువంక ♦ వీచు వార్ధి
దేనిసిరి వింతగొల్పు వి ♦ దేశతతికి
నద్దిభూమండలికి రాణి ♦ ఆర్యభూవి.

సీ. కర్ణాదిదాతలఁ ♦ గడు పారఁగాఁగన్న
యతిపూతచరిత యీ ♦ యార్యమాత
సత్యసంధుల హరి ♦ శ్చంద్రాదులనుగన్న
యతిపూతచరిత యీ ♦ యార్యమాత
భీష్మాదిభక్తులఁ ♦ బ్రేమమీఱఁగఁగన్న
యతిపూతచరిత యీ ♦ యార్యమాత
రామకృష్ణాదులి ♦ రవితేజులనుగన్న
యతిపూతచరిత యీ ♦ యార్యమాత

గీ. ధన్యుల శుకాది బ్రహ్మవే ♦ త్తలనుగన్న
యతులపరిపూతచరిత యీ ♦ యార్యమాత
సీత మొదలగు సాధ్వులఁ ♦ బ్రీతిఁగన్న
యతులపరిపూతచరిత యీ ♦ యార్యమాత

సీ. పిడికిన కొలఁదిని ♦ బొదుగు చేపుచునుండు
కామధేనువనంగఁ ♦ గ్రాలినావు
ఆశ్రయించినవారి ♦ కన్ని సౌఖ్యములిచ్చు
నమర భూజమనంగ ♦ నమరినావు
సేవించువారల ♦ చింతలెల్లనుదీర్చు
చింతామణియనంగఁ ♦ జెలఁగినావు
శ్వేతోన్నతంబగు ♦ శీతనగంబేను
నైరావతముచెంత ♦ నలరినావు

గీ. గంగనమృతతరంగను ♦ గాంచినావు
పండువెన్నెలలకు బేఁరు ♦ పడసినావు
స్వర్గమేనీవు నీకంటె ♦ స్వర్గమున్నె?
యఖిలసుగుణగణోపేత! ఆర్యమాత!

సీ. వివిధసంపదలచే ♦ వింతగా విలసిల్లి
శ్రీమహాలక్ష్మివై ♦ చెలఁగినావు
వివిధభావలచేత ♦ వింతగా విలసిల్లి
యలసరస్వతివయి ♦ యలరినావు
వివిధదృశ్యమ్ముల ♦ వింతగా విలసిల్లి
పార్వతీసతివయి ♦ పరఁగినావు
వివిధవైభవముల ♦ వింతగా విలసిల్లి
మొలమినిందారిణివై ♦ మొసఁగినావు
గీ. పరమసౌభాగ్య వతివయి ♦ ప్రబలినావు
ఇట్టి నీగర్భమందు జ ♦ న్మించినీకు
సేవచేసెడు జన్మమ్ము ♦ శ్రీకరమ్ము
అఖిలసుగుణగణోపేత! ♦ ఆర్యమాత!

గాంధిమహాత్ముఁడు.

(అమెరికా దేశపుఁ గన్యారత్నమగు అంజనామార్గరెట్ దేవిగారి ఆంగ్లగీతము ననుసరించి రచింపఁబడిన గీతమాలిక.)

వందిమాగధపాఠక ♦ ప్రతతిలేదు
తనువుపైఁగవచాదులు ♦ దాల్పలేదు
ఛాంకృతులతోడ ముందేగు ♦ భటులులేరు
చెలఁగు భేరీరవముతోడి ♦ సేనలేదు
ఎన్నఁడు కిరీటముధరించి ♦ యెఱుఁగఁడితఁడు
ఆయుధముఁబట్టి యెఱుఁగఁడు ♦ హస్తమందు
ఇతనియశమను రవిపుట్టి ♦ యిప్పడిపుడె
వెలుఁగుచున్నాఁడు తనదగు ♦ నెలవునందు
క్రమముగ స్వజాతిజయమును ♦ గాంచుకొలఁది
ఈ రవియుఁగూడఁ దనరాజ్య ♦ మేలఁగలఁడు

ప్రీతితో నెన్నఁడేనియు ♦ నూతనముగ
ధర్మము విశేషరూపముఁ ♦ దాల్చినీకుఁ
దోఁపఁగనిదాసి సామాన్య ♦ రూపములను
స్వాంతమున లెక్కసేయని ♦ వాఁడవేని,
ఎన్నఁడైనను రాత్రిమే ♦ ల్కొన్నవేళఁ
బరహితపు దివ్యచింత నీ ♦ భావమందుఁ
బ్రజ్వరిలఁగాంచి పొంగిన ♦ వాఁడవేని,
కష్టములమీఁదఁ గష్టముల్ ♦ గలిగెనేని
దీని నెరవేర్చితీరెద ♦ దీనికొఱకె
నన్నుఁబుట్టించెఁ బ్రభువని ♦ యెన్నఁడేని
ప్రబలబలమాత్మ కొసఁగిన ♦ వాఁడవేని
ఎఱుఁగఁగలవీవు గాంధి దా ♦ నెట్టివాఁడొ.

ఆర్యమహిమాస్వరూపమ ♦ హర్షి యితఁడు

అతులశాంతాత్ముఁడైన మ ♦ హాత్ముఁడితఁడు

దేహమ్ముఁ దాల్చినట్టి ప్ర ♦ తిజ్ఞయితఁడు

భీతియేమి యెఱుంగని ♦ వీరుఁడితఁడు

ఎట్టిబాధకు లొంగని ♦ దిట్టయితఁడు

దారిఁజూపంగ నేర్చిన ♦ తారయితఁడు

ఎప్పుడైనను నెటనైన ♦ నీశ్వరుండు

వ్యక్తమగునను సత్యమ్ముఁ ♦ వ్యక్తపఱుప

నవనిపైఁబుట్టియున్నట్టి ♦ వ్యక్తియితఁడు

మాయలోఁబడియుండుసా ♦ మాన్యులైన

మర్త్యులకగోచరంబయి ♦ మానముగను
బ్రిచలితంబయి స్వర్గసా ♦ మ్రాజ్యమందు
శాశ్వతంబుగ నొప్పారు ♦ శాసనమును
స్పష్టతరముగఁ దనదివ్య ♦ దృష్టిఁగాంచి
అన్నివిధముల దానితో ♦ నైక్యమంది
అంతమెఱుఁగని దానిలో ♦ నరయఁదొడఁగె
స్వీయమానవజాతికిఁ ♦ స్థిరముగాను
న్యాయమొనరింపఁగలుగు మ ♦ హాపథమును
అతుల సద్గుణకంధి మ ♦ హాత్మ గాంధి

చూడు మనపయి వెలిఁగియు ♦ సూర్యకరణి
శుద్ధమతితోడ మనలను ♦ నుద్ధరింప
మహికినెట్టులు వంగెనో ♦ మనుజసరణి
మనుజుఁ బ్రేమించి దేవుఁడా ♦ మనుజుఁడనుచు
నేను నీవును నమ్మెదు ♦ దానికిపుడు
ప్రబల దృష్టాంతరూపమై ♦ పరఁగినాఁడు
అతుల సద్గుణ కంధి మ ♦ హాత్మగాంధి.

యతిగీతము.

(శ్రీవివేకానందస్వామిగారి ఆంగ్లగీతమున ననుసరించి

రచింపఁబడిన గీతమాలిక)

ఎత్తిపాడుము కంఠము ♦ నెత్తిపాడు
యతివరా! ధీర! ఓంతత్స ♦ దనుచుఁబాడు
పుట్టినీగీతమతిదూర ♦ భూమియందు
విషయవాసన కందని ♦ విషయమందు
కామధనకీర్తి కాంక్షలఁ ♦ గలఁతగానని
శాంతిమయకందరారణ్య ♦ చయమునందు
చారుతరసచ్చిదానంద ♦ పూరమందు
ఎత్తిపాడుము కంఠము ♦ నెత్తిపాడు
యతివరా! ధీర! ఓంతత్స ♦ దనుచుఁబాడు

• పట్టి త్రెంపుము త్రెంపునీ ♦ బంధనముల
మించుబంగారువే కాని ♦ మించకుండు
నినుపవే కాని మఱియవి ♦ యేవిగాని

పట్టి త్రెంపుము త్రెంపుసీ ♦ బంధనముల
ద్వంద్వములు మంచిచెడ్డలుఁ ♦ బంధనములె
వైరరాగాదులునుగూడ ♦ బంధనములె
గానఁదెగఁద్రుంపవలయును ♦ వీనిఁగూడ
కొట్టఁబడినను బ్రేమచేఁ ♦ జుట్టఁబడిన
దాస్యమెట్లుండినను గూడ ♦ దాస్యమెకద
కట్టఁజాలదె గొలుసు బం ♦ గారుదైనఁ
గాన వేగమె తెగఁద్రెంచి ♦ వీని నెల్ల
యతివరా! ధీర! ఓంతత్స ♦ దనుచుఁబాడు

మినుకు మినుకని చీఁకటిన్ ♦ మీఁదమీఁద
నలముచుండెడు కొఱవిద ♦ య్యంబుపగిదిఁ
దనరునజ్ఞానమును బాపి ♦ కొనుము వేగ
జననమరణమ్ములకులాగి ♦ కొనుచునేగు
జీవితపుఁ దృష్ణనార్పుము ♦ శీఘ్రముగను
తన్నుఁదాగెల్చునేని వాఁ ♦ డన్నిగెల్చు
దీనిఁదెలియుము లొంగకు ♦ దేనికింక
యతివరా! ధీర! ఓంతత్స ♦ దనుచుఁబాడు

అవనిఁజల్లినదెద్దియో ♦ యదియెపండుఁ
గారణమ్మునుబట్టియే ♦ కార్యముండుఁ
జెడ్డచెడ్డకుమంచి మం ♦ చికినిగలుగు
దీనిఁదప్పించుకొనుటకుఁ ♦ దెరవులేదు
రూపుతోఁబంధనంబుండు ♦ రూఢముగను
అన్నిటిని మీఱియున్నది ♦ యాత్మగాన
నాత్మకునురూప నామధే ♦ యములులేవు
అదియెనీవను సత్యంబు ♦ మదినెఱింగి
యతివరా! ధీర! ఓంతత్స ♦ దనుచుఁబాడు

తల్లియని తండ్రియని మఱి ♦ పిల్లలనుచు
భార్యయని మిత్రమని మఱి ♦ బంధువనుచుఁ
గలవరించెడువారలు ♦ దెలియలేరు
సత్యమేదియొ మఱియు న ♦ సత్యమెదియొ
ఆత్మకాలేదు స్త్రీపురు ♦ షాదిభేద
మెవనికిందండ్రి మఱియాతఁ ♦ డెవనిబిడ్డ
యెవనిశత్రువు మఱియాతఁ ♦ డెవనిసఖుఁడు
ఒక్కటే యాత్మయంతట ♦ నొప్పుచుండు

అంతయును నాత్మ కాని య ♦ న్యంబు లేదు
అదియె నీవను సత్యంబు ♦ మదినెఱింగి
యతివరా! ధీర! ఓంతత్స ♦ దనుచుఁ బాడు

ఉండునదియెల్లఁ దానై ♦ యొక్కఁడుండు
నాతఁడే జ్ఞాత ముక్తుండు ♦ నాత్మయతఁడె
ఆతనికి రూప నామధే ♦ యములు లేవు
ఆతనికి దోషమింతయు ♦ నంటకుండు
నతనిలో నొక్కమాయ దా ♦ నలరుచుండుఁ
గలలనెన్నియొ యద్దియే ♦ కనుచునుండుఁ
గాని యాయాత్మసాక్షియై ♦ కాంచుచుండు
నదియెనీవను సత్యంబు ♦ మదినెఱింగి
యతివరా! ధీర! ఓంతత్స ♦ దనుచుఁ బాడు

ముజ్జగంబీయఁజాలని ♦ ముక్తికోఱకు
నెచట వెదకెదు? మిత్రమా! ♦ యెట వెదకెదు?
గ్రంథముల గుళ్ళ వెదకినఁ ♦ గలదె ఫలము?
నిన్ను దాలాగి కొనిపోవు ♦ చున్న త్రాడు

నీకరమునందె యున్నది ♦ నిజముగాను;
వగచుటనుమాని నీవింక ♦ వదలిదాని
యతివరా! ధీర! ఓంతత్స ♦ దనుచుఁబాడు

ఎట్టిప్రాణియునానుండి. ♦ యించుకైనఁ
బడయకుండునుగాక య ♦ పాయమెపుడు
పైవసించెడు మఱికిందఁ ♦ బ్రకుచుండు
నన్ని ప్రాణులకును నాత్మ ♦ యయినవాఁడ
ఇహాపరంబుల జీవిత ♦ మెడలినాఁడ
స్వర్గనరకాశభయముల ♦ వదలినాఁడ
ననుచు నీబాధనంబుల ♦ నట్టుత్రెంచి
శాంతిపారమొసంగుచు ♦ సర్వమునకు
యతివరా! ధీర! ఓంతత్స ♦ దనుచుఁబాడు

కాయమేమైనలక్ష్యమ్ము ♦ సేయఁబోకు
దానిపనిదీరెఁ గావున ♦ దానిఁబట్టి
కొట్టుకొనిపోని కర్మమే ♦ గట్టుకేని
దానికగునట్టి మండన ♦ దండనముల

యతిగీతము.

నించుకేనియు నెంచకు ♦ మేమియనకు
పొగడఁబడువాఁడు మఱియును ♦ బొగడువాఁడు
తిట్టఁబడువాఁడుమఱియును ♦ దిట్టువాఁడు
నొక్కఁడైయుండ స్తుతినింద ♦ లున్న చెపుమ
స్వాంతమున నివ్విధంబున ♦ శాంతినించి,
యతివరా! ధీర! ఓంతత్స ♦ దనుచుఁబాడు

కామమును మోహలోభముల్ ♦ గలుగుచోట
నుండునే సత్యమెన్నఁడు ♦ నుండఁబోదు
ఇంతినిఁ దనపత్నిగా ♦ నెన్నునట్టి
పురుషుఁడెన్నఁడు పూర్ణతఁ ♦ బొందలేఁడు
తనదనుచునెంత చిన్నదేఁ ♦ దలఁచువాఁడు
అగ్రహాగుణంబుచే బద్ధుఁ ♦ డైనవాఁడు
తథ్యముగమాయగుమ్మము ♦ దాఁటలేఁడు
గాననీదుర్గుణమ్ముల ♦ మానివేసి.
యతివరా! ధీర! ఓంతత్స ♦ దనుచుబాడు

నీకునిల్లేల? నినుఁబట్టు ♦ నిలయమున్నె?
గడ్డిమోపరుండుపాన్పు ఆ ♦ కసమెకప్పు
చిక్కినదెతిండిమంచిదేఁ ♦ జెడ్డదేని
మంచిచెడ్డలమదిలోన ♦ నెంచఁబోకు
తన్నుఁదెలిసిన మహాత్మ ♦ కెన్నఁడేని
నమరునెకళంకమన్న పా ♦ నములచేత?
పాఱునేఱుగ నెప్పుడు ♦ బరఁగుచుండి
యతివరా! ధీర! ఓంతత్స ♦ దనుచుఁబాడు

కొందఱే సత్యమెఱుఁగుచు ♦ నుందురిలను
గానఁదక్కినవారలు ♦ ఘనుఁడ నిన్నుఁ
జేరినవ్వాన లక్ష్యమ్ము ♦ సేయఁబోకు
ముక్తుఁడా యెల్లకడలకుఁ ♦ బోయిపోయి
మోదమునకయి వెదకక ♦ ఖేదమునకు
భయపడకయుండి రెంటిని ♦ వదలిచనుచు
మాయ తెఱఁ దీసి జనులత ♦ మమ్ముఁబాపి
యతివరా! ధీర! ఓంతత్స ♦ దనుచుఁ బాడు

సర్వకర్మఫలంబులు ♦ సమయువఱకు
ననుదినంబివ్విధంబునఁ ♦ జనుచునుండి
నీవు నీయాత్మకొసఁగుము ♦ నిత్యముక్తి;
అప్పుడుండదు నీవు నే ♦ ననుటగాని
జననమును దేవమానవు ♦ లనుటగాని
ఆత్మపరమాత్మలకు భేద ♦ మనుటగాని
అదియెయానందమును మఱి ♦ యదియెనీవు
యతివరా! శ్రీర! ఓంతత్స ♦ దనుచుఁ బాడు

ఉత్పలము.

పాపములెల్లఁబోఁద్రోలఁచి ♦ భావములోఁ బరిశుద్ధభక్తియన్
దీపము వెల్గఁజేసి భవ ♦ దీయదయామృతవృష్టిచేత నా
తాపములెల్లనార్చినను ♦ ధన్యునిజేయు మటంచు వేఁడి నీ
ప్రాపును జేరినాఁడను గృ ♦ పాగుణభూషణ! భక్తపోషణా!

ప్రార్థన.

గీతములు.

దేవ! నీదయభువిని నా ♦ జీవితమ్ము
దివ్యతరమగు నొకచిన్న ♦ దీపమగుచు
నెచట నేనున్న నచ్చట ♦ నెఱయుంజోడ
విమలతరమైన కాంతితో ♦ వెలుఁగుఁగాత.

దేవ! నీదయభువిని నా ♦ జీవితమ్ము
సహజమైనట్టి తనవికా ♦ సమునఁబొదలి
ముదమునొదవించు నొకచిన్న ♦ పుష్పమగుచు
నల్పమాతన నెలవున ♦ నలరుఁగాత

దేవ! నీదయభువిని నా ♦ జీవితమ్ము
దైన్యమును బాపిపరులకు ♦ ధైర్యమొసఁగి
పాటకానిని సంతోష ♦ పఱచునట్టి
చిన్నయొకగీతరత్నమై ♦ చెలఁగుఁగాత

దేవ! నీదయభువిని నా ♦ జీవితమ్ము
శక్తికొలఁదిని బరులకు ♦ సాయమిడుచు
నబలులకునెల్ల నాదరు ♦ వైనచిన్న
యూఁతగట్టిగ సతతంబు ♦ నొప్పుఁగాత

దేవనీదయభువిని నా ♦ జీవితమ్ము
వింతఁగొల్పెడు నీకార్య ♦ వితతికలరి
పొంగిపారెడుభక్తితోఁ ♦ బొగడుచుండు
నందమౌచిన్నకీర్తన ♦ యగునుగాత.

దేవ! నీదయభువిని నా ♦ జీవితమ్ము
నవ్యభవదీయ మణిభూష ♦ ణమ్మునందు
నమరితనచోట నగకెల్ల ♦ నందమిచ్చు
చిన్నముత్తెంపుఁబూసయై ♦ చెలఁగుఁగాత.

ఉద్బోధన.

గీతములు.

చిమ్మచీఁకటి నీత్రోవఁ ♦ గ్రమ్మియున్న
ధైర్యమెదఁగొమ్ము సోదరా! ♦ తడఁబడకుము
దారిదీనులకును జూపు ♦ తారగలదు
దైవమును నమ్మిచేయుము ♦ ధర్మమెపుడు

తెరువుకడుభీకరంబైన ♦ దీర్ఘమైనఁ
గన్నులకగోచరంబుగ ♦ గమ్యమున్న
భయపడకపొమ్ము బలమున్న ♦ బడలియున్న
దైవమును నమ్మిచేయుము ♦ ధర్మమెపుడు

మాయమర్మమ్ములెల్లను ♦ మడియనిమ్ము
వెలుఁగునకు జంకునవియెల్లఁ ♦ బొలియనిమ్ము
కలిమిలేములనేదైనఁ ♦ గలుగనిమ్ము!
దైవమును నమ్మిచేయుము ♦ ధర్మమెపుడు

ఎగసిపోనిమ్ము దుశ్చింత ♦ లెట్టివైన
దయ్యములు దేవతలరూపు ♦ దాల్చెఁగాన
సరకుసేయకుపైమతా ♦ చారములను
దైవమును నమ్మిచేయుము ♦ ధర్మమెపుడు.

ద్వేషమునఁగాంత్రు కొందఱు ♦ ప్రేమఁగాంత్రు
పొగడుచుందురు కొందఱు ♦ దెగడుచుంద్రు
మానిమనుజున్ని నాపయి ♦ వానిఁగనుము
దైవమును నమ్మిచేయుము ♦ ధర్మమెపుడు

సరళశాసన దాతయు ♦ సత్యనేత
లోనిశాంతియు నిగనిగ ♦ లీనుజ్యోతి
యైనయొకతారసీదారి ♦ నధివసించు
దైవమును నమ్మిచేయుము ♦ ధర్మమెపుడు

వందనములు.

గీతములు.

సృష్టియొనరించియున్నావు ♦ శ్రీకరముగఁ
పాలనము సేయుచున్నావు ♦ భాసురముగ
నంత మొనరింపఁగలవు మ ♦ హాద్భుతముగ
ప్రభువతంసమ! ఇవిగో నా ♦ వందనములు.

ప్రాణదాతవు నేతవై ♦ పరఁగినావు
ప్రాణమునకును బ్రాణమై ♦ పరఁగినావు
ప్రాణమునకంటెఁ బ్రియుఁడవై ♦ పరఁగినావు
ప్రాణనాయక! ఇవిగో నా ♦ వందనములు

దుఃఖములచేత హృదయమున్ ♦ దున్నిదున్ని
పరమకరుణామృతమ్మును ♦ గురిసి కురిసి
మించుసద్గుణములను బం ♦ డించుచున్నట్టి
పరమపావన! ఇవిగో నా ♦ వందనములు

కన్నులారంగ మనములఁ ♦ గనుచునుండి
వీనులారంగ మనవుల ♦ వినుచునుండి
యంతటనునిండి యాత్మకు ♦ నాత్మవగుచుఁ
బరఁగుపరమాత్మ! ఇవిగో నా ♦ వందనములు.

నీదుమహిమలఁ గనుఁగొని ♦ నిన్నుఁబొగడఁ
బరులకుపకార మొనరించు ♦ పనులుసేయ
నచ్చెరువుగొల్పు నరదేహ ♦ మిచ్చినావు
పరమపిత! హిత! ఇవిగో నా ♦ వందనములు

గర్భమునజీవకోటులఁ ♦ గరుణఁదాల్చి
కావలసినట్టివెల్లను ♦ గరుణనొసఁగి
బుద్ధులనునేర్పి కరుణతో ♦ నుద్ధరించు
పరమజననిరో! ఇదిగో నా ♦ వందనములు.

దివ్యదృశ్యంబులెల్లను ♦ దెఱచిచూపి
జ్ఞానమణిజ్యోతిచేతను ♦ మానసమును
వెలుఁగఁగాఁజేసిలోవెలి ♦ వెలుఁగుచుండు
పరమగురువర! ఇదిగో నా ♦ వందనములు

గుట్టులనురట్టుసేయక ♦ కూర్మితోడ
వింతగాఁజింతలనుబాపి ♦ సంతసమిడి
వీడకెప్పుడువెనువెంట ♦ వేచియుండు
పరమమిత్రమ! ఇదిగో నా ♦ వందనములు

హారతి.

చంపకము

గగనవిశాలపాత్రమునఁ ♦ గ్రాల-గజ్యోతులుచంద్రభాస్కరుల్
సొగసుగ ముత్తెముల్ పగిది ♦ శోభిలఁజుక్కలుకమ్మతెమ్మెరల్
నెగడఁగఁజామరమ్ములుగ ♦ నిండుగవిచ్చిన పూలుచెట్లలో
నిగనిగలీనదుందుభులు ♦ నివ్వెఱమ్రోయ స్వయమ్ముగాసదా
యగణితవైఖరిం జెలఁగు ♦ హారతినీకుఁ ద్రిలోకనాయకా !

భక్తమణిభూషణము.

భక్తిరసపూరితము, సర్వజనమనోరంజకము, ఉదారాశయ విభాసితము, నానావిషయ సంశోభితము. వెల. 2.0-0

ఆంధ్రకుమారసంభవము. 8 సర్గలుమాత్రము.

కవిసార్వభౌముఁడగు శ్రీకాళిదాసుని రసపూరితము లైన శ్లోకములును వానికి సరియైన తెనుఁగుపద్యములును గలిగిన గ్రంథరాజము వెల 0-12-0

గీతాంజలి.

ఆసియాకవిసార్వభౌముఁడని బిరుదువడసిన శ్రీరవీంద్రనాథ ఠాకూరుగారికి 1, 20, 000 రూప్యముల బహుమతిని దెచ్చిన ఆంగ్ల గీతాంజలికి సరియైన తెనుఁగుపద్యములు వెల. 0-12-0

కిన్నరీవిజయము.

ఆంగ్లమునుండి తెనిఁగింపఁబడిన యతివిచిత్రమును నవరసభరితమునైన యొకచిన్న కావ్యము వెల 0-12-0

రామమోహననాటకము.

యుగపురుషుఁడని ప్రఖ్యాతివడసిన శ్రీరాజారామమోహనరాయలచరిత్రము గలిగి భక్తిరసపూరితమైన చక్కని నాటకము. వెల 0-8-0

బుధభూషణము.

ఆంగ్లకవితా ప్రాగల్భ్యమును జూపుచు 12 విషయములను గూర్చి వ్రాయఁబడిన మృదుమధురములయిన సుమారు 100 పద్యములు. వెల 0-6-0

ఆ. సోమనాథరావు.

9 ముద్దుకృష్ణ మొదలివీధి, మైలాపూరు, మదరాసు.